thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 166 కరీంనగర్ ఆదివారం, 24 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 'తుంగభద్ర'పై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం..

బెంగళూరు : తుంగభద్ర డ్యాం కు గతేడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటును అమర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. టీబీడ్యాంపై కొప్పళ జిల్లా బీజేపీ బృందం పర్యటించింది. ప్రతిపక్ష నాయకుడు దొడ్డగౌడ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసవరాజ్ కావటూర్, రమేష్, గణేష్, మంజునాథ్, మల్లికార్జున తదితర నాయకులు బృందంలో ఉన్నారు. దెబ్బతిన్న 19వ క్రస్ట్ గేటు స్థానంలో కొత్త గేటు అమర్చేందుకు రూ.2 కోట్ల వ్యయంతో టెండర్ పిలిచారని, కానీ మళ్లీ రద్దు చేశారన్నారు. ఇక మిగిలిన గేట్లకు ఎప్పుడు టెండర్ పిలుస్తారో.. ఎప్పుడు మరమ్మత్తుచేస్తారో ఆయోమయంగా ఉందని మండిపడ్డారు. డ్యాంకు నీరు వస్తున్న తరుణంలో గేట్లు పటిష్టంగా లేకుంటే నీరు ఎలా నిలుస్తాయని ప్రశ్నించారు. ఇది పూర్తీగా సర్కార్ వైఫల్యమేనన్నారు. పలువురు బీజేపీ నాయకులు డ్యాంను పరిశీలించారు.



## నేడు సీపీఐ కార్యాలయానికి సురవరం పార్థివ దేహం

హైదరాబాద్: గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో ఉన్న సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత సహా పలువురు పార్టీ నాయకులు, సీపీఎం నేతలు నివాళులర్పించారు. అభిమానుల సందర్శనార్థం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో సురవరం భౌతిక కాయాన్ని ఉంచనున్నారు. అనంతరం పార్థివ దేహాన్ని గాంధీ ఆస్పత్రికి అప్పగించనున్నారు. సురవరం నేత్రాలను కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందజేయనున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సురవరం కన్నుమూసిన సంగతి తెలిసిందే. వయోభారానికి తోడు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికుల పక్షాన బలంగా సురవరం తన గళం వినిపించారని అన్నారు. నల్గొండ ప్రాంతంలో ఫ్లోరోసిస్, కరవు పరిస్థితులపై పోరాటాలు చేపట్టినట్లు గుర్తు చేసుకుంటూ.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఇక 'వోట్ చోరీ'పై ప్రజల్లోకి వెళ్లనున్న కాంగ్రెస్




హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో నేడు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోసహా కాంగ్రెస్ అడ్వైజరీ కమిటీ, మంత్రులు పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎమ్మెల్యేల అనర్హత అంశం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వంటి పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బీజేపీ, ఈసీల 'వోట్ చోరీ' అంశంపై ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. ఇకపై 'వోట్ చోరీ' అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ మేరకు నేటి సభలో 'వోట్ చోరీ' ప్రచార లోగోను సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ తదితరులు ఆవిష్కరించారు. 'వోట్ చోరీ' అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో, పట్టణాల్లో దీనిపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ పెద్దలు పేర్కొన్నారు.




## ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత..

### పాలకడలిని తలపించేలా ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద

నిజామాబాద్ జిల్లా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. వరద తగ్గడంతో అధికారులు శుక్రవారం జలాశయం గేట్లు మూసివేశారు. మళ్లీ ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి పెరగడంతో అర్ధరాత్రి 16 గేట్లను ఎత్తి 78,812 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో పాలకడలిని తలపించేలా.. వరద నీరంతా దిగువకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 78 వేల క్యూసెక్కులు కాగా.. కాకతీయ కాల్వ ద్వారా 3500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4500 క్యూసెక్కులు, ఇందిరమ్మ కాల్వ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.7 అడుగులుగా ఉంది.




# హీటెక్కుస్తున్న రాష్ట్ర రాజకీయాలు!

## ఉప ఎన్నికలు తప్పవేమో!

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సంచలన నిర్ణయం..!!

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేల పై స్పీకర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల పైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పార్టీ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో కాల పరిమితి విధిస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. దీనికి అనుగుణంగా ఇప్పుడు స్పీకర్ కలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో, ఇప్పుడు ఈ నిర్ణయం తెలంగాణలో రాజకీయంగా సంచలనంగా మారుతోంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల పైన అనర్హత వేటు కోసం బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. దీని పైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. బీఆర్ఎస్ ఫిర్యాదు దృష్ట్యా విచారణకు హాజరై, వివరణ ఇవ్వాలని ఐదుగురు ఎమ్మెల్యేలకు ఆయన నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులను సిద్ధం చేస్తుండగా, వారికీ త్వరలోనే జారీ చేయనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిపై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. కాగా, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ జూలై 25న తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో న్యాయ నిపుణులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ చర్చలు చేసారు. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఎమ్మెల్యేలపై నిర్ణయం.. పూర్తిగా స్పీకర్ పరిధిలోనిదేనని అసెంబ్లీ వర్గాలు చెబుతున్నాయి. అయినా, సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి బీఆర్ఎస్ ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసారు. అయితే, విచారణకు సంబంధించి నిర్దేశిత సమయాన్ని ఆ నోటీసుల్లో పేర్కొనలేదని తెలుస్తోంది. తాజా నోటీసుల జారీతో సుప్రీం కోర్టు నిర్దేశించిన గడువు లోపల పది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసి స్పీకర్ ప్రసాద్ మార్ నిర్ణయం ప్రకటిస్తారా లేదా అనేది కీలకంగా మారుతోంది. కాగా.. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్ లోనే న్నామంటూ పలు సందర్భాల్లో ప్రకటించారు. శాసనసభ రికార్డుల్లోనూ పది మంది ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారు. అయితే, దానం నాగేందర్ మాత్రం గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ సహా మిగిలిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీసుకొనే నిర్ణయం పైన రాజకీయంగా ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఆగని 'నీళ్ల' లొల్లి!




## ఏపీ ప్రాజెక్టులను అడ్డుకుంటామంటున్న తెలంగాణ సర్కార్!

### అవి గోదావరి నీళ్లు కాదు.. హిమాలయ జలాలు .. మేము ప్రాజెక్టు కడితే నీళ్లు ఎక్కడుంటాయి..?

హైదరాబాద్ / అమరావతి : ఏపీ నిర్మించాలనుకుంటున్న మరో నాలుగు ఇంట్రా లింక్ (రాష్ట్రం లోపల నదుల అనుసంధానం) ప్రాజెక్టులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదని తెలంగాణ తేల్చి చెప్పింది. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, బాబు జగ్జీవన్ రామ్‌ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వైఎస్ఆర్ పల్నాడు డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్ట్, గుండ్రేవుల రిజర్వాయర్లను ఇంట్రా లింక్ కింద చేపట్టేందుకు కేంద్రం సహకరించాలని ఏపీ కాన్సెప్ట్ నోట్స్ సబ్‌మిట్ చేసిందని పేర్కొంది.ఆ ప్రాజెక్టులన్నీ కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్ అవార్డులు, విభజనచట్టంలోని నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది.అయినా, పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌లు ఇవ్వాలని ఎలా అడిగారని ప్రశ్నించింది. ఇలాంటి ప్రాజెక్టులను సెంట్రల్‌వాటర్ కమిషన్ కూడా పరిగణనలోకి తీసుకోలేదని, కొన్ని ప్రాజెక్టులను అనుమతి లేని ప్రాజెక్టుల జాబితాలో 2021లో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌లో చేర్చించిందని గుర్తు చేసింది. ఈ ఇంట్రా లింక్ ప్రాజెక్టులు కేంద్రం నేషనల్‌పర్ స్పెక్టివ్ ప్లాన్ (ఎన్‌పీపీ)లో భాగంగా తీసుకున్న ఏ లింక్‌లోనూ భాగం కాదని స్పష్టం చేసింది. ఇప్పటికే ఇలాంటి ప్రాజెక్టులపై సీడబ్ల్యూసీ అభ్యంతరాలు వ్యక్తం చేసిందని.. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌లో భాగంగా 200 టీఎంసీల వరద జలాలను తరలించేందుకు ఏపీ చేస్తున్న ప్రయత్నాలపైనా అన్ని ఏజెన్సీలు అభ్యంతరం తెలిపాయని, అది గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు విరుద్ధమని చెప్పాయని గుర్తుచేసింది.

**అవి గోదావరి నీళ్లు కాదు..హిమాలయ జలాలు: ఎన్‌డబ్ల్యూడీఏ...** గోదావరి కావేరి లింక్‌లో తరలిస్తున్న నీళ్లు గోదావరి జలాలు కాదని ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మన్ స్పష్టం చేశారు. నదుల అనుసంధానంలో భాగంగా హిమాలయ పర్వతాల్లోని నదుల నీటిని ఇక్కడకు తీసుకొస్తామని చెప్పారు. అయితే, ఫేజ్ 1లో ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మించి గోదావరి నీళ్లను తీసుకెళ్తామని, భవిష్యత్‌లో ఇంటర్ లింకింగ్ ద్వారా హిమాలయ జలాలను ఇక్కడకు తీసుకొస్తామని పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్ అభ్యంతరాలనూ ఆయన పరిగణనలోకి తీసుకున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ చత్తీస్‌గఢ్ నీళ్లను ముట్టుకోబోమన్నారు. అయితే, బోధ్‌ఘాట్ ప్రాజెక్టును నిర్మించేందుకు కనీసం 15 ఏండ్లైనా పడుతుందని, అప్పటి వరకు జీసీ లింక్‌లో తాత్కాలికంగా మాత్రమే చత్తీస్‌గఢ్ నీటిని వాడుకుంటామని స్పష్టం చేశారు. చత్తీస్‌గఢ్ బోధ్‌ఘాట్ ప్రాజెక్టును పూర్తి చేస్తే.. జీసీ లింక్‌ను మూసేస్తామన్నారు. అప్పుడు హిమాలయాల నుంచి నీటిని ఇచ్చంపల్లి వరకు తరలిస్తామని పేర్కొన్నారు. గోదావరిలో ఒక్క చుక్క కూడా వాడుకోబోమని స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలూ పెద్దమనసు చేసుకుని ప్రస్తుతానికి జీసీ లింక్‌కు సమ్మతం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

**మేం ప్రాజెక్ట్ కడితే నీళ్లు ఎక్కడుంటయ్ : చత్తీస్‌గఢ్...** జీసీ లింక్‌పై చత్తీస్‌గఢ్ పలు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఆ రాష్ట్రం వాడుకోని నీళ్ల ఆధారంగానే లింక్ చేపడుతున్నందున.. నీటి వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. తమకు 301 టీఎంసీల వాటా ఉన్నదని, అందులో ఇప్పటికే 164 టీఎంసీల వినియోగం ఉందని పేర్కొంది. మిగిలింది 137 టీఎంసీలని పేర్కొంది. అందులోనూ వంద టీఎంసీలతో బోధ్‌ఘాట్ ప్రాజెక్టును నిర్మిస్తున్నామని, అలాంటప్పుడు నీటి లభ్యత ఎలా ఉంటుందని ప్రశ్నించింది. అలాగే, పరీవాహక ప్రాంతం ఆధారంగా తమకు 45 టీఎంసీల నీళ్లివ్వాలని కర్నాటక డిమాండ్ చేసింది. కనీసం 40 టీఎంసీలైనా కేటాయించాలని కోరింది. కాగా, గోదావరి అత్యధిక భాగం మహారాష్ట్రలోనే ప్రవహిస్తున్నదని, 45 శాతం పరీవాహక ప్రాంతం ఇక్కడే ఉందని ఆ రాష్ట్రం పేర్కొంది. అలాంటి తమకు ఒక్క చుక్క కూడా నీళ్లు ఇవ్వకుండా బయటకూర్చోబెట్టేశారని ఆక్షేపించింది. జీసీ లింక్‌లో నీళ్లు ఇవ్వకపోయినా.. తమకు కొన్ని ఇంట్రా లింక్స్?ఉన్నాయని, వాటిని జీసీ లింక్?లో భాగంగా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేసింది.




## 10 రోజులుగా జలదిగ్బంధంలోనే ఏడుపాయల వనదుర్గమ్మ

మెదక్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ ఆలయం గత 10 రోజులుగా జలదిగ్బంధంలోనే ఉంది. రాజగోపురంలో ఉన్న ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. సింగూర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో వనదుర్గ ఆనకట్ట నుంచి 42,800 క్యూసెక్కుల వరద నీరు పొంగిపొర్లుతోంది. గర్భగుడి ముందున్న మూడు పాయలు కలిసి ఒకే పాయగా, గుడి వెనుక ఉన్న నాలుగు పాయలు కలిసి ఒకే పాయగా మంజీర నది ప్రవహిస్తోంది. వరద ఉద్ధృతి తగ్గగానే అమ్మవారి దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. వనదుర్గ ఆనకట్టవైపు, గర్భగుడి వైపు భక్తులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు పహారా కాస్తున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ కోర్ కమిటీ భేటీ.. బీసీ రిజర్వేషన్, స్థానిక ఎన్నికలపై చర్చ

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పీసీసీ కోర్ కమిటీ సభ్యుల సమావేశం ముగిసింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహ ప్రతివ్యూహాలపై చర్చించారు. కోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబరు 30వ తేదీ లోపు ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం భావించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు ఎలా అనే అంశంపై సమావేశంలో చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ముగ్గురు మంత్రులకు ఆ నియోజకవర్గ ఉప ఎన్నిక వ్యవహారాన్నీ అప్పగించినందున పార్టీ పరంగా బలోపేతమయ్యేందుకు ముమ్మరంగా కసరత్తు కొనసాగుతున్నట్లు సభ్యుల దృష్టికి పీసీసీ అధ్యక్షుడు



మహేశ్‌కుమార్ గౌడ్ తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఉన్న ఫిర్యాదులను స్పీకర్ పరిశీలించారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చిన స్పీకర్ మిగిలిన వాళ్లకు కూడా ఒకటి రెండు రోజులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా ముందుకు వెళ్లాలి అన్న అంశంపై చర్చించినట్లు సమాచారం.




## రాష్ట్ర మంత్రులు బాధ్యతగా ఉండాలి.. కేంద్రంపై విమర్శలు తగవు: ఎంపీ ఈటల

హైదరాబాద్: తెలంగాణకు కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రావాలని భాజపా ఎంపీలుగా తాము కూడా కోరుకుంటామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భాజపా ఎంపీలమైనప్పటికీ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. యూరియా సమస్య కూడా పరిష్కారం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర మంత్రులు బాధ్యతగా ఉండాలని, అనవసరంగా కేంద్రంపై విమర్శలు చేయొద్దన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై సచివాలయంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన అనంతరం ఈటల మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించలేదని ఈటల పేర్కొన్నారు. తమ దృష్టికి వచ్చిన కొందరు పేదల జాబితాను మంత్రి పొంగులేటికి ఇచ్చినట్టు తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణం రూ.5 లక్షలతో పూర్తయ్యే పరిస్థితి లేదని, కనీసం రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో వాటిలో దొంగలు పడుతున్నారన్నారు. జవహర్‌నగర్‌లో మాజీ సైనికోద్యోగులకు సంబంధించిన భూముల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లను కూల్చడం సరికాదన్నారు.

## ఈ నెల చివరిలోగా 37,877 మెట్రిక్ టన్నుల యూరియా: మంత్రి తుమ్మల

హైదరాబాద్: యూరియా సరఫరా కోసం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్న దృష్ట్యా.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రస్తుతం 42 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇవాళ 6,543 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, ఈ నెల చివరి వరకు మరో 37,877 మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సచివాలయంలో రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) సీఈఓ అలోక్ సింఘాల్, నాగార్జున ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఎన్‌ఎఫ్‌సీఎల్) తెలంగాణ సేల్స్ మేనేజర్ రాజేశ్‌తో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి రావాల్సిన యూరియా కోటాలో ఇంకా 62,473 మెట్రిక్ టన్నులు అందలేదని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సరఫరా ఆలస్యమవ్వడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రస్తావించారు. రైతుల పంటలపై ప్రతికూల ప్రభావం పడకముందే రాష్ట్రానికి రావాల్సిన యూరియా సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముందుగా కనీసం 50 శాతం యూరియా ఈ



వారంలోనే ఆర్‌ఎఫ్‌సీఎల్, లేదా ఎన్‌ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్రానికి పంపేలా చూడాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా ఎరువుల పంపిణీ తక్షణమే జరగాలని స్పష్టం చేశారు. దానిపై స్పందించిన అలోక్ సింఘాల్ రైతుల అవసరాలను తీర్చడానికి యూరియా త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.






హైదరాబాద్: ఓపెన్ ఏఐ తన కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా కోరారు. ఇటీవల ఆ కంపెనీ సీఈవో శామ్ అల్ట్‌మన్ భారత్‌లో కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సెప్టెంబర్‌లో ఇక్కడ పర్యటిస్తామన్నారు. ఈక్రమంలో కేటీఆర్ ఆయనకు స్వాగతం పలికారు. భారత్‌కు హైదరాబాద్‌ను గేట్‌వేగా అభివర్ణించారు. ఓపెన్ ఏఐ లాంటి సంస్థలకు ఆదర్శవంతమైన కేంద్రమని పేర్కొన్నారు.




హైదరాబాద్: హైడ్రాపై ప్రజలకు మరింత క్లారిటీ రావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "హైడ్రా.. ఒకటి రెండేళ్లకు పరిమితం కాదు.

వందేళ్ల ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ప్రస్తుతం ఆరు చెరువులు అభివృద్ధి చేస్తున్నాం. సీఎస్‌ఆర్ పేరుతో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. సాంకేతిక ఆధారాలతో ఎఫ్‌టీఎల్ మార్కు చేస్తున్నాం. చెరువుల వద్ద భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. వీటితో పాటు నాలాలను నోటిఫై చేస్తున్నాం రాజకీయ ఉద్దేశంతో హైడ్రా పని చేయడం లేదు. విపత్తుల నుంచి నగర ప్రజలను రక్షించేందుకు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్‌ఆర్ వరకు ఉన్న చెరువులకు సంబంధించి ఈ ఏడాది పూర్తిస్థాయిలో తుది నోటిఫికేషన్‌పై దృష్టి సారించాం. అనేక అవరోధాలు, విమర్శలను ఎదుర్కొంటూ హైడ్రా ఏడాది కాలంగా ముందుకు సాగుతోంది. ప్రజల్లో హైడ్రా పట్ల నమ్మకం పెరిగిందనడానికి కూకట్‌పల్లి నల్ల చెరువు నిదర్శనం" అని రంగనాథ్ తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి: మంత్రి పొన్నం

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో 6 వేల కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లు గుర్తించారు. అధికార పార్టీకి అవకాశమిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రతి బూత్‌కు ఒకరు ఇన్‌ఛార్జిగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకూడదని సూచించారు. నియోజకవర్గంలోని 7 డివిజన్లలో ఇన్‌ఛార్జి ఉపాధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు ప్రభావవంతంగా పని చేయాలని తెలిపారు. డివిజన్లలో కార్యాలయాలు



ప్రారంభించుకోవాలని.. బూత్‌వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రభుత్వ పథకాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ పాల్గొన్నారు.

## హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. దొంగ ఓట్లతోనా?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: బిహార్ ఎన్నికల్లో మంచి వాతావరణం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ఆర్జేడీకి ఒక ఎజెండా అంటూ ఏమీ లేదని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. "బిహార్‌లో ఇల్లీగల్ ఓట్లు ఎక్కువ ఉన్నాయి. హైదరాబాద్‌లో డబుల్ ఓట్లు ఉన్నాయి.. ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. దొంగ ఓట్లతోనా? తీవ్రమైన నేరాల్లో ఉన్న సీఎం, మంత్రులు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగాల్సిందే. గతంలో దీనిపై కాంగ్రెస్ లేఖ రాసింది.. ఇప్పుడు మౌనంగా ఉంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## కూకట్‌పల్లి కేసు.. బ్యాట్ చోరీకి వెళ్లి బాలికను చంపేశాడు: సీపీ మహంతి

హైదరాబాద్: తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన కూకట్‌పల్లి బాలిక హత్య కేసును పోలీసులు ఛేదించారు. బాలిక ఇంటికి సమీపంలో ఉన్న బాలుడే ఆమెను హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. కేసు వివరాలను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మీడియాకు వెల్లడించారు. క్రికెట్ బ్యాట్ చోరీ కోసం వెళ్లిన సమయంలో బాలికను చంపేసినట్లు పేర్కొన్నారు. "విచారణ సమయంలో బాలుడు తప్పుదారి పట్టించాడు. మొదట బాలిక అరుపులు వినిపించాయని అన్నాడు. కానీ, అందులో వాస్తవం లేదు. హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నాం.

బాలుడికి బ్యాట్ నచ్చడంతో దానిని చోరీ చేసేందుకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న బాలిక అతడిని అడ్డుకుంది. దీంతో కత్తితో దాడి చేసి చంపేశాడు. నిందితుడు పాఠశాలకు సరిగా వెళ్లేవాడు కాదు. హత్య గురించి అతడి తల్లిని విచారిస్తే తనకు తెలియదని చెప్పింది" అని సీపీ వివరించారు. ప్రకాశం జిల్లాకు చెందిన దంపతులు కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో హత్యకు గురైన బాలిక ఇంటి





సమీపంలోని అపార్ట్‌మెంట్లో నివాసం ఉంటున్నారు. కుటుంబ పెద్ద కిరాణా దుకాణం నడిపి, నష్టాలు రావడంతో మూసివేశాడు. ఆయన భార్య గచ్చిబౌలిలోని ప్రైవేటు ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. వీరి కుమారుడు (హత్య కేసులో నిందితుడు), బాలిక తమ్ముడు చదివే ప్రైవేటు పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్నాడు.

## బిరబిరా కృష్ణమ్మ.. శ్రీశైలానికి కొనసాగుతున్న వరద ఉద్ధృతి

శ్రీశైలం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి పెరుగుతూనే ఉంది. జలాశయం ఇన్‌ఫ్లో 5,40,756 క్యూసెక్కులు కాగా.. ఔట్‌ఫ్లో 5,16,493 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 29,648 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 10 స్పిల్‌వే గేట్ల ద్వారా 4,21,530 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదల అవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 882.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 199.73 టీఎంసీలుగా కొనసాగుతోంది. **సాగర్‌కు పోటెత్తుతున్న వరద...** శ్రీశైలం నుంచి భారీగా నీరు విడుదలవుతుండటంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్ జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. సాగర్‌కు 4.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 26 గేట్లు ఎత్తి.. 4.18 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 22 గేట్లను 10 అడుగల మేర, నాలుగు గేట్లను 13 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 3.67 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. కుడి కాల్వకు 9,019 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 6,401 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 583.20 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ పూర్తి నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 292.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# కెమెరాకే ట్రిక్కులు నేర్పిన రాజన్ బాబు

## - ఆగస్టు 24... కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు వర్ధంతి



అద్భుతమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, గొప్ప సన్నివేశాలు, అపురూప సంఘటనలు, మనసు దోచే దృశ్యాలు, ఆలోచింప జేసే రూపాలు... అరుదైన చిత్రాలు...వెరసి ఫోటోగ్రఫీ. వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేది ఫోటో. వంద మాటలతో చెప్పలేనిది ఒక్క ఫోటోతో చెప్పడం సాధ్యం. అంతటి శక్తివంతమైనది ఫోటోగ్రఫీ. అలాంటి శక్తిని వశం చేసుకుని ఫోటోతో అద్భుతాలు సృష్టించిన కెమెరా మాంత్రికుడు బండి రాజన్ బాబు. కెమెరాకే ట్రిక్కులు నేర్పిన నేర్పరి రాజన్ బాబు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజన్ బాబు తెలంగాణకు చెందిన వారు కావడం గర్వకారణం. బండి రాజన్ బాబు (ఫిబ్రవరి 9, 1939 – ఆగస్టు 24, 2011) ప్రఖ్యాత ఛాయా చిత్రకారులు. దృశ్య ప్రధానమైన ఛాయా గ్రహణంలో పేరు తెచ్చుకొన్న బండి రాజన్ బాబు 1939, ఫిబ్రవరి 9 న కరీంనగర్ జిల్లా కోరుట్లలో జన్మించారు. రాజన్ బాబంటే తొలుత గుర్తుకు వచ్చేవి అరకు లోయల్లో తీసిన బొండా గిరిజన మహిళల అగణిత ఛాయా చిత్రాలు. బాల్యంలో రంగులు వేయడం, చిత్రాలను గీయడం పట్ల ఆసక్తిని కనబరిచిన రాజన్ బాబు, మంచి చిత్రకారుడు కావల్సి ఉండగా, కుంచె నుండి కెమేరాకు మారడం యాదృచ్ఛికం. బాల్యం నుంచి చిత్రకళ పై మక్కువ ఉన్న రాజన్, 7వ తరగతి చదువు తున్నప్పుడు తన కజిన్ బహుకరించిన సాధారణ కొడాక్ 620 కెమెరాతో తీసిన చిత్రాలు పెక్కుమంది ప్రశంసలు అందుకొని రాజన్ లోని ఛాయాగ్రాహకుడిని వెలికి తీసింది. హైదరాబాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో కమర్షియల్ ఆర్ట్ (వ్యాపార చిత్రకళ) లో డిప్లొమా కోర్స్ లో చేరిన సమయంలో, రాజన్ బాబు ప్రఖ్యాత ఛాయాగ్రహకుడు దివంగత రాజా త్రయంబక్ రాజా బహదూర్ ను కలవటం జరిగింది. రాజా త్రయంబక్ రాజా, రాజన్ బాబును కుంచె స్థానంలో కెమేరా పట్టుకోమన్న సలహా రాజన్ జీవితాన్ని మలుపు తిప్పింది. 5 సంవత్సరాల డిప్లొమా చేసి, కళాశాలలో డిస్టింక్షన్ లో ఉత్తీర్ణుడయి, కళాశాల యాజమాన్యం మెప్పు పొంది అదే కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. తరువాత ఇక్రిశాట్ లో సైంటిఫిక్ ఫొటోగ్రాఫర్ గా పనిచేశారు. 1978 లో తన ఫోటో స్టుడియో స్థాపించి, రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ ప్రారంభించి ఎందరో విద్యార్థులను నిపుణులైన ఛాయా గ్రహకులుగా తీర్చిదిద్దాడు. ఛాయాగ్రహణంలో రాజన్ తొక్కిన కొత్త పుంతలు తనకు దేశీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. 1987లో నగ్న చిత్రాలపై ఛాయాచిత్ర కళాకృతులను సమర్పించి రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ అకాడెమీ ఆఫ్ ఫోటోగ్రఫీ కార్యదర్శిగా ఉంటూ, భగవాన్ దాస్ తర్వాత లెన్స్ లైట్ అనే ఛాయాగ్రాహక పత్రికకు సంపాదకత్వం వహించారు. డిజిటల్ ఛాయాగ్రహణానికి ముందు ఛాయాచిత్రాలు దార్కరూం (చీకటి గది) లోనే స్థిర రూపం దాల్చేవి. నెగటివ్ లు వృద్ధి చేయటానికి, స్థిరపరచడానికై రాజన్ తానే రూపొందించుకొన్న రసాయనిక సూత్రం పై ద్రవణాలు కలిపి డెవలపర్ తయారు చేసి, నెగటివ్ లను స్థిరపరిచేవారు. ఈ విధానంలో...చిత్రంలో, నలుపు, తెలుపులను ప్రస్ఫుటంగా చూపే హైడ్రోక్వినాన్ లేకుండా కేవలం మెటల్ తోనే ఫిల్మ్ ను వృద్ధిపరచి, స్థిరపరచి, నలుపు తెలుపులో ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ఇది రాజన్ ప్రతిభకు నిదర్శనం. ఫొటొషాప్ లాంటి సాఫ్ట్వేర్లు లేని సమయంలో కూడా రాజన్ అద్భుతాలు చేశారు. తన కళా నైపుణ్యంతో తన ఛాయా చిత్రాలను పలు మార్లు వన్ మాన్ షో లో ప్రదర్శించి, పలువురి ప్రశంసలందుకున్నారు. రాజన్ తీసిన నగ్న చిత్రాలలో రసికత ఉంటుంది కాని అసభ్యతకు చోటు ఉండదు. అందుకే అవి రసజ్ఞుల ప్రశంసలు పొందాయి. కొడాక్ 620 తో మొదలుపెట్టిన రాజన్, తన విద్యార్థులకు ఛాయా గ్రహణ పాఠాలలో భాగంగా బోధించ టానికై, చాలా కెమెరాలు సేకరించారు. వాటిలో ఛాయాచిత్ర కారులలో హోదాకు చిహ్నమైన Hasselblad-medium-format camera కూడా ఉంది. ఫిల్మ్ కెమేరా Asahi Pentax నుంచి, ఛాయాగ్రహణం డిజిటల్ దిశగా సాగిన పయనంలో రాజన్ %జుఅఱశీ 400ఱ% వాడే వారు. ఛాయాగ్రహణ శాఖలలో ఒకటైన ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీలో కూడా రాజన్ తన సత్తా చూపారు. నగ్న చిత్రాలకు, అసభ్య చిత్రాలకు మధ్య ఒక గీత ఉంటుంది అనేవారు రాజన్ బాబు. ఛాయాగ్రహణం ఒక భావైక్యత, అందులోని వ్యాకరణమే Composition, Color, Space, Form, Proper Exposure, Angle and Light అని వివరించే వారు. ఈ మెళకువ గ్రహించిన వాడు మంచి ఛాయా గ్రాహకు డవుతాడని రాజన్ అంటుండే వారు. పిక్టోరియల్ ఫొటోగ్రఫీలో తనదైన ముద్ర వేసిన రాజన్ బాబు 2011, ఆగష్టు 24 న తన 73వ ఏట, అనారోగ్యంతో, హైదరా బాదులో మరణించారు. రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వేదికలపై ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేసి, లెక్కకు మించిన అవార్డులు, బహుమతులు సొంతం చేసుకున్న రాజన్ బాబు ఫొటోగ్రఫీ కళ కారునిగా చిరకాలం గుర్తుండి పోతారు.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# అజరామరం రాజ్ గురు త్యాగం - ఆగస్టు 24... అమర వీరుడు రాజ్ గురు జయంతి



హరి శివరాం రాజ్ గురు (1908 ఆగస్టు 24 - 1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమర యోధుడు, ఉద్యమ కారుడు. ఆయన భగత్ సింగ్, సుఖ్ దేవ్ ల సహచరునిగా గుర్తింపు పొందాడు. 1928లో లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగ తీర్చు కోవడానికి, ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హతమార్చి నందుకు గాను 1931 మార్చి 23 న భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ లతో పాటు ఉరితీతకు గురైనాడు. రాజ్‌గురు మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో 1908 ఆగస్టు 24 న ప్రస్తుత పూణే సమీపంలో భీమా నది ఒడ్డున ఉన్న ఖేద్ గ్రామంలో వద్ద పార్వతి దేవి, హరినారాయణ దంపతులకు జన్మించాడు. ఆయన ఖేద్ వద్ద ప్రాథమిక విద్యను పూర్తిచేసి, తరువాత పూనా లోని న్యూ ఇంగ్లీష్ హైస్కూల్లో చదువు కున్నాడు. ఆయన హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యుడు. బ్రిటిష్ పాలన నుండి భారత దేశం ఏ విధంగానైనా విముక్తి పొందాలని కోరుకున్నాడు. రాజ్‌గురు, భగత్ సింగ్, సుఖ్ దేవ్‌లు సహ ఉద్యోగు లయ్యారు. అక్టోబర్ 30, 1928న సైమన్ కమిషన్ లాహోర్ రాగా, లాలా లజపతి రాయ్ అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్య క్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపై పోలీసులు, అలాగే పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్ తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టగా ఆ దెబ్బల తోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు. లజపతిరాయ్ హత్యకు ప్రతీకారార్థం విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో భగత్ సింగ్ చేతులు కలిపాడు. డీఎస్పీ జే.పీ. సాండర్స్ కనిపించి నప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయన్ను కాల్చుమంటూ సింగ్‌కు సంకేతాలివ్వగా స్కాట్‌కు బదులు సాండర్స్ హత మయ్యాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జే.పీ సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. 1930 అక్టోబర్ 7 న న్యాయ స్థానం తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న భగత్ సింహ్, సుఖఃదేవ్, రాజగురులకు ఉరిశిక్ష విధించారు. ముగ్గురు స్వాతంత్ర్య సమర యోధులను 23 మార్చి 1931 న ఉరితీశారు. పంజాబ్ లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలోని సట్లెజ్ నది ఒడ్డున ఉన్న హుస్సేనివాలా వద్ద దహనం చేశారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# ధర్మస్థల కేసులో ఊహించని ట్విస్ట్.. ముసుగు మనిషి అరెస్ట్..!

కర్ణాటక: కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థల సామూహిక మృతదేహాలు ఖననం కేసు కీలక మలుపు తిరిగింది. వందలాది మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేశానని ఫిర్యాదు చేసిన మాస్క్ మ్యాన్ భీమా అసలు రంగు బయటపడింది. పారిశుద్ధ్య కార్మికుడు ఇన్నాళ్లూ చేసిన ఆరోపణలు బూటకమేనని సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టించిన మాస్క్ మ్యాన్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ధర్మస్థల ఆలయ పరిసరాల్లో సుమారు 100కు పైగా మృతదేహాలను ఖననం చేశానంటూ భీమా 15 రోజులుగా ఆడుతున్న నాటకానికి సిట్ బృందం తెరదించింది. మాయమాటలతో వ్యవస్థను నమ్మించి విచారణలో పదే పదే తన వాదనలు మార్చిన భీమా చివరకి ఏమీ తెలియదని చేతులు ఎత్తేశాడు. దీంతో ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందం పారిశుద్ధ్య కార్మికుడు భీమాను అదుపులోకి తీసుకుంది. ఇంత డ్రామా ఆడటానికి కారణాలేంటని రాబట్టేందుకు సిట్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. విచారణ అనంతరం భీమాను కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ కేసులో మరో కీలక వ్యక్తి అయిన బెంగళూరుకు చెందిన సుజాత భట్‌పైనా విచారణ కొనసాగుతోంది. ఆమె, తన కుమార్తె అనన్య భట్ 2003లో ధర్మస్థలలో అదృశ్యమైందని ఫిర్యాదు చేసింది. కానీ, తాజాగా ఆమె ఆ ఆరోపణలను తిరస్కరించింది. దీంతో సుజాతను కూడా పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ధర్మస్థల శైవ క్షేత్రంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసిన భీమా అనే వ్యక్తి కొన్నాళ్ల క్రితం సంచలన ఆరోపణలు చేశాడు. 1995 నుండి 2014 మధ్య లైంగిక వేధింపులకు గురై హత్య చేయబడ్డ 100కు పైగా మహిళలు, పిల్లల మృతదేహాలను తాను పూడ్చిపెట్టానని.. 2014లో తమ కుటుంబంలోని ఓ యువతిని లైంగికంగా వేధించి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడం దేశవ్యాప్తంగా కలకలం చెలరేగింది. పశ్చాతాపం వెంటాడుతుండటంతోనే ఈ ఫిర్యాదు చేసినట్లు భీమా వివరణ ఇచ్చుకున్నాడు. దీంతో ప్రభుత్వం దర్యాప్తు కోసం ప్రణబ్ మహంతి నేతృత్వంలోని సిట్ బృందాన్ని రంగంలోకి దింపింది. భీమా చెప్పిన ప్రకారం పలు చోట్ల సిట్ అధికారులు తవ్వకాలు జరిపారు. కేవలం రెండు ప్రదేశాల్లోనే కొన్ని ఎముకలు కనిపించాయి. స్పష్టమైన ఆధారాలు లభించకపోవడంతో సిట్ అధికారులకు ఫిర్యాదుదారుడైన భీమా ఆరోపణలపై అనుమానం రేకెత్తింది. దీంతో లోతుగా దర్యాప్తు నిర్వహించగా ఆశ్చర్యకరమైన నిజాలు వెల్లడయ్యాయి. విచారణలో భీమా కూడా మాట మార్చాడు. వేరెవరో ఒక పుర్రె ఇచ్చి పోలీసులకు ఇమ్మన్నారని.. కోర్టులో పిటిషన్ కూడా వారే వేయించారని.. నేను 2014 నుంచి తమిళనాడులోనే ఉన్నానని అతడు పేర్కొనడంతో సిట్ అధికారులు అరెస్టు చేశారు.




రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా భారత్‌పై భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరుదేశాల సంబంధాల్లో కొంత ఒడుదొడుకులు నెలకొన్నాయి. దీనిపై ఐక్యరాజ్యసమితి యూఎస్ మాజీ రాయబారి నిక్కీ హేలీ స్పందిస్తూ.. న్యూఢిల్లీతో వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని వాషింగ్టన్‌ను హెచ్చరించారు. న్యూఢిల్లీతో స్నేహం కోల్పోతే.. అది అమెరికాకు రక్షణపరంగా లక్ష్య సాధనంలో వైఫల్యమే అవుతుందని ఓ వార్తా పత్రికకు రాసిన ఆర్టికల్‌లో ఆమె వ్యాఖ్యానించారు. భారత్- అమెరికా సంబంధాలు విచ్ఛిన్న దశలో ఉన్నాయన్నారు. న్యూఢిల్లీని స్వేచ్ఛాయుత భాగస్వామిగా పరిగణించాలన్నారు. చైనాలాగా ప్రత్యర్థిగా చూడకూడదన్నారు. రష్యా నుంచి బీజింగ్ కూడా పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. దానిపై ఆంక్షలు విధించకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. ఆసియాలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో అమెరికా ఉంటే.. వెంటనే భారత్‌కు చేరువ కావాలని సూచించారు. లేదంటే అది యూఎస్‌కు వైఫల్యమే అవుతుందన్నారు.

**భారత్ అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ...** ఈసందర్భంగా యూఎస్‌లో ఉత్పత్తి చేయలేని వస్త్రాలు, చవకైన ఫోన్లు, సౌర ఫలకాలు వంటి వాటిని చైనా తరహాలో చేయగల సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందని నిక్కీ హేలీ పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఇజ్రాయెల్ వంటి అమెరికా మిత్ర దేశాలతో న్యూఢిల్లీ తన సైనిక సంబంధాలు పెంచుకుంటుందన్నారు. మధ్యప్రాచ్యంలో దానికి ఆదరణ పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో భారత్ ప్రాముఖ్యం మరింత పెరుగుతుందన్నారు. 2023లో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనాను అధిగమించిందన్నారు. భారత డెడ్ ఎకానమీ అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (%ణశీఅఖుశ్రీఃస ఎతీబఎజూ%) చేసిన వ్యాఖ్యలను నిక్కీ తప్పుబట్టారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీ సామర్థ్యం పెరిగేకొద్దీ.. ప్రపంచంపై ఆధిపత్యం సాధించాలనే చైనా ఆశయాలు కుంచించుకుపోతాయన్నారు.




భారత్–అమెరికా బంధాన్ని ట్రంప్ వీరభక్తుడొకరు విచ్ఛిన్నం చేస్తున్నారు. తరచూ నోటికొచ్చిన ప్రకటనలు చేస్తూ ఇప్పటికే ఉన్న వివాదాలపై 'పెట్రోల్' చిలకరిస్తున్నారు. ఇరుదేశాల మధ్య బంధాన్ని నిర్మించడానికి గత అధ్యక్షులు చేసిన ప్రయత్నాలను బూడిదపాలు చేస్తున్నారు. స్వయంగా రిపబ్లికన్ మద్దతుదారులు.. ట్రంప్ వర్గీయులు నెత్తీనోరు బాదుకొంటున్నా.. ట్రంప్ అతడికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. దీంతో ఈ భక్తుడు ఆగడం లేదు.. అతడి పేరు పీటర్ నవారో. గతంలో ట్రంప్ కోసం ఏకంగా నాలుగు నెలలు అమెరికా జైల్లో గడిపి శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. ట్రంప్ వాణిజ్యయుద్ధం వెనక వ్యూహం అతడిదే అని చాలామంది నమ్ముతారు..! ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టాక 75 ఏళ్ల ఆర్థికవేత్త పీటర్ నవారోను తన వాణిజ్య సలహాదారుగా ట్రంప్ శ్వేతసౌధంలోకి తీసుకొచ్చారు. అతడి నేపథ్యం తెలిసిన చాలామంది అతడి నియామకాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

**రిపబ్లికన్‌గా మారిన డెమోక్రట్..** 1970ల్లో నవారో జాతీయవాది కాదు. అతడు ఓ డెమోక్రటిక్ సానుభూతిపరుడు. వియత్నాం యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, పర్యావరణ పరిరక్షణను కోరుతూ కాలిఫోర్నియాలో ఉద్యమించారు. ఆయన హార్వర్డు విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. ఇక శాన్‌డియా మేయర్, కాంగ్రెస్ ఇలా పలు పదవులకు పోటీ చేసి ఓడిపోయారు. యూజీఐలో ఎకనామిక్స్, పబ్లిక్ పాలసీలో ప్రొఫెసర్‌గా చేశారు. 1990ల్లో ఆయన తన వైఖరి మెల్లగా సంప్రదాయ జాతీయవాదం వైపు మళ్లింది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకించడం, అమెరికా (%ఖూూా%)లో రక్షణాత్మక వాణిజ్య విధానాలు వంటి అంశాల్ని సమర్థించేవారు. 2011లో 'డెత్ బై చైనా' అనే పుస్తకం రాశారు. దానినే డాక్యుమెంటరీగా చిత్రీకరించారు. 2016లో ట్రంప్‌నకు అల్లుడు జరేడ్ కుష్నెర్ ద్వారా పరిచయం అయ్యాడు. తొలి కార్యవర్గంలో కూడా వైట్‌హౌస్ నేషనల్ ట్రేడ్ కౌన్సిల్ డైరెక్టర్‌గా పనిచేశారు. అప్పట్లో చైనాపై వాణిజ్యయుద్ధం, కొవిడ్ సమయంలో పాలసీ, 2020 ఎన్నికల ఫలితాల తర్వాత 'క్యాపిటల్ హిల్స్' ఘటనలో నవారో ప్రమేయం ఉందంటారు. 2020 అల్లర్ల విషయంలో 2023లో ఆయన్ను అమెరికా కాంగ్రెస్ విచారణకు పిలిస్తే వెళ్లకపోవడంతో నాలుగు నెలల పాటు జైల్లో వేశారు. దీంతో ఆయనకు ట్రంప్ వీరభక్తుడిగా ముద్ర పడింది.

**నోటి దురుసుతో మస్క్‌నే వెళ్లగొట్టిన ఘనుడు...** 2024లో అమెరికా ఎన్నికలు ముగిసేనాటికి ట్రంప్–మస్క్‌ల మధ్య స్నేహం విపరీతంగా పెరిగిపోయింది. ఓ రకంగా టెస్లా అధినేతే షాడో ప్రెసిడెంట్ అనేవారు. కానీ, వాణిజ్యంలో నవారో సూచించే రక్షణాత్మక వైఖరి, టారిఫ్ యుద్ధం ఆయనకు నచ్చేది కాదు. టెస్లా విడిభాగాలు విదేశాల్లో తయారై అమెరికాకు వస్తే వాటిని ఇక్కడ అసెంబ్లింగ్ చేస్తున్నారని మస్క్‌ను దెప్పిపొడిచారు. ఓ దశలో 'కార్ అసెంబ్లర్' అని వ్యాఖ్యానించారు. ఓసారి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలోనే మస్క్–నవారో తీవ్రంగా గొడవ పడ్డారన్న వార్త గుప్పుమంది. నవారో 'మూరు?డు' అంటూ మస్క్ బహిరంగానే పోస్టు పెట్టారు. ట్రంప్ నవారో పక్షాన ఉన్నట్లు అనిపించిన తర్వాత నుంచే మస్క్ మెల్లగా శ్వేతసౌధం నుంచి దూరమయ్యారు. ఇప్పుడు ట్రంప్–మస్క్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేటట్లుంది. ట్రంప్ కార్యవర్గంలో వారితో నవారో గొడవపడటం ఇదే తొలిసారి కాదు, 2018లో నాటి ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్‌తో కూడా ఓ చైనా ప్రభుత్వ కార్యాలయ భవనం లాన్‌లో బహిరంగానే గొడవ పడ్డారు. అంతేకాదు.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు నరకంలో ప్రత్యేక స్థానం ఉంటుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేసి క్షమాపణలు చెప్పారు.

**రెండోసారి అరాచకమే..** రెండోసారి ట్రంప్ కార్యవర్గంలో సలహాదారుగా పదవి దక్కాక అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకం వెనక నవారోనే ఉన్నారు. ఇక భారత్‌పై ఆంక్షల విషయంలో ట్రంప్‌నకు మద్దతుగా నవారో స్వామిభక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ యుద్ధం ఆగితే నోబెల్ బహుమతి వస్తుందని ట్రంప్ విశ్వసిస్తుండటంతో.. రష్యా–ఉక్రెయిన్ పోరు ఆపాలంటే భారత్ చమురు కొనుగోళ్లు నిలిచిపోవాల్సిందేనని విచిత్రవాదన తెర పైకి తెచ్చారు. న్యూఢిల్లీతో సంబంధాలను దెబ్బతీస్తే.. అమెరికా రక్షణ లక్ష్యాలకు పెనుముప్పు అని నిక్కీహేలీ వంటి వారు నెత్తీనోరు బాదుకొంటున్నా ఈ నవారో ఆగడం లేదు.

**మా కంటే చైనానే ఎక్కువ కొంటోంది...** భారత్ కంటే ఎక్కువ చమురు చైనా, అధిక సీఎన్‌జీ ఐరోపా దేశాలు కొనుగోలు చేస్తున్నా నవారో నోరు మెదపడం లేదు. రష్యా ఆంక్షల చమురును భారత్ మారు బేరానికి విక్రయించి లబ్ధి పొందుతోందని అక్కసు ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్లతరబడి భారత్–అమెరికా నేతలు ఓర్పుతో నిర్మించిన వ్యూహాత్మక బంధంపై 'రష్యా చమురు'ను నవారో చిలకరిస్తున్నారు.

# ఆగని చమురు మంటలు: ట్రంప్ కార్యవర్గం పదేపదే టార్గెట్ భారత్..!

రష్యా చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గం గత 10 రోజులుగా అదే పనిగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తోంది. ముఖ్యంగా అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈసారి భారత పారిశ్రామిక వేత్తలను లక్ష్యంగా చేసుకొన్నారు. పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షల లబ్ధిని భారత్ పొందుతోందని ఆరోపించారు. సీఎన్‌బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత వైఖరి ఆమోదయోగ్యం కాదన్నారు.

"రష్యా నుంచి భారత్ చౌకగా చమురు కొనుగోలు చేసి.. దానిని ఉత్పత్తి చేసినట్లు బయట విక్రయిస్తోంది. ఈ యుద్ధ సమయంలో ఇది మొదలుపెట్టింది. దీనిని ఏమాత్రం ఆమోదించలేము. వారు మారు విక్రయం చేసి.. లబ్ధి పొందుతున్నారు. 16 బిలియన్ డాలర్ల వరకు వారికి మిగులుతున్నాయి. ఈ వ్యవహారంలో భారత్‌లోని కొన్ని సంపన్న కుటుంబాలు భాగస్వామ్యం అయ్యాయి. యుద్ధానికి భారత్ రష్యా నుంచి 1శాతం చమురు కొనుగోలు చేస్తే.. సంక్షోభం మొదలయ్యాక అది 40 శాతానికి చేరింది" అని బెస్సెంట్ పేర్కొన్నారు.

**అమెరికా కోసమే కొనుగోలు..** మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ సలహాదారు సీఎన్‌బీసీతో మాట్లాడుతూ అమెరికా కోరిక మేరకే భారత్ పెద్దఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఆయన రాపిడన్ ఎనర్జీకి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. బైడెన్ కార్యవర్గం రష్యా నుంచి వచ్చే చమురు తీసుకోమని భారత్‌ను కోరిందన్నారు. చమురు ధరల్లో భారీ వృద్ధి ఉండకుండానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అమెరికా రూపొందించిన ఆంక్షల చట్రంలో భారత్ ధరను అదుపు చేసే పాత్రను పోషించిందన్నారు.

# లిక్కర్ స్కామ్.. మాజీ మంత్రి నారాయణస్వామికి మరోసారి సిట్ నోటీసులు

అమరావతి: వైకాపా హయాం నాటి ఏపీ మద్యం కుంభకోణం కేసులో అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామికి సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. గత నెలలోనే ఒకసారి నోటీసులు ఇచ్చినా ఆయన అనారోగ్య కారణాలతో విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం పుత్తూరులోని నారాయణస్వామి ఇంటికి వెళ్లిన అధికారులు.. విచారణకు రావాలని నోటీసులు అందించారు. వైకాపా అధికారంలోకి రాగానే సొంత బ్రాండ్లను ప్రమోట్ చేయడమే లక్ష్యంగా నూతన మద్యం పాలసీని తెరపైకి తెచ్చారు. అప్పుడు నారాయణస్వామి ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్నారు. మద్యం ఆర్డర్స్ విధానాన్ని ఆన్‌లైన్ నుంచి మాన్యువల్‌కు మార్చడం, డిజిటల్ చెల్లింపులు లేకుండా అమ్మకాలు జరపడం వెనక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయనే కోణంలో సిట్ లోతైన విచారణ జరుపుతోంది. తాడేపల్లి ప్యాలెస్ ఒత్తిడితోనే మద్యం పాలసీపై నారాయణస్వామి సంతకాలు చేశారని అధికారులు అనుమానిస్తున్నారు. వైకాపా హయాంలో లిక్కర్ పాలసీలో మార్పులపై సిట్ ఆయన్ను ప్రశ్నించనుంది. ఎక్సైజ్ పాలసీలో మార్పులు, నాటి నిర్ణయాల్లో ఎవరి పాత్ర ఏంటనేది ఆరా తీయనుంది.

చురకలు

## సంపాదకీయం

# నకిలీ పరిశోధనల అడ్డాగా భారత్?

ప్రపంచంలో శాస్త్రీయ పరిశోధనలకు భారతదేశం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుంది.. అయితే ఇటీవల కాలంలో కొన్ని ఆందోళనకర పరిణామాలు భారతీయ అకడమిక్ రంగాన్ని దిగులుపరుస్తున్నాయి. కొత్తగా వెలుగులోకి వచ్చిన ఓ అంతర్జాతీయ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా పరిశోధనల్లో నాణ్యత కోల్పోతున్న టాప్ 15 యూనివర్సిటీల్లో 11 భారతదేశంలోనే ఉన్నాయని వెల్లడైంది. ఇది దేశ విద్యా రంగానికి ఎంతటి ప్రతిష్ఠా నష్టమో చెప్పనవసరం లేదు.

**– కృత్రిమ మేధతో పెరిగిన వేగం.. నాణ్యత మాత్రం ప్రశ్నార్ధకం?...** కృత్రిమ మేధ ఆధారిత టూల్స్ అభివృద్ధి చెందిన తర్వాత పరిశోధన చేసే విధానాలు పూర్తిగా మారిపోయాయి. పెద్ద సంఖ్యలో పబ్లికేషన్లు వేగంగా ఉత్పత్తి అవుతున్నాయి. కానీ ఇందులో చాలావరకు నకిలీ, పునరావృత, ప్రామాణికత లేని పరిశోధనలే ఎక్కువగా ఉంటున్నాయి. AI ఆధారిత టూల్స్ ఉపయోగించి కొందరు పరిశోధకులు తక్కువ సమయంలో ఎక్కువ పేపర్లు రాసేస్తున్నారు. అయితే వాటిలో ఒరిజినాలిటీ కొరవడుతోంది. దీనితో పరిశోధన పత్రాలు వాస్తవ విశ్లేషణలు లేకుండా, కేవలం ప్రచురణ కోసం మాత్రమే ప్రచురితమవుతున్నాయి.

**–నకిలీ ప్రాజెక్టులు.. విద్యా సంస్థల పేరును మసకబార్చే కుట్ర...** అన్ని యూనివర్సిటీలకూ ఒకే లెక్క కాదు. అయితే కొన్ని ప్రైవేటు, కొద్దిపాటి గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు AI ఆధారిత పబ్లికేషన్లను ప్రోత్సహిస్తూ, నకిలీ పత్రాలు పంపిస్తున్నాయన్న ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. విద్యార్థులకు లేదా అధ్యాపకులకు పబ్లిష్ చేయాలనే ఒత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల అసలు గమ్యం దారి తప్పుతోంది.

**–ఈ నింద మన యూనివర్సిటీలకే ఎందుకు?...** అందుబాటులో ఉండే టెక్నాలజీని సరిగ్గా వినియోగించాల్సిన అవసరం ఉన్నా, మన యూనివర్సిటీల్లో పరిశోధనకు గల మౌలిక వసతులు పరిమితంగానే ఉన్నాయి. దీంతో, విశ్వవిద్యాలయాలు కేవలం పబ్లికేషన్ల సంఖ్యను పెంచే పిచ్చి ప్రయత్నాల్లో పడుతున్నాయి. ఈ కోణంలో చూస్తే, నాణ్యత కంటే పరిమాణానికే ప్రాధాన్యత అనే తప్పిద దృక్పథం మన విద్యా రంగంలో అడుగులు పెడుతోంది.

**–పరిష్కారం ఏమిటి?...** ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడం అత్యవసరం. ఇందుకోసం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. పబ్లికేషన్ పద్ధతులపై కఠిన నిబంధనలు: నాణ్యమైన పరిశోధనలకే ప్రాధాన్యతనిచ్చేలా కఠినమైన నిబంధనలు రూపొందించాలి. నకిలీ లేదా తక్కువ ప్రమాణాలున్న ఆర్టికల్స్‌ను ముందే ఫిల్టర్ చేసేందుకు పీర్ రివ్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి. AI సాయంతో చేసే పనిలో మానవ విశ్లేషణ తప్పనిసరిగా ఉండేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. అధ్యాపకులు, పరిశోధకులకు ప్రామాణిక పరిశోధన పద్ధతులపై క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలి. పరిశోధన అంటే జ్ఞానాన్ని విస్తరించడమే కానీ, ఖాళీగా సంఖ్యలు నింపడం కాదు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి నాణ్యమైన పరిశోధన అత్యవసరం. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠ పెరగాలంటే, రీసెర్చ్ నాణ్యత మీద దృష్టి పెట్టాల్సిందే. లేదంటే 'నకిలీ రీసెర్చ్ భారత్' అనే ముద్ర విడిపించుకోలేనిదిగా మారుతుంది. ఈ అంశంపై మీ అభిప్రాయాలు ఏమిటి?

# శుభప్రదం...భాద్రపదం



తెలుగు మాసాల్లో ఆరవ మాసం భాద్రపదం. చాంద్రమానం ప్రకారం పౌర్ణమినాడు పూర్వాభాద్ర లేదా ఉత్తరాభాద్ర నక్షత్రం ఉండే మాసానికి భాద్రపద మాసమని పేరు. వర్షాలు అధికంగా కురిసే మాసం. ఏకాన్న ఆహార వ్రతాచరణ వల్ల ధనం, ఆరోగ్య ప్రాప్తి కలగగలవని విశ్వాసం. భాద్రపద శుక్ల పక్ష విదియ కల్కి జయంతిగా, తృతీయ హరితాళికా వ్రతం, పదహారు కుడుముల తద్దిచేస్తారు. కొందరు సువర్ణగౌరీ, హరితాళికా, షోడశోమా వ్రతాచరణ కూడా చేస్తుంటారు. మనువులలో నాలుగవ వాడైన తామస మన్వంతరాది. చవితి ఆదిదేవుడైన వినాయక చతుర్థి. భవిష్య పురాణం ప్రకారం పంచమి రజస్వల అజ్ఞాత దోషాల నివారణకై స్త్రీలు ప్రాయశ్చిత్తానికై రుషి పంచమి వ్రతాన్ని ఆచరిస్తారు. సూర్యపూజకు సూర్య షష్ఠి ఉద్దిష్టమైనదని చతుర్వర్గ చింతామణి, పురుషార్థ చింతామణి, కృత్యసార సముచ్చయములు వివరిస్తున్నాయి. స్కంద దర్శనం చేసుకోవాలని స్మృతి కౌస్తుభం పేర్కొంటున్నది. మంథా షష్ఠి, దేవీషష్ఠి, లలితాషష్ఠి, చంపాషష్ఠి పేర్లతో వ్రత గ్రంథాలలో ప్రస్తావనలు ఉన్నాయి. లలితా సప్తమిగా అమాదేర్ జ్యోతిషీ, అలంకార పూజ చేయాలని నీలమత పురాణం పేర్కొంటుండగా, ద్వాదశ సప్తమి, అనంతఫల సప్తమి, పుత్రసప్తమి, ఫల సప్తమి, అపరాజితా సప్తమి, మున్నగు వ్రతాలను చతుర్వర్గ చింతామణి పేర్కొంటున్నది. అష్టమిని శ్రీకృష్ణుని చిత్తాన్ని లయింపచేసి, కృతార్థురాలైన శుభదినం రాధాష్టమిగా, గణేశ చతుర్థి వెళ్ళిన మూడు దినాలకు ఆరంభమై మూడు రోజులు ఉండే గౌరీ పర్వంగా, నవమి దినాన్ని దుర్గా పూజనం చేయాలని స్మృతి కౌస్తుంబీ నందికా నవమీ, గోధుమ నవమీ అని నీలమత పురాణం, శ్రీవృక్ష నవమీ వ్రతాన్ని చతుర్వర్గ చింతామణి, అదు:ఖ నవమీ అని ఆమాదేర్ జ్యోతిషీ పేర్కొంటున్నాయి. దశమి నాడు దశావతారాలను అవతార ప్రతిమలతో పూజించడం, దేవతలకు రుషులకు పితరులకు తర్పణాల్విడం, కృత్యాలుగా చెప్పబడినాయి. ఏకాదశిని పరివర్తిన ఏకాదశి అంటారు. విష్ణువు ఆషాఢ శుక్ల ఏకాదశినాడు నిద్రకు ఉపక్రమించి, రెండు మాసాల అనంతరం ఒత్తిగిలే దినంగా సందర్భంగా పరివర్తినేకాదశి, పార్శ్వ పరివర్తినేకాదశిగా పేరు వచ్చింది. విష్ణువు ఐదవ అవతారమైన వామనునికి ప్రీతి పాత్రమైనదిగా, శ్రవణా నక్షత్రంతో కూడిన శుక్ల ద్వాదశిని వామన జయంతిగా జరుపుకుంటారు. శుక్ల పక్షంలో తిథి ద్వాదశి, శ్రవణా నక్షత్రం ఉన్న ఈ రోజునే వామనా వతారానికి శ్రీకారం చుట్టాడు శ్రీహరి. ప్రహ్లాదుడి మనవడైన బలిచక్రవర్తి పరమ ధార్మికుడు. అతడు స్వర్గాన్ని జయించడంతో దేవతలు అక్కణ్ణుంచి వెళ్లిపోవాల్సి వస్తుంది. బలిచక్రవర్తిని సంహరించకుండానే అతడి నుంచి స్వర్గాన్ని తీసుకుని దేవతలకు ఇచ్చేందుకు%ొ% అదితి, కశ్యప ప్రజాపతులకు బిడ్డగా జన్మిస్తాడు శ్రీహరి. సకల భూమండలాన్నీ స్వర్గాన్నీ దానంగా పొందుతాడు. దానికి ప్రతిగా సుతల లోకాన్ని బలిచక్రవర్తికి ఇచ్చి, చివరిలో మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అందుకే ఈ రోజున శ్రీహరిని స్మరించినంతనే మోక్షం లభిస్తుందట. శ్రవణ ద్వాదశి, వామ ద్వాదశి, విజయ ద్వాదశి అని పిలుస్తారు. అనంత పద్మనాభ చతుర్దశినాడు అనంతుని పూజకు ఉద్దిష్టమైనది. శ్రావణ పౌర్ణమి నాడు ఉపాకర్మ చేసుకోని వారు భాద్రపద పౌర్ణమినాడు యజ్ఞోపవీత ధారణలు గావిస్తారు. ఈనాడు భగవత పురాణాన్ని దానమిస్తే పరమపదం కలుగుతుందని విశ్వాసం. నిష్ఠాపరులు నాందీ శ్రాద్ధం, పితృశ్రాద్ధం ఈనాడు విధిగా చేయాలని చెపుతారు. ఉమా మహేశ్వర వ్రతాచరణ కూడా ఉంది. భాద్రపద బహుళ పాడ్యమి నుంచీ మహాలయ పక్షాలు ప్రారంభ మవుతాయి. దీన్నే పితృదేవతలకు ఇష్టమైన కాలంగా చెబుతారు. ఈ పదిహేను రోజులూ నిత్యం తర్పణాలు వదలడం, శ్రాద్ధ విధులను నిర్వహించడం ద్వారా పితృదేవతల అనుగ్రహాన్ని పొందుతారు. పాడ్యమి నుంచి అమావాస్యవరకూ వీటిని ఆచరించలేని వారు కనీసం మహాలయ అమావాస్య రోజైనా పితృదేవతల ఆరాధన చేయాలి. వేదకాలం నుండి ఇది ఆచరణలో ఉంది. బహుళ తదియను ఉండ్రాళ్ళ తద్దిగా తెలుగువారు వ్యవహరిస్తారు. పార్వతి శివుని గూర్చి తపస్సు చేయగా, మహేశ్వరుడు ప్రత్యక్షమైన దినంగా ధర్మసింధువు పేర్కొంటున్నది. పంచమి నాడు నాగపూజ చేయడం, రుషుల పూజనం ద్వారా సప్తర్షుల అగ్రహం పొందడం పేర్కొనబడినాయి. అష్టమి జీమూత వాహన పూజ, నవమి నాడు దుర్గాపూజ, గౌరీపూజలు చేయాలని నీలమత పురాణాధారాలు. ఏకాదశి నాడు ఇంద్రైకాదశిగా, ద్వాదశి నాడు ద్వాపర యుగాదిగా తిథితత్వం, కృష్ణ త్రయోదశి కలియుగాది దినంగా పేర్కొనబడినాయి. చతుర్దశి నాడు మాస శివరాత్రి, మరునాడు మహాలయ అమావాస్యగా జరుపుకోవడం సనాతన సంప్రదాయం. ఇంత విశేషమైన మాసం కాబట్టే కలియుగం భాద్రపద కృష్ణపక్ష త్రయోదశి ఆశ్లేష నక్షత్ర వ్యతీపాత యోగం అర్ధరాత్రి సమయము నందు కలియుగం మొదలైందంటారు. భాద్రపదం అంటే కేవలం ఒక మాసాన్నో ఒక నక్షత్రాన్నో కాకుండా ప్రజలంతా భద్రంగా ఉండాలన్న ఆకాంక్షనూ సూచిస్తుందని పెద్దలు చెబుతారు. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**


# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత - ప్రపంచ నీటి వారోత్సవాల సందర్భంగా




ప్రతి సంవత్సరం ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 1 వరకు ప్రపంచ నీటి వారోత్సవాలను పాటిస్తారు. నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీల్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృథా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృథా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని, ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ (కెమికల్ బాత్), వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసా పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. భారత చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వి నియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# సాహితీ వాచస్పతి దాశరథి - ఆగస్టు 24... దాశరథి రంగాచార్య జయంతి



తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేథో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు. ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు. దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబాబాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచార్య– శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన.

**ఆయన రచనల్లో పార్శ్వం...** మూడు కావ్యేతిహాసాలను – శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భాగవతము, వేదాలు – ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఓకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతికృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా. పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు. తొలి నవల 'చిల్లరదేవుళు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942–48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది. చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను %–% నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు. 1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు. 1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల '%నవ ఎష్త్రశీ తీఱఅనవంా్ అస్త్రవతీ%'ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ళ వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్ళార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు. తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంకల్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శైలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు. 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచే చేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

## వానాకాలంలో కార్మికులకు రక్షణేదీ!

జగిత్యాల : పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న కార్మికుల రక్షణను జగిత్యాల బల్దియా గాలికొది లేసింది. పురపాలికలోని వివిధ విభాగాల్లో అత్యవసర సేవలందిస్తున్న కార్మికులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించలేకపోతున్నారు. మొత్తం సిబ్బందిలో 300 మంది పారిశుద్ధ్య, 45 మంది తాగునీరు, విద్యుత్తు విభాగాల్లో పని చేస్తున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, చెత్త సేకరణలో వీరంతా నిత్యం సేవలందిస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాల నేపథ్యంలోనూ కార్మికులు విధులకు హాజరవుతున్నారు. వీరికి ఏటా వర్షాకాలానికి ముందే పురపాలక సంఘం రెయిన్ కోట్లు పంపిణీ చేస్తుంది. ఈ ఏడాది ఇప్పటివరకు అందజేయకపోవడంతో కార్మికులు వానలో తడుస్తూనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

**50 మందికి పైగా గైర్హాజరు**

కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తగిన రక్షణ లేకుండా కార్మికులు విధులకు హాజరవుతుండటంతో చాలా మంది జ్వరం, జలుబు ఇతర అనారోగ్య కారణాలతో విధులకు దూరం కావాల్సి వస్తోంది. 345 మందిలో నిత్యం 50 మందికి పైగా గైర్హాజరవుతు న్నారు. వర్షాలతో తరచూ పట్టణంలోని వీధులు జలమయం కావడంతో పాటు జనావాసాల్లోకి నీరు చేరడం, మురుగు కాలువల్లో వ్యర్థాలు



పేరుకుపోయిన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వీటిని వెంటనే పరిష్కరించడానికి పారిశుద్ధ్య, విద్యుత్తు సిబ్బంది వానలో తడుస్తూనే పని చేస్తున్నారు. కార్మికుల్లో 50 ఏళ్లకు పైబడిన వారే అధికంగా ఉండటంతో తరచూ అనారోగ్యానికి గురవతున్నారు.

**ఏకరూప దుస్తులతోనే సరి**

ప్రభుత్వం ప్రతి సంవత్సరం కార్మికులకు దుస్తులు, సబ్బులు, నూనెలు అందజేస్తుంది. ఈసారి వీటిని కూడా ఆలస్యంగా పంపిణీ చేశారు. ఓవైపు వర్షాల నేపథ్యంలో పురపాలికలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించినప్పటికీ రెయిన్ కోట్లు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గత నెలలో కార్మికులకు కేవలం ఏకరూప దుస్తులు అందించి చేతులు దులుపుకున్నారు. వెంటనే రెయిన్ కోట్లు పంపిణీ చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

## వేలం ధాన్యానికీ తిరకాసు!

పెద్దపల్లి : మిల్లర్లు సీఎంఆర్ చెల్లింపులో జాప్యం చేస్తున్నారని ప్రభుత్వం ధాన్యాన్ని వేలం వేస్తే.. వ్యాపారులు డబ్బుల చెల్లింపులోనూ అదేతీరులో వ్యవహరిస్తున్నారు. లెవీ తరహాలోనే గడువులు పొడిగించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ప్రభుత్వం ధాన్యం కేటాయిస్తే మరాడించి సీఎంఆర్ రూపంలో ఇవ్వాల్సిన మిల్లర్లు ఏళ్లకు ఏళ్లు ఆలస్యం చేయడం బహిరంగ రహస్యమే. అందులో కొంత ధాన్యం అమ్ముకొని, మిగిలిన ధాన్యంతో మిల్లర్లు రొటేషన్ చేసిన ఉదంతాలు ఉన్నాయి. దీంతో 2022-23 యాసంగి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో వేలం వేసింది. ఏడాదిన్నర గడిచినా టెండర్ దక్కించుకున్న వ్యాపారులు ఇప్పటికీ ప్రభుత్వానికి డబ్బులు పూర్తిగా చెల్లించలేదు.



**ఇదీ సమస్య**

యాసంగిలో సాధారణంగా బాయిల్డ్ బియ్యాన్నే ఎఫ్‌సీఐ తీసుకుంటుంది. కానీ 2022-23 సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో బియ్యం తీసుకోవడంపై అనిశ్చితి ఏర్పడింది. దీనికితోడు ఎఫ్‌సీఐ సైతం రా రైస్ మాత్రమే తీసుకుంటామని చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా పొడి బియ్యం తీసుకునేందుకు ప్రయత్నించింది. కానీ యాసంగి సీజన్‌లోని బియ్యంలో నూక శాతం పెరగడంతో ఎఫ్‌సీఐ నిబంధనలను అందుకోలేకపోయాయి. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా మిల్లర్ల వద్ద భారీ స్థాయిలో ధాన్యం పేరుకుపోయింది. దీనికితోడు కొందరు మిల్లర్లు ధాన్యం బయట అమ్ముకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఈ చిక్కులు తొలగించేందుకు మిల్లర్ల వద్ద పేరుకుపోయిన ధాన్యాన్ని వేలం వేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 8.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి వేలం నిర్వహించారు. టన్నుకు రూ.21,700ల చొప్పున వేలంలో దక్కించుకున్న వ్యాపారులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏడాది దాటినా చెల్లింపులు మాత్రం పూర్తిస్థాయిలో జరగడం లేదు.

## గుండుపై రూపం.. అరుదైన ఆలయం

కోరుట్ల మండలం అయిలాపూర్ శివారులోని గుట్టపై వెలిసిన శ్రీఅనంతపద్మనాభస్వామి ఆలయానికి 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. 16వ శతాబ్దంలో అయిలాపూర్ కేంద్రంగా అనంతరాజకిషన్‌రావు అనే సంస్థానాధీశుడు పాలిస్తుండేవారు. ఓరోజు ఆయన గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వేటకు వెళ్లారు. అక్కడ గుట్టపైనున్న ఓ గుండుపై మూడు నామాల(శ్రీమహావిష్ణువు) స్వరూపం ఆయనకు దర్శనమిచ్చింది. ఆ రోజు రాత్రి కలలో స్వామివారి రూపం కనిపించింది. దీంతో అటవీ ప్రాంతాన్ని, ఇతర గుండ్లను తొలగించి చదును చేయించారు. స్వామి స్వరూపం ఉన్న గుండుపై పాము పడగలాగా మరో గుండు 70 శాతం వంగి ఉంటుంది. స్వయంగా ఇది శ్రీమహావిష్ణువు ప్రతిరూపంగా భావించి పూజలు ప్రారంభించారు. తెలంగాణలో ఇదే మొదటి అనంతపద్మనాభస్వామి గుడిగా ప్రచారంలో ఉంది. ఆలయ ముఖద్వారం ఉత్తరం వైపు ఉండటంతో స్వామివారు అటువైపు అభిముఖంగానే భక్తులకు దర్శనమిస్తుంటారు. 2002-03లో స్వామివారి స్వరూపం ఉన్న గండును ఆనుకొని ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఏటా అక్టోబరులో జ్యేష్టబేలాషష్టి రోజు స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు. పరిసర మండలాల నుంచి, జిల్లాలోని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని కొలుస్తుంటారు. వైకుంఠ ఏకాదశి, దసరా, దీపావళి, సెప్టెంబరులో అనంత కోటి వత్తుల వెలిగింపు, నవంబరులో సుబ్రహ్మణ్యషష్టి రోజు విశిష్ట పూజలు నిర్వహిస్తారు. స్వామివారికి తిరునామాల వంశస్థులు అయిదు తరాలుగా పురోహితులుగా అర్చక సేవలందిస్తున్నారు.

## కమిటీ .. కావాలి భద్రతకు దివిటీ



సంగారెడ్డి: సిగాచీ కర్మాగారంలో జరిగినటువంటి భారీ ప్రమాదాలు పునరావృతం కాకుండా, జిల్లా యంత్రాంగం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పారిశ్రామిక వాడలతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా పరిశ్రమల క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భద్రతకు సంబంధించి పరిశ్రమల నిర్వాహకులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడంతో పాటు తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు.

**మొదలైన క్లస్టర్ల ఏర్పాటు** జిల్లాలో పటాన్‌చెరు, జిన్నారం, హత్నూర, గుమ్మడిదల, ఇంద్రకరణ్, సదాశివపేట, కొండాపూర్‌తో పాటు జహీరాబాద్‌లో 4,732 పరిశ్రమ లున్నాయి. ఇందులో 3,124 పరిశ్రమలు రసాయనాలు ఉత్పత్తి చేసేవి ఉన్నాయి. వీటిలో 599 హైరిస్క్ పరిశ్రమలున్నాయి. వీటిని స్థాపించిన ప్రాంతాల్లో ప్రమాదం జరిగితే సత్వరమే ప్రథమ చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు లేవు. సిగాచీ వద్ద కూడా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రాణనష్టం పెద్దఎత్తున జరిగిందని నిర్ధారించారు. ఒక్కో పారిశ్రామికవాడలో పదుల సంఖ్యలో పరిశ్రమలున్నాయి. పది నుంచి పదిహేను పరిశ్రమలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించి, ఇప్పటివరకు 43 పూర్తిచేశారు. క్లస్టర్ల సమీపంలో అంబులెన్స్‌తోపాటు ఇతర సదుపాయాలు సమకూర్చాలని నిర్ణయించారు.

**35 పరిశ్రమల్లో తనిఖీ**

పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య నిర్ణయించారు. కర్మాగారాల భద్రత అధికారుల ఆధ్వర్యంలో రెండు కమిటీలను నియమించారు. ఈ కమిటీలు మొదటగా హైరిస్క్ కర్మాగారాల నుంచి స్వీయధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు. అనంతరం తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 35 పరిశ్రమల్లో పూర్తిచేసి, నివేదికలను రూపొందిస్తున్నారు.

**సందేహాలు** పరిశ్రమల్లో భద్రతపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్దేశించింది. రాష్ట్రంలోనే అత్యధిక పరిశ్రమలున్న సంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల భద్రతకు చర్యలు చేపట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇంతవరకు బాగానే ఉన్నా గతంలో తనిఖీలు నిర్వహించిన అధికారులనే ప్రస్తుతం నియమించడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కర్మాగారాల భద్రతకు చెందిన అధికారులు తనిఖీలు నామమాత్రంగా చేపట్టారు. ప్రస్తుతం ఆ విధంగా జరగకుండా చూడాలని కార్మికసంఘాల నాయకులు కోరుతున్నారు.

## పది ప్రగతి పత్రాలు వచ్చేశాయ్!




పెద్దశంకరంపేట : పదో తరగతి ప్రగతి పత్రం (మెమో) విద్యార్థి జీవితంలో ఎంతో ప్రధానమైనది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పది వార్షిక పరీక్షల ఫలితాలను విడుదలయ్యాయి. వెంటనే విద్యార్థులకు ఆన్‌లైన్ మెమోలు అందజేశారు. పై చదువులకు వీటి ద్వారానే ప్రవేశాలు పొందారు. ఇక తాజాగా బోర్డ్ ఆఫ్ సెకండరీ శాశ్వత ప్రగతి పత్రాలను విడుదల చేయడం విశేషం.

**పలు మార్పులతో..**

ఉత్తీర్ణులైన పది విద్యార్థుల ప్రగతి పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా సోమవారం ఉన్నత పాఠశాలకు పంపించారు. ఈ సారి వాటిలో పలు మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. వార్షిక పరీక్ష ఫలితాల్లో గ్రేడ్‌లను తొలగిస్తున్న తెలిసిందే. వాటికి అనుగుణంగా విడుదల చేశారు. గతేడాది వరకు ఫలితాల్లో అన్ని పాఠ్యాంశాల్లో వచ్చిన గ్రేడ్‌లు కలిపి మొత్తం 'గ్రేడ్' పాయింట్లు ఇచ్చారు. దీని వల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతున్నట్లు గుర్తించిన బోర్డు 2024-25 విద్యా సంవత్సరంలో నేరుగా మార్కులు ఇవ్వనున్నట్లు పేర్కొన్న విషయం విదితమే. వీటికి తోడు ఆయా సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, గ్రేడ్‌లు కలిపి ఇస్తామని తెలిపింది. ఇదే పద్ధతిలో ఫలితాలను విడుదల చేసింది. సబ్జెక్టుల వారీగా మార్కులతో పాటు ఏ, ఏ1, ఏ2 వంటి గ్రేడ్‌లను ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన ప్రగతిపత్రాల్లో మొత్తం మార్కుల స్థానంలో 'పాస్' అని రాసింది. ప్రతి సబ్జెక్టుకు వచ్చిన వాటిని లెక్కిస్తేనే మొత్తం మార్కులు తెలుస్తాయి. వార్షిక పరీక్షలు, ఇంటర్నల్ మార్కులను విభజించి చూపారు.

**పెన్ నంబరు సైతం..**

రెండేళ్ల కిందట యూడైస్ స్థానంలో యూడైస్ ప్లస్‌ను అమల్లోకి తీసుకొచ్చిన విషయం విదితమే. విద్యార్థి ఆధార్ సంఖ్య అనుసంధానంగా నమోదైన వివరాలతో పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు)ను ఇచ్చారు. దీని ఆధారంగా విద్యార్థి వివరాలు పూర్తిగా తెలుసుకోవచ్చు. ఉన్నత విద్య, ఉద్యోగం సాధించినా ఈ నంబర్ ఆధారంగా తెలుసుకునే వీలుంది. ప్రస్తుత ప్రగతిపత్రాల్లో వీటిని నమోదుచేశారు.

## అన్నీ పక్కాగా ఉంటేనే నిధులు



ధర్మపురి : ఉపాధిహామీ పథకంలో తాము సూచించిన కొత్త చెల్లింపుల విధానమైన స్పర్శ్‌లోకి మారలేదని మెటీరియల్ కాంపోనెంట్ నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. అన్ని మండలాల్లో చేపట్టిన పనులను డైరెక్టర్ కార్యాలయంలోని స్పర్శ్ విధానంలోకి మార్చాలని ఆదేశించింది. దీని ప్రకారం మొదటగా గ్రామాల్లో చేయాల్సిన పనులను గ్రామ పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆమోదం పొంది పరిపాలన అనుమతులు వచ్చిన అనంతరం పనులు చేపట్టాలి. సంబంధిత ఏఈ ద్వారా ఎంబీ రికార్డు పూర్తయ్యాక నిధులు మంజూరవుతాయి. పలుచోట్ల మొదట పనులను ప్రారంభించి తర్వాత తీర్మానం చేయిస్తున్నారు. ఉపాధిహామీలో కాంపోనెంట్ నిధుల ద్వారా 90 శాతం సీసీ రహదారులను నిర్మిస్తుండగా.. మిగతా పది శాతం మురుగు కాలువలు, ఇతర పనులు చేపడుతున్నారు.

**ప్రస్తుతం ఇలా..**

ఉపాధిహామీ ద్వారా జిల్లాకు మెటీరియల్ కాంపోనెంట్ కింద వచ్చిన నిధుల ఆధారంగా ప్రజాప్రతినిధులు పనులను నిర్ణయిస్తున్నారు. తీర్మానాలు లేకుండా పనులు జరగడం, ఓ దగ్గర చేయాల్సిన నిర్మాణం మరోచోట చేయడం, చెప్పిన దానికంటే ఎక్కువ వ్యయం అయ్యే పనులు చేపట్టడం, నిర్మాణం పూర్తయిన తర్వాత తీర్మానాలు చేయడం వంటివి జరుగుతున్నాయి.

**ఇదీ అనుమతుల ప్రక్రియ**

ఎక్కడెక్కడ పనులు చేయాలన్న అవసరాన్ని ముందుగా గుర్తించి.. అంచనా విలువతో ప్రతిపాదనలు పంపించాలి. ఈ మేరకు పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ప్రతిపాదనలు పంపిన తర్వాత నిధుల మంజూరు అనంతరం పనులు పూర్తి చేయాలని అధికారులు తెలిపారు. ఇటీవల గ్రామాల్లో పంచాయతీ తీర్మానాలతో చాలాచోట్ల సీసీ నిర్మాణాలను చేపట్టారు. పరిపాలన అనుమతులు లేకపోవడం, తదితర కారణాలతో గుత్తేదారులకు మళ్లీ తీర్మానాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో సీసీ నిర్మాణాల వివరాలు (2024-25)

మంజూరైనవి: 1010

అంచనా విలువ: రూ.65 కోట్లు

పూర్తయిన పనులు: 655

ప్రగతిలో ఉన్నవి: 131

ప్రారంభించినవి: 224

**తప్పనిసరిగా అనుసరించాలి**

పక్కగా పనులను గుర్తించిన తర్వాతే చెల్లించాల్సి ఉంటోంది. అది కూడా స్పర్శ్ విధానంలోనే జరుగుతాయి. పనులు చేసే విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలి.

మదన్‌మోహన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి

## కోర్టు భవన నిర్మాణంపై కాలయాపన

పెద్దపల్లి : జిల్లా కోర్టు భవన నిర్మాణ స్థల ఎంపికలో ఏకాభిప్రాయం కుదరడంలేదు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉందని, అందుబాటులోని స్థలాలపై దృష్టి పెట్టాలని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక పర్యాయం స్థలం మారిపోవడంతో రెండోసారైనా ఎంపికైన చోటులో నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఇక్కడ నిర్మాణ స్థలంపై నెలకొన్న సందిగ్ధతతో తమ ప్రాంతం ప్రయోజనం పొందాలని రామగుండం, సుల్తానాబాద్ నాయకులు ఎవరికివారే ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రామగుండం ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడం చర్చనీయాంశమవుతుంది.

**మారిన స్థలాలు**

మూడేళ్ల క్రితం కన్నాల సమీపంలోని స్థలాన్ని ఎంపిక చేశారు. హైకోర్టు న్యాయవాదుల బృందం సైతం సదరు స్థలాన్ని దాదాపు ఖరారు చేశారు. కానీ ఈ ప్రాంతం కాలుష్య భరితంగా ఉండడంతోపాటు జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరం ఉందని కొందరు న్యాయవాదులు వ్యతిరేకించడంతో ఆ ప్రక్రియ కాస్త నిలిచిపోయింది. తాజాగా మంథని మార్గంలోని రాఘవపూర్ సమీపంలో పదెకరాలను గుర్తించారు. ఇది జిల్లా కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. వ్యవసాయ మార్కెట్‌లోని స్థలాన్ని కేటాయించాలని కొందరు వాదిస్తున్నారు. దీంతో మరోసారి కోర్టు భవన నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**ఆలస్యం చేస్తే ఇతర ప్రాంతానికి?**



పెద్దపల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థల లభ్యత అంతంతమాత్రంగానే ఉంది. జిల్లా కలెక్టరేట్ నిర్మాణం ఎస్సారెస్పీకి చెందిన స్థలంలో జరగగా.. ఆర్టీసీ డిపో ఏర్పాటుకు మండల పరిషత్తు, పంచాయతీరాజ్ స్థలాలను కేటాయించారు. పదేళ్ల క్రితం పెద్దపల్లికి మంజూరైన అదనపు సెషన్స్ కోర్టు స్థానిక నాయకత్వం వైఫల్యంతో గోదావరిఖనికి వెళ్లగా.. సాంఘిక సంక్షేమశాఖ డిగ్రీ కళాశాల సైతం సుల్తానాబాద్‌లో ఏర్పాటుచేశారు. ఆలస్యం చేస్తే ఈ కోర్టు కూడా మరోచోటికి వెళ్లే అవకాశముంది.

**అందరి సమన్వయంతోనే నిర్మాణం**

కోర్టు నిర్మాణానికి అనువైన స్థలానికి కొన్నిరోజులుగా అన్వేషణ చేపట్టాం. వీటన్నింటిలో రాఘవపూర్‌లోని స్థలమే మేలైనదిగా భావిస్తున్నాం. దీనికోసం నాయకులు, న్యాయవాదులను సమన్వయం చేసి.. ఎమ్మెల్యే సహకారంతో కోర్టు నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. భాస్కర్, పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

## ఇంధనం ఎలా?

సిరిసిల్ల : పాలకవర్గాలు లేక పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. ఏడాదిన్నరగా నిధుల కేటాయింపు జరగక పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ఆదాయ వనరులు లేని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కత్తిమీదసాము అవుతోంది. బాధ్యులుగా వ్యవహరిస్తున్న కార్యదర్శులపై ఆర్థిక భారం తడిసి మోపెడవుతోంది. వానాకాలం నేపథ్యంలో చేపట్టాల్సిన పనుల్లో ప్రతికూలత ఎదురై వ్యాధులు ముసురుకుంటున్నాయి.

**జాడలేని సాయం**

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం గతేడాది ఫిబ్రవరిలో ముగిసింది. పాలకవర్గాలు లేకపోవడంతో 15 ఆర్థిక సంఘం ద్వారా పల్లెలకు నిధులను కేంద్రం ఆపేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ ద్వారా అందించే నిధులు సైతం ఏడాదికిపైగా నిలిచిపోయాయి. సుమారుగా రూ.20 కోట్లకుపైగా గ్రామాలకు అందే సాయం ఆగిపోయింది. 18 నెలలుగా నిధులు లేకపోవడంతో ప్రతి పనికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**అప్పులతో తిప్పలు**

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత ఎన్నికలు జరపాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. దీంతో సర్కారు గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలు చేసినా నిధులు లేకపోవడంతో పల్లెపాలన గాడి తప్పింది. ఆదాయ వనరులు లేని పంచాయతీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. నిధుల లేమి, సిబ్బంది జీతాలు చెల్లింపులో జాప్యం, పారిశుద్ధ్య లోపం, విద్యుత్తు దీపాలు, తాగునీరు తదితర అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. 198 ఫాగింగ్ యంత్రాలు ఉండగా ఇంధనానికి తిప్పలు తప్పడం లేదు. అత్యవసర పనులకు పంచాయతీ కార్యదర్శులు అప్పుల భారం మోయాల్సిన పరిస్థితి తలెత్తింది. వినాయక చవితి, బతుకమ్మ పండగలు సమీపిస్తుండగా నిధుల లేమితో కార్యదర్శులు, గ్రామ పంచాయతీల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



**ట్రాక్టర్ల పరిస్థితి ఏంటీ?**

జిల్లాలో పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి గత ప్రభుత్వం ట్రాక్టర్‌ను కొనుగోలు చేసింది. సర్కారు సమకూర్చిన ట్రాక్టర్‌లతో పల్లెల్లోని చెత్త సేకరణతోపాటు మంచినీటి సరఫరా, హరితహారంలో నాటిన మొక్కలకు నీరు అందించేవారు. నిత్యం వీధుల్లో తిరిగి ఇంటింటికి తిరుగుతూ వాహనాల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించేవారు. కాలువల్లో పూడిక తీసిన తర్వాత వ్యర్థాలను ఊరి చివర కంపోస్ట్ షెడ్‌కు తరలించేవారు. ప్రస్తుతం పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ట్రాక్టర్‌కు కనీసం ఇంధనం సమకూర్చాలన్నా తలనొప్పిగా మారింది. ఇంజిన్‌లో ఆయిల్ తగ్గితే ఒక్కో లీటర్ కొనుగోలు చేసి పోయాల్సిన దుస్థితి నెలకొంది. వాహనం మరమ్మతుకు గురైతే ఇక అంతే సంగతులు. ఈ తరహా సమస్యల కారణంగా కొన్నిగ్రామాల్లో చెత్త సేకరణ, ఇతర పనులు సరిగా జరగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లా వివరాలు మండల పరిషత్తులు : 12

గ్రామ పంచాయతీలు : 260 జనాభా : 5.5 లక్షలుఆవాసాలు : 1.4 లక్షలు (సుమారుగా)

చురకలు



# ఒకేచోట సబ్ రిజిస్ట్రార్లు

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఓఆర్ఆర్ లోపల... అవతలున్న సంగారెడ్డి సహా మొత్తం 39 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు 11 సమీకృత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులుగా మారనున్నాయి. గచ్చిబౌలిలో ఈ సమీకృత కార్యాలయాల సముదాయం నిర్మాణానికి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్(తాలిం)లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి అత్యాధునిక వసతులతో కూడిన భవనాలను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందించారు. ఈ సముదాయంలో రంగారెడ్డి, గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఉంటాయి. నలుగురు సబ్‌రిజిస్ట్రార్లతోపాటు జిల్లా రిజిస్ట్రార్ ఉంటారని, పనితీరు మెరుగు



పడటంతోపాటు పర్యవేక్షణ పెరగనుందని ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మరో నాలుగు చోట్ల స్థలాలు గుర్తించాల్సి ఉంది

కూకట్‌పల్లి, బాలానగర్, వల్లభ్‌నగర్ (సెక్టార్)

రెడ్‌హిల్స్, చిక్కడపల్లి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, సికింద్రాబాద్

పటాన్‌చెరు, సంగారెడ్డి

ఎల్‌బీనగర్, చంపాపేట,సరూర్‌నగర్

**వసతులు ఇలా..**

అత్యాధునిక వసతులతో విశాలమైన భవనం. మూడు ఫ్లోర్లు. ఒక్కో ఫ్లోర్ 16 వేల చదరపు అడుగులు.

నిరీక్షణ గది టోకెన్ విధానం వివాహ రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారికి ప్రత్యేక హాల్ ఫీడింగ్ రూం. చిన్న పిల్లల కోసం క్రష్

వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంప్ వీల్‌ఛైర్ సదుపాయం

వాష్‌రూమ్‌లు ద్విచక్ర వాహనాలు, 300 కార్ల పార్కింగ్ గ్రీన్ బిల్డింగ్, సౌర విద్యుత్తు వినియోగం కేఫ్

# అంతర్జాలానికి అంతరాయం

హైదరాబాద్: కరెంట్ ఎంత ముఖ్యమో.. ఈ రోజుల్లో ఇంటర్నెట్ అంతే ముఖ్యం. ఈ రెండూ లేకపోతే నగరవాసుల వెతలు వర్ణనాతీతం. సిటీలో 48 గంటలుగా టీవీ, ఇంటర్నెట్ సేవలు పలు ప్రాంతాల్లో నిల్చిపోయాయి. ఇంటి నుంచి పనిచేస్తున్న ఉద్యోగులు, చిన్న కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాల్లో అంతర్జాలం లేక అవస్థలు పడ్డారు. ఐటీ ఉద్యోగులు ల్యాప్‌టాప్‌లు పట్టుకుని నెట్ వచ్చే ప్రాంతాలకు తరలి వెళ్లడం కన్పించింది. మరికొందరు కార్యాలయాలకు వెళ్లి పనిచేశారు. టీవీలు మూగబోయాయి. సేవలను పునరుద్ధరించేందుకు కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు ఒకవైపు ప్రయత్నిస్తుంటే..మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు ప్రమాదకరంగా వేలాడుతున్న టీవీ, ఇంటర్నెట్ కేబుళ్ల తొలగింపు రెండోరోజు బుధవారం కూడా కొనసాగింది. ఇంటి నుంచి విదేశాల్లోని క్లయింట్లకు చాలామంది ఉద్యోగులు పనిచేస్తుంటారని.. అంతర్జాలం లేక వారందరూ ఇబ్బంది పడ్డారు. రెండురోజుల్లో లక్ష కనెక్షన్లలో అంతరాయం ఏర్పడిందని ఆపరేటర్లు పేర్కొన్నారు.

**తొలగింపు ఆపాలని వినతి**



అధికారుల సూచనల మేరకు కేబుల్ సేవలన్నీ సింగిల్ కేబుల్ ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తామని, కొంత గడువు ఇవ్వాలని తెలంగాణ టీవీ, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. నగర వ్యాప్తంగా కేబుళ్ల తొలగింపు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం వారు మింట్ కాంపౌండ్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయానికి చేరుకున్నారు. డైరెక్టర్‌ను కలిసి కేబుళ్లను తొలగించవద్దని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాము వాడిన కేబుల్ ద్వారా విద్యుదాఘాతం జరగదని, అయినా అభ్యంతరాల నేపథ్యంలో సింగిల్ కేబుల్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 30 ఏళ్ల నుంచి ఉన్న కేబుల్ వ్యవస్థను రోజుల వ్యవధిలో మార్చడం కష్టమని వివరించామని చెప్పారు.

# మెట్రో మైలురాళ్లు ఏర్పాటు

హైదరాబాద్: పాతబస్తీ మెట్రో రైలు నిర్మాణ పనులు ప్రారంభించడానికి వీలుగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఏఎంఎల్) చర్యలు చేపట్టింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో దూరాన్ని తెలిపే మైలురాళ్ల ఏర్పాటు ప్రక్రియను మొదలెట్టింది. 100 మీటర్లకు ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేస్తోంది. జేబీఎస్ నుంచి దూరాన్ని లెక్కించి మైలురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ మార్గంలో వచ్చే స్తంభాలు, స్టేషన్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి వాటిని మార్కింగ్ చేసే పనిని చేపట్టింది. ఇందుకు డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(డీజీపీఎస్) ద్వారా సర్వే చేస్తున్నారు. ఇది మెరుగైన కచ్చితమైన స్థానాన్ని గుర్తిస్తుంది. ఇది జీపీఎస్ కంటే మెరుగైందని మెట్రో అధికారులు తెలిపారు. సర్వే ఆధారంగా స్తంభాల పాయింటను గుర్తించి అక్కడ మైలురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో భూ సామర్థ్య పరీక్షలు చేపట్టనున్నారు.

మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్తు, మంచినీరు, మురుగునీటి వ్యవస్థలు ఏమైనా ఉన్నాయేమోనని గుర్తించేందుకు తవ్వకాలు చేపట్టారు. ఫలక్‌నుమా వద్ద తవ్వకాల్లో నీటి పైపులైను బయటపడింది. ఆయా విభాగాల అధికారుల సమన్వయంతో వీటిని పక్కకు జరపనున్నారు. అందుకు అయ్యే అంచనా వ్యయాలను ఇవ్వాలని ఇప్పటికే ఆయా విభాగాలను హెచ్‌ఏఎంఎల్ కోరింది.

# బకాయిలే గుదిబండ



ఖమ్మం : సర్వజనాసుపత్రి అంటేనే అన్ని రకాల వైద్య సేవలందించే కేంద్రం. ఇక్కడ శస్త్ర చికిత్సలకు కావాల్సిన వైద్య పరికరాలు, రసాయనాల కొనుగోలు, అత్యవసర ఔషధాలు, యంత్రాల మరమ్మతులకు తరచూ ఇబ్బందవుతోంది. కారణం నిధుల కొరత. వైద్యశాలలో వినియోగం దృష్ట్యా ఎక్స్‌రే, ఈసీజీ, బీపీ కొలిచే పరికరాలు, వ్యాధి నిర్ధారణ యంత్రాలు చాలాసార్లు మరమ్మతులకు గురవుతున్నాయి. సమస్య చిన్నదైనా, పెద్దదైనా నెలలపాటు పరికరాలు మూలన చేరుతున్నాయి. కారణం? నిధుల లేమి..

నేత్ర, గుండె, ఆర్థో అనేవి అత్యవసర చికిత్స విభాగాలు. వీటిల్లో ఇన్‌ప్లాంట్స్, స్టంట్స్, లెన్స్ కొనుగోలు ఖర్చుతో కూడుకుంది. ప్రభుత్వం కేటాయింపుల్లేక, చాలక.. చాలాసార్లు కొన్ని రకాల చికిత్సలు రోజులపాటు ఆగిపోతున్నా. ఆరోగ్యశ్రీ రూపంలో సర్వజనాసుపత్రికి రావల్సిన బకాయిలు సకాలంలో విడుదలైతే పైన పేర్కొన్న ఇబ్బందులేవీ ఉండవు. ఉమ్మడి జిల్లాతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వేలమంది రోగుల ప్రాణదాత 'జిల్లా సర్వజనాసుపత్రి'. ఏటా వందల మంది పేదలకు ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. రోగులకు దీనికింద అందించే ప్రతి చికిత్సకూ ప్రభుత్వం డబ్బు చెల్లిస్తుంది. కొద్దికాలంగా ఆ విషయం విస్మరించటంతో పెద్ద మొత్తంలో ఆరోగ్యశ్రీ నిధులు బకాయిపడింది. ఆస్పత్రి వైద్యవిధాన పరిషత్(టీవీవీపీ) నుంచి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి మార్చినప్పటి నుంచి నిధుల విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంది. 2023, నవంబరు నుంచి ఒక్కపైసా విడుదల కాలేదు. ఈ క్రమంలో ఆరోగ్యశ్రీ కింద 3,197 మంది వైద్య సేవలు పొందారు. 19 విభాగాల్లో చికిత్స అందించారు. వీటికి సంబంధించి రూ.4,61,29,834 కోట్ల నిధులు రావాలి. వీటిని ఎప్పటికప్పుడు ఆసుపత్రి ఖాతాలో జమ చేయకపోవటంతో ఏ చిన్న అవసరానికైనా బేలచూపులు తప్పటం లేదు.

**సకాలంలో చెల్లింపులుంటే?**

ఏటా ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ చాలటం లేదు. ప్రత్యామ్నాయంగా ఆరోగ్యశ్రీ నిధులు ఆస్పత్రి నిర్వహణకు వాడుకోవచ్చు. ఫలితంగా ప్రభుత్వ వైద్యంపై రోగుల్లో నమ్మకం పెరుగుతుంది.

పేద వర్గాలకు సరైన సమయంలో రోగ నిర్ధారణ, చికిత్స లభిస్తుంది. ప్రైవేటుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

ఆరోగ్యశ్రీ విభాగం సిబ్బంది వేతనాలు, వైద్యుల ప్రోత్సాహకాల చెల్లింపుల్లోనూ జాప్యాన్ని తొలగించొచ్చు. మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకాలుండవు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది కష్టాలు చెల్లు..!

ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి సకాలంలో వేతనాలు విడుదల కావటం లేదు. దీంతో పలు సందర్భాల్లో వారు ఆందోళనబాట పడుతున్నారు. కార్మికుల సమ్మెతో పారిశుద్ధ్య లోపాలు తలెత్తుతున్నాయి. బయోమెడికల్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకపోతున్నాయి. ఆ సందర్భాల్లో నిధుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఆరోగ్యశ్రీ నిధులుంటే వెంటనే సర్దుబాటు చేయొచ్చని ఆసుపత్రి వర్గాలంటున్నాయి.

'ఆరోగ్యశ్రీ నిధుల బకాయిల వివరాలను ఉన్నతాధికారులకు తెలియచేశాం. ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కూడా చర్చించాం. నిధులు విడుదలైతే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.'

డాక్టర్ నరేందర్, మెడికల్ సూపరింటెండెంట్

# వరద వస్తోంది.. వృథాగా పోతోంది!



అశ్వారావుపేట : పెద్దవాగు ప్రాజెక్టు ఆనకట్టకు గతేడాది జులై 18న 20చోట్ల గండ్లు పడ్డాయి. వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి వరద జలాలు చేరుతున్నా.. గేట్లు ఎత్తి ఉండటంతో వృథాగా దిగువకు పోతున్నాయి. 16వేల ఎకరాలకు సాగునీరందించేలా 1,102 ఎకరాల శిఖంలో 19.3 అడుగుల ఎత్తులో 0.6 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 1975లో ఈప్రాజెక్టును నిర్మించారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టు తెలంగాణ భూభాగంలో ఉంది. అశ్వారావుపేట నియోజకవర్గంలో 2,360 ఎకరాల ఆయకట్టు మిగిలింది. మిగతా ఆయకట్టంతా ఏపీలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఉంది. పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతులకు నీటిపారుదలశాఖ అధికారులు రూ.19.20కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ నిధుల్లో 85శాతం ఏపీ, 15శాతం తెలంగాణ కేటాయించాల్సి ఉంది. ఏపీలో ఈ ప్రాజెక్టు కింద అత్యధిక సాగుభూమి పోలవరం జలాశయం వల్ల ముంపునకు గురవుతుండటంతో అక్కడి ప్రభుత్వం నిధుల విడుదలకు వెనుకాడుతున్నట్లు సమాచారం.

**నీరు నింపితే రింగ్‌బండ్‌కు ప్రమాదం**

పెద్దవాగు ప్రాజెక్టు కింద తెలంగాణ రైతుల భూములకు సాగునీరందించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.3.50 కోట్లతో తాత్కాలిక రింగ్‌బండ్‌ను ఏర్పాటుచేసింది. ప్రాజెక్టు గేట్ల వద్ద 15 మీటర్లు, మిగతా కట్ట పదకొండు మీటర్ల ఎత్తులో 0.2 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 250 మీటర్ల పొడవుతో నిర్మించింది. మట్టితో నిర్మించటం, కట్టకు రెండువైపులా రాళ్లు, ఇసుక బస్తాలతో రివిట్‌మెంట్ చేయకపోవటంతో రింగ్‌బండ్ పటిష్ఠంగా లేదు. అందులో నీరు నింపితే కట్ట తెగిపోయే ప్రమాదముందని అధికారులు భావించి ఆ పని చేయటం లేదని రైతులు వాపోతున్నారు.

'రింగ్‌బండ్‌తో 3వేల ఎకరాలకు సాగునీరందించవచ్చు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల రింగ్‌బండ్ కట్టకు నష్టం జరగకూడదని ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నాం. వరద ఉద్ధృతి తగ్గాక గేట్లను మూసేస్తాం' అని నీటిపారుదలశాఖ డీఈ కృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రింగ్‌బండ్ వల్ల రైతులకు ప్రయోజనం లేదు. దాని సామర్థ్యం వరకు నీరు నింపకపోవటంతో నిరుపయోగంగా మారింది. రింగ్‌బండ్‌తో కనీసం 100 ఎకరాలకూ గతేడాది సాగునీరందలేదు. అవే నిధులతో ప్రాజెక్టు గేట్ల వద్ద పడిన భారీ గండిని పూడ్చించి ఉంటే బాగుండేది.

సాయిల వీరబాబు, రైతు

ఏపీ ప్రభుత్వంతో సంబంధం లేకుండా తెలంగాణ సర్కారు.. పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించాలి. అలా అయితేనే రైతులకు మేలు జరుగుతుంది.

దేరంగుల కురేశ్, రైతు

# సాంకేతిక విద్యకు సన్నద్ధం




మెదక్: పదో తరగతి పాసైన విద్యార్థులకు శిక్షణతో పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగేసింది. ఈ మేరకు హవేలిఘనపూర్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణం చేపట్టింది. నైపుణ్యాలలేమితో ఎంతోమంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థ) కళాశాలకు అనుసంధానంగా ఏటీసీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయిం చిన విషయం విదితమే. ప్రస్తుతం హవేలిఘనపూర్‌లో టాటా టెక్నాలజీ స్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఏటీసీ పనులు పూర్తిచేశారు. రూ.కోట్ల వ్యయంతో అధునాతన యంత్రాల బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది.

**కోర్సులు ఇవే..**

జిల్లాలో మొత్తం 7 ఐటీఐలు కొనసాగుతున్నాయి. వీటిలో ఒక్కటే ప్రభుత్వ ఐటీఐ కాగా, మిగతావన్నీ ప్రైవేటువే. మొత్తం 1400 మంది విద్యార్థులు ఆయా కోర్సులు అభ్యసిస్తున్నారు. ఏటీసీలో ఆరు ఆధునిక కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ పర్చువల్ మెకానికల్, అడ్వాన్స్‌డ్ సీఎస్సీ మెషినింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ ట్రేడ్‌లలో తర్ఫీదు ఇవ్వనున్నారు. నేటి పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ రూపొందించారు.

**కొనసాగుతున్న ప్రవేశాల ప్రక్రియ**ఏటీసీలో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు %http:-///iti.telangana.gov.in% వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. ఆగస్టు 28 వరకు గడువు ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతితో పాటు ధ్రువపత్రాలతో ఐటీఐ కళాశాలకు వెళ్తే తక్షణమే సీటు పొందవచ్చు. పది పూర్తిచేసిన విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశమని, త్వరగా ఉపాధి పొందవచ్చని లేదంటే స్వయం ఉపాధి వైపు కొనసాగవచ్చని మెదక్ ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు.

# ఎక్కడున్నాయి.. ఎంత సేకరించారు

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్(కేఎస్‌సీఎల్) ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేసి రక్షణ, భద్రత, సాంకేతిక అంశాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా చెత్త సేకరణ పాయింట్లు, డంపింగ్‌యార్డు, డీఆర్‌సీసీ కేంద్రాలు, వాహనాల మరమ్మతుల కేంద్రం, రిజర్వాయర్లు వంటివి దీనికి మ్యాపింగ్ చేశారు.

**చెత్త వేసే చోట నిఘా..**

రోడ్ల మీద చెత్తా చెదారం తీసుకొచ్చి పడేసే వారిని గుర్తించేందుకు మొదట 15 చోట్ల సీసీ కెమెరాలు బిగించే పనిలోపడ్డారు. ఇప్పటికే బస్టాండ్ వెనకాల బిగించారు. కమాండ్ కంట్రోల్ ద్వారా 66 డివిజన్ల పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల బయోమెట్రిక్ తెలుస్తోంది. ఈ నెలలో ఇక ఏ డివిజన్‌లో ఎందరు డుమ్మా కొట్టారనేది అప్పుడే తెలిసిపోతుంది.

**త్వరలో మొబైల్ అప్లికేషన్**

నగరపాలిక ద్వారా పౌర సేవల కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్ అందుబాటులోకి రానుంది. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఆస్తిపన్ను, నల్లా బిల్లు, ట్రేడ్ లైసెన్స్, ఇతర చెల్లింపులు చేసుకోవడానికి వీలు కల్పిస్తారు.

ఇట్టే తెలుసుకోవచ్చు..



నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి రోజు నడిచే పారిశుద్ధ్య ట్రాక్టర్లు, లోడర్లు, స్వీపింగ్ మిషన్లు, స్వచ్ఛ ఆటోలు, ఫాగింగ్ మిషన్లు, వైకుంఠరథం, ట్యాంకర్లు ఎక్కడ తిరిగాయనే విషయాన్ని వెహికల్ ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏ వాహనం ఎంతదూరం, ఎంత వేగంతో వెళ్లింది? ఎంతమేర చెత్త సేకరణ చేశారనేది పరిశీలించవచ్చు.

డీఆర్‌సీసీ కేంద్రాలకు ఎన్ని వాహనాలు వచ్చి చెత్త వేరు చేశాయి? ఎంతమేర చెత్త డంపింగ్‌యార్డుకు వెళ్లిందో వే బ్రిడ్జి ద్వారా లెక్కలు తీసుకుంటారు.వాణిజ్య ప్రాంతాల్లోని దుకాణాల ద్వారా చెత్త సేకరణ ఎన్ని దుకాణాల్లోంచి చేశారో తనిఖీ చేస్తారు.

మొత్తం 155 వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ విధానం అమలు చేస్తున్నారు. త్వరలో పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్ ఎంత మేర వాడుతున్నారనేది తెలుసుకోవడానికి ఫ్యూయల్ సెన్సార్లు బిగించనున్నారు. ఇంటింటా చెత్త సేకరణ ఏ విధంగా చేస్తున్నారో సీసీకెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తారు.

# సమన్వయ లోపం.. పార్కింగ్‌కు శాపం

కరీంనగర్ : కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన కారును కోతిరాంపూర్ ప్రాంతంలో రోడ్డు పక్కన నిలిపాడు. అరగంట తర్వాత రోడ్డుపై వాహనం నిలపడంతో జరిమానా విధించినట్లు తన చరవాణికి సమాచారం వచ్చింది. స్టాండ్–బై కింద తాను కారులో ఉన్నా జరిమానా ఎలా విధిస్తారంటూ వాహన యజమాని వాపోయారు.

కరీంనగర్ ఉత్తర తెలంగాణకు గుండెకాయ. వ్యాపారపరంగా హైదరాబాద్, వరంగల్ తర్వాత స్థానంలో నిలుస్తుంది. వైద్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్‌కు చెందిన అనేక మంది వ్యాపార, వాణిజ్యపరంగా కరీంనగర్‌కే వస్తుంటారు. స్మార్ట్‌సిటీగా సైతం మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయినా ఇక్కడ పార్కింగ్ సౌకర్యం అస్తవ్యస్తంగా మారింది. పండగలు వస్తే వాహనాలు ఎక్కడ నిలుపుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది.

**దుకాణాల ముందే..**

కరీంనగర్ జిల్లాలో 4 లక్షలకుపైగా ద్విచక్రవాహనాలు, 50 వేలకుపైగా కార్లను వినియోగిస్తున్నారు. టవర్‌సర్కిల్, ప్రకాశం గంజ్, మార్కెట్, గాంధీ రోడ్డుకు ఇతర ప్రాంతాల నుంచి రోజుకు 50 వేలకుపైగా వాహనదారులు వస్తుంటారు. వారు వినియోగించే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలం లేదు. దీంతో నగర ప్రజలు దుకాణాల ముందు వాహనాలు నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. మరికొందరు వాహనదారులు రోడ్డు మధ్యలో వాహనాలను వరుసగా పార్కింగ్ చేస్తుండగా కాలినడక వచ్చే వారు




ఇబ్బంది పడుతున్నారు.

**రెండు శాఖల మధ్య..**

స్మార్ట్‌సిటీగా ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా కరీంనగర్‌లో పార్కింగ్‌కు ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్ పోలీసులు, బల్దియా అధికారుల మధ్య సమన్వయ లోపంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని కలెక్టరేట్ బంగ్లా, పాత మున్సిపల్ వసతి గృహం ప్రాంతాల్లో స్థల పరిశీలన చేయగా ప్రస్తుత పరిస్థితుల్లో పాత మున్సిపల్ వసతి గృహంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మార్కెట్ ప్రాంతం, అన్నపూర్ణ కాంప్లెక్స్ ప్రాంతాల్లో, జయశంకర్ విగ్రహం వద్ద వాహనాలను నిలుపుదల చేస్తున్నారు.

**తగిన చర్యలు తీసుకుంటాం**

నగరంలో వాహనాల పార్కింగ్ కోసం ఇబ్బంది ఉంది. దుకాణాల ముందు పార్కింగ్ చూపకుండా భవన నిర్మాణ కోసం అనుమతి ఇవ్వడం సరైన పద్ధతి కాదు. పార్కింగ్ స్థలం చూపిన తర్వాతనే అనుమతి ఇవ్వాలి. ఇప్పటికే రెండు ప్రాంతాల్లో పార్కింగ్ కోసం స్థల పరిశీలన జరిగింది. బి.యాదగిరి స్వామి, ఏసీపీ, కరీంనగర్ ట్రాఫిక్

# ఎన్టీపీసీ సౌజన్యం.. విద్యార్థినులకు సౌకర్యం

గోదావరిఖని : రామగుండం ఎన్టీపీసీ సౌజన్యంతో ఎస్సీ బాలికలకు వసతి సదుపాయం కలగనుంది. శిథిలావస్థలోనున్న ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహ నిర్మాణాన్ని ఎన్టీపీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతగా తీసుకొంది. రూ.2.7 కోట్లతో అత్యాధునిక వసతులతో రెండంతస్తుల్లో చేపట్టిన భవన నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. జిల్లా పాలనాధికారి చొరవతో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణం పనులు చేపట్టగా చివరిదశకు చేరుకొన్నాయి.
వర్షం కురిసిందంటే చాలు భవనం పైకప్పు ఉరుస్తుండడంతో ఆవరణ జలాశయంగా మారేది. పైకప్పు పెచ్చులు ఊడి కిందపడుతుండేవి. ఓ గది గోడలకు విద్యుత్తు షాక్ వచ్చేది. దీంతో ఇక్కడికి పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. క్రమక్రమేణ విద్యార్థినుల సంఖ్య పడిపోయింది. వసతి గృహ సంక్షేమాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన వరుణ వసతులు కల్పిస్తామంటూ తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థినుల సంఖ్యను పెంచేందుకు కృషి చేశారు. మరో వైపు శిథిల భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారుల ద్వారా జిల్లా పాలనాధికారి, ఎమ్మెల్యేను పలుమార్లు కలిసి కోరారు. శిథిల భవనాన్ని పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని కూల్చేయాల్సిందేనని, వసతి గృహంగా వినియోగించవద్దని తేల్చిచెప్పారు. 2016లో ఇక్కడి విద్యార్థినులను మంథనిలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి తరలించారు. గోదావరిఖని ఎస్సీ బాలికల వసతి గృహ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ 2019లో జిల్లా



పాలనాధికారి ఎన్టీపీసీ అధికారులకు లేఖలు రాశారు. దీనికి స్పందించిన వారు కేంద్ర కార్యాలయం ఆమోదంతో రూ. 2.7 కోట్లు కేటాయించారు. సుమారు రెండేళ్ల కిందట భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు. భవనంలోని మొదటి అంతస్తులో వంట గది, భోజనశాల, అధ్యయన గది(రీడింగ్ రూమ్)లు, రెండో అంతస్తులో విద్యార్థినుల వసతి కోసం ప్రత్యేకంగా గదులు నిర్మిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి పీజీ స్థాయి వరకు విద్యార్థినులకు వసతి సదుపాయం కల్పించాల్సి ఉండగా ఉన్నత స్థాయి వరకు మాత్రమే ఇందులో ఉండేవారు. భవన నిర్మాణం పూర్తయితే పీజీ విద్యార్థినులకు వసతి సదుపాయం కలగనుంది.

# బాల్యం.. బలహీనం

పెద్దపల్లి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల వైద్య పరీక్షల్లో పలు వ్యాధులు సోకుతున్నట్లు బహిర్గతమైంది. పరిశుభ్రత పాటించకపోవడంతో చర్మ సంబంధ వ్యాధులతో సతమతం అవుతున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య(ఆర్బీఎస్కే) కార్యక్రమంలో గుర్తించారు. ఆహారంపై సరైన అవగాహన లేకపోవడం, జన్యుపరమైన సమస్యలతో తీవ్ర పోషకాహారలోపం, బరువు తక్కువ, వయసుకు తగ్గ ఎత్తు ఉండటం లేదని తెలుతోంది.జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్బీఎస్కే బృందాలు 0-6 ఏళ్లలోపు చిన్నారులను పరీక్షించారు. జిల్లావ్యాప్తంగా 18,331 బాలికలు, 17,382 బాలురు మొత్తం 35,713 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 967 మంది పిల్లలు పలు వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆరేళ్లలోపు పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు అందించినప్పటికీ పోషకాహారలోపం బారినపడటం ఆందోళన కలిగిస్తోంది. కేంద్రాల్లో చిన్నారులకు భోజనం, ఉడికిన గుడ్లు ఇవ్వాల్సి ఉండగా చాలా చోట్ల ఇంటికి తీసుకెళ్తుండటంతో పిల్లలకు సరిగ్గా అందడం లేదు. కొన్ని చోట్ల భోజనం ఉడకడం లేదనే ఆరోపణలున్నాయి.

**కారణాలు ఇవీ..**
తల్లిదండ్రుల నిరక్షరాస్యత, సమతుల ఆహారం తీసుకోకపోవడం.
జన్యుపరమైన సమస్యలతో పుట్టుకతో వ్యాధులు సోకడం.
అప్పుడే పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించకపోవడం. చిన్నారులకు ఉదయం వేళ సూర్యరశ్మి తగిలేలా జాగ్రత్తలు తీసుకోకపోవడం. డి విటమిన్‌తో ఎముకల బలం, వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది.
**ఇలా చేస్తే ఆరోగ్యం**ఇంట్లో చిరుధాన్యాలతో చేసిన ఆహారం ఇవ్వాలి. బెల్లం, పల్లీలు, నువ్వులతో తయారు చేసిన వంటకాలను అందించాలి. పాల ఉత్పత్తులు, గుడ్లు, మాంసం, తాజా ఆకు కూరగాయల భోజనంతో తినిపించాలి.కాలానుగుణంగా లభించే పండ్లను తినిపించాలి.

# నిండుకుండల్లా జంట జలాశయాలు

హైదరాబాద్: నగరానికి తాగునీటిని అందించడమే కాకుండా పర్యావరణంలో కీలకంగా ఉన్న ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు వేగంగా నిండుతున్నాయి. ఇప్పటికే హిమాయత్‌సాగర్ నిండుకుండలా ఉండగా, ఉస్మాన్‌సాగర్‌లోకి భారీగా నీరు చేరుతోంది. చేవెళ్ల, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఈసీ నదిలో ప్రవాహం పెరగడంతో వారం రోజులుగా హిమాయ



త్‌సాగర్‌లోకి నీరు భారీగా చేరింది. గురువారం 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా తాజా వర్షాలతో మరింత పెరుగుతుందని జలమండలి అధికారులు అంచనా వేస్తున్నారు. వికారాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో కురుస్తున్న వానలతో మూసీలో ప్రవాహం పెరిగి ఉస్మాన్‌సాగర్ నిండుతోంది. గత జులై 24వ తేదీ కంటే రెండు జలాశయాల్లోనూ నీటి నిల్వలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి రెండు జలాశయాలు రోజుకు 40 ఎంజీడీల తాగునీటిని అందిస్తాయి.

# చారిత్రక జలసిరి... కొత్తందాల వారధి



హైదరాబాద్: చారిత్రక మీరాలం చెరువుపై రూ.430 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మూసీ నది అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో ప్రాజెక్టును చేపట్టేందుకు పురపాలకశాఖ కార్యదర్శి కె.ఇలంబర్తి గురువారం పరిపాలన అనుమతి మంజూరు చేశారు. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఉత్తర్వులో పేర్కొన్నారు. అవసరమైన భూసేకరణ, టెండరు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. ఐకానిక్ బ్రిడ్జి నమూనాను ఐఐటీ హైదరాబాద్, జేఎన్‌టీయూ, వరంగల్ నిట్ వంటి ప్రముఖ సంస్థలకు చూపించి.. నిపుణుల ఆమోదం తీసుకున్నాక.. నిర్మాణ పనులు చేపట్టాలని పురపాలకశాఖ సూచించింది.

**చారిత్రక నేపథ్యం..**
మైలార్‌దేవ్‌పల్లి, హసన్‌నగర్, శంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో కురిసే వర్షపునీటితో.. నగర దాహార్తిని తీర్చేందుకు.. మూడో నిజాం ఈ చెరువును నిర్మించారు. పనులు జులై, 1804లో మొదలై, 1806లో పూర్తయ్యాయి. నిజాం సంస్థానంలో దివాన్‌గా పని చేసిన మీర్ ఆలం బహదూర్ పేరును ఈ తటాకానికి పెట్టారు. అర్ధ చంద్రాకారంలో నిర్మాణమైన చెరువు కట్ట విశేషంగా ఆకట్టుకుంటుంది. చెరువు మధ్యలో మూడు దీవులుంటాయి. ఒకప్పుడు చెరువు 600 ఎకరాల్లో విస్తరించి ఉండేది. ప్రస్తుతం 450ఎకరాలకు పరిమితమైంది. అనంతరం చెరువు దిగువన జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు ప్రధాన ఆకర్షణలను ఐకానిక్ బ్రిడ్జితో అనుసంధానం చేసి.. పర్యాటకులను ఆకట్టుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. అందులో భాగంగా.. బెంగళూరు హైవే నుంచి చెరువు అవతలి వైపున ఉన్న చింతల్‌మెట్ ప్రాంతాన్ని కలుపుతూ వంతెనను నిర్మించనున్నారు.

**ఐకానిక్ బ్రిడ్జి ఇలా..**
పొడవు: 2.5 కి.మీవెడల్పు: 16.5 మీటర్లు (నాలుగు రోడ్లు, చివరన విశాలమైన కాలిబాట)ఎక్కడి నుంచి ఎక్కడికి..: చెరువుకు పశ్చిమాన ఉన్న చింతల్‌మెట్, తూర్పున శాస్త్రిపురం నుంచి సాగిపోయే బెంగళూరు జాతీయ రహదారిని కలుపుతూ ఐకానిక్ వంతెన నిర్మాణం
ఎవరికి ప్రయోజనం..: చింతల్‌మెట్, కిషన్‌బాగ్, అత్తాపూర్, బహదూర్ పుర, శాస్త్రిపురం ప్రాంతాల్లోని వాహనదారులకు, చింతల్‌మెట్ నుంచి బెంగళూరు జాతీయ రహదారి ద్వారా విమానాశ్రయం వెళ్లే వారికి ప్రయోజనం.

# భద్రత గాలికి.. పిల్లలు బయటికి



హైదరాబాద్: ఏప్రిల్ 2024: గాజులరామారంలోని స్టేట్ జువైనల్ హోం సిబ్బంది కళ్లుగప్పి 8 మంది బాలలు పారిపోయారు. మార్చి 2025: నింబోలి అడ్డాలోని బాలికల జువైనల్ హోం నుంచి ఇద్దరు పరారయ్యారు. జులై 2025: సైదాబాద్‌లోని జువైనల్ హోంలో ఒకేసారి ఐదుగురు పారిపోయారు.
వీధిబాలలు, అనాథలు, బాల నేరస్థులకు ఆశ్రయం కల్పించే జువైనల్ హోంల నిర్వహణ నగరంలో మొక్కుబడిగా మారింది. చిన్నారులు పారిపోతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నా అధికారులు గుణపాఠం నేర్వడం లేదు. దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. సైదాబాద్‌లోని జువైనల్ హోం నుంచి ఒకేసారి ఐదుగురు పారిపోవటం భద్రతా లోపాల్ని ఎత్తిచూపుతోంది.
మూడుచోట్లా అంతే.. నగరంలో మూడు ప్రాంతాల్లో జువైనల్ హోంలు ఉన్నాయి. నింబోలి అడ్డాలో బాలికల జువైనల్ హోం (వీధి బాలలు, నేరారోపణ, దోషులకు) ఉంది. సైదాబాద్‌లో చిల్డ్రన్ హోం (వీధి బాలలు, ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లో పట్టుబడిన చిన్నారులకు), అబ్జర్వేషన్ హోం(వివిధ నేరాల్లో నిందితుల కోసం) ఉన్నాయి. 18 ఏళ్లలోపు చిన్నారులు నేరాలు చేసి.. దోషిగా నిరూపితమైతే గాజులరామారంలోని ప్రత్యేక జువైనల్ హోంకు తరలిస్తారు. ఈ గృహాల్లో భద్రత గాల్లో దీపంలా తయారైంది. పిల్లల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడం సమస్యగా మారింది. సిబ్బందిలో ఎవరైనా సెలవు పెడితే మిగిలిన కొద్దిమందే చిన్నారుల్ని పర్యవేక్షించాల్సిన పరిస్థితి. సైదాబాద్ జువైనల్ హోం నుంచి ఐదుగురు తప్పించుకోవడానికి ఇదే కారణమైంది. బోనాల సందర్భంగా ఒకరు సెలవు పెట్టగా.. విధుల్లో ముగ్గురే ఉన్నారు. దీన్నే అవకాశంగా తీసుకుని పిల్లలు పారిపోయారు.

**తీరని సమస్యలు..**
బాలికల సంరక్షణ కేంద్రంలో 70 మంది ఆశ్రయం పొందుతున్నారు. 33 మంది సిబ్బంది అవసరం కాగా 16 మందే ఉన్నారు. షిఫ్టుల విధానంతో కొన్నిసార్లు 4-5 మందే ఉంటున్నారు. ఇది తప్పించుకోవడానికి అవకాశంగా మారుతోంది.
చిల్డ్రన్ హోంలో 104 మంది బాలలు ఉన్నారు. ప్రస్తుతం ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుండటంతో పిల్లల సంఖ్య ఎక్కువగా ఉంది. 16 మంది సిబ్బంది అవసరం కాగా 12 మందే ఉన్నారు.
సైదాబాద్ అబ్జర్వేషన్ హోంలో 95 మంది బాలలున్నారు. ప్రస్తుతం 12 మంది సిబ్బంది ఉన్నా.. ఒక్కో షిఫ్టులో నలుగురు ఉంటున్నారు. ఈ బాలలంతా నేరారోపణలు ఎదుర్కొంటున్నవారే.
గాజులరామారంలోని ప్రత్యేక హోంలో 26 పిల్లలు ఉన్నారు. 14 మంది సిబ్బందికి గాను 12 మందే ఉన్నారు.

# ఆకట్టుకునే జలపాతం.. రోడ్డేమో బురదమయం



సైదాపూర్ : జిల్లాలోని రాయికల్ జలపాతానికి వెళ్లటానికి సరైన రోడ్డు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి సుమారు 5కిలోమీటర్ల దూరంలో ఎత్తైన గుట్టల మీద నుంచి జలధారలు జాలువారుతూ ఏటా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. విశాలమైన గొలుసుకట్టు గుట్టల మధ్య ప్రకృతి రమణీయత ఉట్టిపడే విధంగా జలపాతం కనువిందు చేస్తోంది. చుట్టూ గుట్టలు, పచ్చని పొలాలు, పక్కన మోహిన్‌చెరువు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, సిద్దిపేట, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చి ఉత్సాహంగా గడుపుతారు. వారాంతంలో పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉంటుంది. అయితే గ్రామం నుంచి జలపాతం వరకు సుమారు 5 కిమీల మేర బురదరోడ్డే దిక్కు కావటంతో కాలు తీసి కాలు వేయలేని దుస్థితి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది.

**రూ.8.75 కోట్లు మంజూరు.. ప్రారంభం కాని పనులు**
జలపాతం అభివృద్ధికి ప్రభుత్వం రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు నెలల క్రితం చెప్పారు. ఈనెల 27న జలపాతం సందర్శించి ఏయే పనులు చేపట్టనున్నారో ప్రకటించనున్నారు. గ్రామం నుంచి జలపాతం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, రహదారికి ఇరువైపులా చెట్లు పెంచటం, పర్యాటకులు సేద తీరేందుకు విశ్రాంతి గదులు, పచ్చిక బయళ్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్ తదితర వసతుల కల్పనకు అటవీ, పర్యాటక శాఖలు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. అయితే నిధులు మంజూరు కాగా.. టెండర్లు ఇంకా పూర్తి కాలేదు. దీంతో ఈ ఏడాది సైతం సందర్శకులు జలపాతానికి బురద రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తోంది.
**మందుబాబులకు అడ్డాగా..**జలపాతం వద్దకు వస్తున్న యువకులు పరిసరాల్లో మద్యం తాగుతుండటంతో పర్యాటకులకు ఇబ్బందికరంగా ఉంది. మందు బాటిళ్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు విచ్చలవిడిగా పడేస్తూ పర్యావరణానికి హానీ కలిగిస్తున్నారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు జలపాతం పరిసరాలను మద్యపాన నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలని స్థానికులు కోరుతున్నారు.

# బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

గోదావరిఖని : రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రామగుండం ప్రాంతంలోని నాలుగు ఉపరితల గనుల్లో గురువారం ఒక్క షిఫ్టు కూడా నడిచే పరిస్థితి లేకపోవడంతో యంత్రాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బుధవారం నుంచి కురుస్తున్న వర్షంతో ఉపరితల గనుల క్వారీలన్నీ బురదమయంగా మారాయి. కోల్‌బెంచ్‌ల్లోకి వరద నీరు చేరడంతో బ్లాస్టింగ్ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన పనులు ముందుకు సాగలేదు.
సింగరేణి వ్యాప్తంగా 18 ఉపరితల గనులుండగా రామగుండం ప్రాంతంలో నాలుగు ఉన్నాయి. సుమారు 5 వేల మంది ఉద్యోగులు పనిచేసే నాలుగు ఉపరితల గనుల్లో రోజుకు 70 వేల టన్నుల బొగ్గు వెలికి తీస్తారు. పూర్తిస్థాయిలో పనులు నడిస్తే ఒక్కోసారి లక్ష టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి చేపడతారు.
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నిలిచిపోయిన పనులను తిరిగి పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. క్వారీలకు వెళ్లే మార్గాల్లో పేరుకుపోయిన బురదను తొలగించడంతో పాటు



క్వారీల్లోకి చేరిన నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపింగ్ చేస్తున్నారు. రోజంతా కురిసిన వర్షంతో ఉద్యోగులకు ఎలాంటి పనులు కేటాయించలేకపోయారు. దీంతో ఇటు కార్మికులు, అటు యంత్రాలు ఖాళీగానే ఉండాల్సి వచ్చింది. సాధ్యమైనంత తొందరగా పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. కనీసం ఒక షిఫ్టును నడిపించేందుకు యంత్రాలు, ఉద్యోగులను సిద్ధం చేస్తున్నారు.
**లక్ష్యంపై ప్రభావం** వారం రోజుల్లో నాలుగు రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడటంతో నెలవారీ ఉత్పత్తి లక్ష్యంపై ప్రభావం పడనుంది. బొగ్గు ఉత్పత్తి తక్కువగా చేపట్టడం వల్ల భవిష్యత్తులో వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం కష్టంగా మారే అవకాశం ఉంది. సింగరేణి సంస్థ రోజుకు 1.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతం గడిచిన వారం రోజుల్లో నాలుగు రోజులు బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. అంటే సుమారు 6 లక్షల వరకు బొగ్గు ఉత్పత్తి నష్టపోయింది. దీంతో రానున్న కాలంలో ఈ ప్రభావం కంపెనీ వార్షిక లక్ష్యంపై పడే అవకాశం ఉంది.

# 'హ్యామ్' రోడ్లపై.. సాఫీగా ప్రయాణం

కొత్తగూడెం : రహదారుల ఉన్నతీకరణకు రంగం సిద్ధమవుతోంది. రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టే హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల టెండర్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని రోడ్లను మొదటి విడతలో 17 ప్యాకేజీలుగా (ఆర్అండ్‌బీ సర్కిళ్లు) గుర్తించగా.. అందులో భద్రాద్రి, ఖమ్మం జిల్లాలను రెండు ప్యాకేజీలుగా మార్చింది. వీటి పరిధిలో 648.29 కి.మీ. మేర హ్యామ్ విధానంలో రహదారులను ఉన్నతీకరించాలని స్పష్టం చేసింది. ఇందులో ట్రాఫిక్ అధికంగా ఉండి.. ప్రధాన పట్టణాల నుంచి జిల్లా కేంద్రాలకు వెళ్లే రోడ్లను చేర్చింది.

**45 రోడ్లు, 648.29 కి.మీ., రూ.849.88కోట్లు**
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ప్యాకేజీల్లో మొత్తం 45రోడ్ల పనులను రూ.849.88కోట్లతో చేపట్టాలని నిర్ణయించింది. ఖమ్మం ప్యాకేజీ పరిధిలో 35రోడ్లు, 382.29కి.మీ. మేర రహదారులను రూ.468.98కోట్లతో.. భద్రాద్రి ప్యాకేజీ పరిధిలోని పది రోడ్లు, 266 కి.మీ. మేర రహదారులను రూ.380.90కోట్లతో ఉన్నతీకరించనుంది. ఉభయ జిల్లాల్లోని కొన్ని రెండు వరుసల రోడ్లను నాలుగు వరుసలుగా, ఇంకొన్ని ఒక వరుస రోడ్లను రెండు వరుసల రహదారులుగా మార్చనుంది. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**వాహనదారులకు తప్పనున్న ఇక్కట్లు**
ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్ని రహదారులు అస్తవ్యస్తంగా మారటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సారపాక-ఏటూరునాగారం, భద్రాచలం-చర్ల, పాల్వంచ-దమ్మపేట, కొత్తగూడెం-తల్లాడ, అనిశెట్టిపల్లి-ఆళ్లపల్లి రహదారులు కొన్నేళ్లుగా మరమ్మతులు, విస్తరణకు నోచుకోవటం లేదు. ఈ రోడ్లపై ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. ఖమ్మం జిల్లాలో ఇల్లెందు-ఖమ్మం, బోనకల్లు-ఖమ్మం, రాయపట్నం-మోటమర్రి రైల్వేస్టేషన్ రోడ్డు, వైరా-జగ్గయ్యపేట, ఖమ్మం-వైరా, నేలకొండపల్లి-పాలేరు, కొత్తకొత్తూరు-వల్లభి, నేలకొండపల్లి-గాంధారి, కల్లూరు-వట్కూరు, మిట్టపల్లి-పెద్దకోరుకొండి, మార్లపాడు-పార్వతీపురం తదితర రోడ్లపై ప్రయాణం వాహనదారులకు సవాలుగానే మారుతోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ రహదారులు మెరుగుపడనున్నాయి.
రహదారుల ఉన్నతీకరణకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్ ప్రక్రియ చేపట్టింది. భద్రాద్రి జిల్లాలో 266కి.మీ. మేర పది రహదారులు బలోపేతం కానున్నాయి. రాష్ట్రస్థాయిలో టెండర్ ప్రక్రియ పూర్తయితే పనులు మొదలవుతాయి. - వెంకటేశ్వరరావు, ఈఈ, ఆర్అండ్‌బీ, కొత్తగూడెం

# అంతర్జాలంలో రేషన్‌కార్డు వివరాలు ఇలా తెలుసుకోండి

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వీటన్నింటికీ తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి కావటంతో అవి లేని ఎంతోమంది నిరుపేదలు గతంలో అనర్హులుగా మిగిలారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త రేషన్ కార్డుల మంజూరుకు శ్రీకారం చుట్టింది. అర్హత ఉండి కార్డు లేనివారు, పాత రేషన్‌కార్డులోని పేర్ల తొలగింపు, మార్పులు చేర్పుల కోసం లబ్ధిదారులు సమీపం లోని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక మాత్రం కార్డు మంజూరైందో? లేదో తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ఒక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిద్వారా ఎఫ్ఎస్‌సీ కార్డు స్థితి ఇట్టే తెలుసుకోవచ్చు. అదే https://epds.telangana.gov.in వెబ్‌సైట్. ఇందులోకి వెళ్లి మొదట ఎఫ్ఎస్‌సీ సెర్చ్ ఎంచుకోవాలి. తర్వాత కనిపించే రేషన్‌కార్డు సెర్చ్ బాక్స్‌పై క్లిక్ చేయాలి. ఎఫ్ఎస్‌సీ అప్లికేషన్ సెర్చ్‌పై క్లిక్ చేయాలి. అనంతరం కనిపించిన తెరపై మీసేవ నంబర్(మీసేవలో దరఖాస్తు చేసిన అప్లికేషన్ నంబరు), జిల్లా పేరు నమోదు చేయగానే మీ రేషన్ కార్డు స్థితి తెలుస్తుంది

చురకలు



# మరీ ఇంత తాత్సారమా..!

చిత్తూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-పంట నమోదుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.. ఈ ఏడాది జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) ద్వారా ఖరీఫ్-2025లో 'ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే' పేరుతో కొత్త యాప్ రూపొందించారు.. ఈ సర్వేతో సాగు భూముల వివరాలు కచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ఈ-పంట నమోదుకు శ్రీకారం చుట్టారు.. ఇదివరకు సాధారణంగా పంటల వివరాలు మాత్రమే ఈ-పంటలో నమోదు జరిగేది.. ఈ ఏడాది సాగులో లేని భూములను సైతం ఈ-పంట కింద నమోదు చేయాల్సిందే.. జిల్లాలో ఈ-పంట నమోదు ముందుకు సాగలేదు.. రైతుసేవా కేంద్రాల ఉద్యోగుల బదిలీలు, రెవెన్యూ సమస్యలు తదితర కారణాలతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు.

**కేవలం 8,030 ఎకరాల్లోనే నమోదు**

జిల్లాలో ఇప్పటివరకు ఖరీఫ్ సీజన్ ఈ-పంట నమోదు కేవలం 8,030 ఎకరాలకే పరిమితమైందంటే ఎంత అలసత్వమో అర్థమవుతోంది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 1.80 లక్షల ఎకరాలు. ఇప్పటి వరకు సాగైన విస్తీర్ణం 42 వేల ఎకరాలు. ఇవీ వ్యవసాయ శాఖ లెక్కలు. క్షేత్రస్థాయిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగైనప్పటికీ అధికారుల లెక్కల్లో తక్కువ విస్తీర్ణంలో సాగైనట్లు చూపుతున్నారని రైతులు



పేర్కొంటున్నారు.

**అడ్డంకిగా.. ఉద్యోగుల బదిలీలు**

రైతు సేవా కేంద్రాల సహాయకులు, మండల వ్యవసాయాధికారుల బదిలీల ప్రక్రియ సమస్య తెచ్చిపెట్టింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం, శాఖల మధ్య సమన్వయ లోపం తదితర కారణాలతో నిర్దేశిత ప్రాంతంలో అధికారులు, సిబ్బంది బాధ్యతలు స్వీకరించకపోవడంతోనే ఈ-పంట నమోదుకు తీవ్ర అడ్డంకిగా మారింది.

**కీలకమైనా..**

సాగు ప్రోత్సాహక పథకాల అమలు, ఎరువులు కేటాయింపు తదితర వ్యవసాయ పథకాలకు ఈ-పంట నమోదు కీలకం. ఈ-పంటలో సాగు వివరాలు నమోదు కాకపోతే సాగు ప్రోత్సాహక పథకాలు రైతులకు వర్తించవు. ఉన్నతాధికారులు స్పందించి ఈ-పంట నమోదు వేగవంతానికి దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**వేగవంతానికి చర్యలు..** జిల్లాలో 'ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వే' వేగవంతానికి చర్యలు చేపట్టాం. మార్గదర్శకాల ప్రకారం పక్కాగా నమోదుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం.

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

# నల్లమల నన్నారి

ఆత్మకూరు : వైవిధ్య జంతు వృక్ష సంపదకు నిలయమైన నల్లమల నన్నారి(సుగంధ పాలు) గడ్డలకు నిలయం. వీటితో తయారు చేసిన షర్బత్‌కు మార్కెట్లో మంచి ఆదరణ ఉంది. నాణ్యమైన అర కిలో లీటరు సీసా రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దీన్ని కొందరు ఉపాధిగా మల్చుకొన్నారు. నల్లమలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా సాగు చేస్తున్నారు. మార్కెట్లో డిమాండ్ ఆసరా చేసుకొని నన్నారి గడ్డను తక్కువకు కొనుగోలు చేసి మోసం చేస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన మంత్రి వన్‌ధన్ వికాస్ యోజన కింద గిరిజన గూడేల్లో జీవనోపాధి కల్పనకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరులో రూ.20 లక్షలతో నెలకొల్పిన కేంద్రాన్ని నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు.

**15 ఎకరాల్లో ప్రత్యేక సాగు**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆత్మకూరు



మండలం బైర్లూట్టి గూడెంలో రూ.10 లక్షలతో రెండు ఎకరాల్లో గతేడాది నన్నారి నర్సరీ ఏర్పాటు చేశారు. 15 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులకు మొక్కలు అందజేశారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం, శివపురం, చదరం పెంట గూడెం, పగిడ్యాల మండలం, మార్కాపురం డివిజన్ ఎర్రగొండ పాలెం చెంచు రైతులకు అందజేశారు.

**మూడేళ్ల నుంచి ఆదాయం**

నన్నారి మొక్క మూడేళ్ల నుంచి ఆదాయం ఇస్తుంది. తల్లి వేరు అలాగే ఉంచి పిల్లవేర్లను వాడుకుంటే 12 ఏళ్లపాటు ఆదాయం వస్తుంది. ఒక మొక్క నుంచి ఏడాదికి 1-3 కిలోల పిల్లవేర్లు సేకరించొచ్చు. అరకిలో నుంచి కిలో వరకు ఎండిన వేర్లు సేకరిస్తారు. కిలో నన్నారి గడ్డల ధర మార్కెట్‌లో రూ.500 నుంచి రూ.600 వరకు ఉంది. ఒక ఎకరంలో 10వేల నుంచి 12వేల వరకు మొక్కలు నాటుతారు. సుమారు 10వేల వరకు ఆదాయాన్ని ఇస్తాయి.

కొట్టాల చెరువు గూడెంలో కోవెల్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా 15మంది మహిళా రైతులు వేయి చొప్పున నన్నారి మొక్కలు పెంచుతున్నారు. రెండేళ్లుగా ఒక్కొక్కరు ఏటా 500 కిలోలకు పైగా గడ్డలు విక్రయించి రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందారు.

# రండి.. 'బారు'లు తీరండి

ఏలూరు : బార్ లైసెన్సులకు ఎక్కువ మంది పోటీ పడేలా ప్రొహిబిషన్, ఎక్సైజ్ యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. మూడేళ్ల కాలానికి వాటికి లైసెన్సుల జారీకి ఈనెల 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు రుసుములను ప్రభుత్వం అనూహ్యంగా తగ్గించి సాధ్యమైనంత వరకు ఎక్కువ మంది పోటీ పడటానికి అవకాశం కల్పించింది. ఈపై ఈసారి లాటరీ విధానంలో ఎంపిక చేస్తారు. అంతేకాదు నిర్దేశిత లైసెన్సు ఫీజును ఆరు సులభ వాయిదాల్లో చెల్లింపులు చేసుకునే అవకాశం కల్పించింది.అందరికీ అవకాశం.. ఇవన్నీ వ్యాపారులకు వివరించి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా ఉప కమిషనర్ బి.శ్రీలత పర్యవేక్షణలో జిల్లా పర్యవేక్షకుడు ఆవులయ్య చర్యలకు శ్రీకారం చుట్టారు. గతంలో మద్యం దుకాణాలకు పోటీ పడి అప్పట్లో దుకాణాలు దక్కనివారి జాబితాను బయటకు తీసి బుధవారం నుంచే వారికి ఫోన్లు చేసి ప్రభుత్వ నిర్ణయాలను తెలియజేసి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించారు. ఇదే తరహాలో పశ్చిమగోదావరిలోనూ సహాయ కమిషనర్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రూ.10 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుమును తాజాగా ప్రభుత్వం రూ.5 లక్షలకు తగ్గించింది.

# నిర్వహణ అస్తవ్యస్తం.. 'నీరు'గారిన లక్ష్యం



ధర్మవరం : శ్రీసత్యసాయి జిల్లాలోని పలు సర్కారు పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అటకెక్కాయి. నిర్వహణ లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఫలితంగా విద్యార్థులు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. చాలా పాఠశాలల్లో పిల్లలు ఇంటి వద్ద నుంచి సీసాల్లో మంచి నీరు తెచ్చుకుంటున్నారు. కొందరు ఉపాధ్యాయులు తమ సొంత ఖర్చులతో శుద్ధజల క్యాన్లు కొనుగోలు చేసి విద్యార్థుల దాహార్తి తీరుస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పాఠశాలల స్థాయిని బట్టి రూ.65 వేల నుంచి రూ.1.85 లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. పనులు దక్కించుకున్న ఏజెన్సీ ప్రతినిధులు మూడు, నాలుగేళ్లపాటు వీటి నిర్వహణ బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. అయితే ప్లాంట్లు ఏర్పాటు చేసిన ఆరు నెలలకే పలుచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేసి ఉంటే సమస్య ఉండేది కాదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టే సమయంలో ఏజెన్సీ నిర్వాహకులు ప్రతి కేంద్రానికి టోల్‌ఫ్రీ నంబర్ ఇచ్చారు. హెచ్ఎంలు, విద్యాశాఖాధికారులు ఆ నెంబరుకు ఫోన్లు చేస్తుంటే అందుబాటులోకి రాలేదు. దీంతో చాలాచోట్ల యంత్రాలు మూలకుచేరాయి.

**ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్నాం**

– దేవరాజ్, ఎస్ఎస్ఏ జిల్లా అధికారి

ఆర్వో ప్లాంట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు ఏజెన్సీ నిర్వాహకులు అందుబాటులోకి రావడం లేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని బాగుచేయించి, విద్యార్థులకు శుద్ధజలం అందేలా చర్యలు చేపడతాం.

ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలలో 450 మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాల నాడు-నేడు పథకానికి ఎంపికై నిధులు మంజూరైనా తరగతి గదుల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇక ఆర్వో ప్లాంటు నేటికి ప్రారంభానికి నోచుకోక మూలన పడింది.

ధర్మవరం పట్టణంలోని నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల్లో 430 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఆర్వో ప్లాంటు సక్రమంగా పనిచేయకపోవడంతో అధ్యాపకులు సొంత ఖర్చుతో బాగు చేయించారు. అయినా పని చేయడం లేదు. ధర్మవరంలోని కోట ప్రాథమిక పాఠశాలలో ఆర్వో ప్లాంటు పని చేయకపోవడంతో మూలనపడేశారు. హెచ్ఎం తన సొంత డబ్బుతో క్యాన్లు కొనుగోలు చేసి పిల్లల దాహార్తి తీరుస్తున్నారు. ఇక్కడ 45 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు.కదిరి మండలంలోని బాలప్పగారిపల్లి ఆదర్శ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ గత ఏడాది నుంచి పని చేయడం లేదు. ఇక్కడ 84 మంది విద్యార్థులున్నారు. అందరూ ఇళ్ల నుంచి సీసాలతో మంచినీరు తెచ్చుకుంటున్నారు. జిల్లా : శ్రీసత్యసాయి ప్రభుత్వ పాఠశాల సంఖ్య: 2,061

ఆర్వో ప్లాంట్లు నిర్మించినవి : 1,365

మరమ్మతులకు గురైన ప్లాంట్లు: 679

# 'కోడై'కూస్తున్నా.. పట్టుకోలేరా?!



విశాఖపట్నం: ఏజెన్సీ ప్రాంతాలు, ఒడిశా నుంచి వచ్చే గంజాయి రవాణాకు ఎంతగా అడ్డుకట్ట వేస్తున్నా...నగరంలో అమ్మకాలు మాత్రం చాపకింద నీరులా సాగిపోతున్నాయి. ఇందుకు కొన్ని పాన్‌షాపులు, బడ్డీ కొట్లు కేంద్రంగా మారాయి. ప్రత్యేక కోడ్ పెట్టి ...అది చెప్పిన వారికే గంజాయి విక్రయిస్తున్నారు. నగరంలో కొన్ని పాన్‌షాపుల్లో 24 గంటలూ అమ్ముతున్నారు. ఆరిలోవ వద్ద కొన్ని కాలనీల కూడళ్లలోనే అమ్మేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు అడ్డుకోలేకపోవడం గమనార్హం.నగరంలో ఇటీవల ఓ కారు బాలుడిని ఢీకొట్టింది. ఆ కారును పోలీసులు సీజ్ చేశారు. అందులో పరిశీలించగా 21 కిలోలు గంజాయి బయటపడింది. ఆకస్మిక తనిఖీలతో గంజాయి కట్టడికి ప్రత్యేకంగా ఎనిమిది బీట్స్ ఏర్పాటు చేశారు. నగరంలో పెద్ద సంఖ్యలో పాన్‌షాప్‌లున్నా..గడిచిన ఏడు నెలల వ్యవధిలో పోలీసులు 82 పాన్‌షాపులనే తనిఖీ చేశారు.ఓల్డ్ కరసా బస్‌బే వెనుక వైపు పెట్రోలు బంకు ఉంది. కొందరు యువత గంజాయి మత్తులో సిగరెట్లు తాగుతూ కాల్చి పెట్రోలు బంకులోకి విసిరేయడంతో ఇటీవల అన్‌లోడ్ చేస్తున్న ట్యాంకర్‌పై పడిందని సదరు యజమాని జీవీఎంసీలో ఈనెల 18న ఫిర్యాదు చేశారు. ఈ బంకు సమీపంలోనూ ఓ దుకాణంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం. పాత నేరస్థులు, రౌడీషీటర్లు గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో రౌడీషీటర్లు, పాత నేరస్థుల ఇళ్లల్లో పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఓ చోట రెండు కిలోల గంజాయి దొరికింది.

ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన గంజాయి కేసులు : 147

అరెస్టు చేసిన నిందితులు: 292

స్వాధీనం చేసుకున్నది: 1,684 కేజీలుబీ 21 కేజీల హ్యాష్ ఆయిల్.

# వసూల్‌రాజాల్లా రక్షక భటులు



అనకాపల్లి : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని పట్టుకుని చట్టం ముందు నిలబెట్టాల్సిన పోలీసులే దారి తప్పుతున్నారు. సంపాదన కోసం తమ పరిధులను అతిక్రమిస్తున్నారు. సివిల్ వ్యవహారాల్లో తలదూర్చి.. కేసుల పేరుతో భయపెడుతున్నారు. రియల్ దందాలు, జూద శిబిరాలు, భూ తగాదాలను సైతం ఆదాయ వనరుగా చేసుకుని కొంతమంది రెచ్చిపోతున్నారు. అన్యాయం జరిగిందని స్టేషన్‌కు వస్తే చాలు.. సెటిల్‌మెంట్ చేయడం, అవతలి వ్యక్తులను బెదిరించి, భయపెట్టి అందినకాడికి దండుకుంటున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యక్రమాలు, ఇతర వ్యవహారాలు, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు నివేదికలు చేరవేసేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. కానీ..జిల్లాలో ఆ నిఘా వ్యవస్థను అమలు చేయడం లేదు. బాధితులే నేరుగా జిల్లా కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, అడిగేవారు కనిపించకపోవడంతో పోలీసుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యంగా కొంతమంది పోలీసుల వ్యవహార శైలి శ్రుతిమించుతోంది. జూద శిబిరాలు, దాబాల నిర్వాహకులు, క్వారీ లారీల నుంచి నెలవారీ వసూళు తీసుకుని వారిని ప్రోత్సహిస్తున్నారు. పండగల సమయాల్లో పిక్కాట, నిషేధిత ఆటకు ఒక్కో రేటు పెట్టి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. అనకాపల్లి పట్టణ పరిధిలో అయితే.. తుక్కు దుకాణం నుంచి బెల్ట్ దుకాణాలు, గుట్కా షాపుల నుంచి కానిస్టేబుళ్లను పెట్టి మరీ వసూళ్లు చేయిస్తున్నారు. అవినీతి కార్యకలాపాలకు పోలీస్ స్టేషన్లనే అడ్డాగా మార్చేస్తున్నారు.

**అడిగేవారు లేకనే ఆగడాలు..**

ఇటీవల కాలంలో ఓ బంగారం వ్యాపారి న్యాయం చేయాలంటూ అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్తే.. న్యాయం చేయకపోగా ఆ వ్యాపారి నుంచే రూ. 50 వేల లంచం తీసుకుంటూ ఎస్సై ఈశ్వరరావు అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికారు. ఈ వ్యవహారంలో ఈయన పైఅధికారి ప్రమేయం కూడా ఉందన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం జూదశిబిరంపై దాడి చేయగా భారీగా సొమ్ము దొరికినా.. కేవలం రూ. 20 వేలే దొరికినట్లు చూపించి, మిగిలిన సొమ్ము జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా క్వారీలు, క్రషర్లు ఉన్నాయి. వీటి నుంచి రోజూ వంద సంఖ్యలో లారీలు పోలీస్ స్టేషన్‌కు ముందుగానే వెళ్లాలి. ఇందుకోసం ట్రాన్స్‌పోర్టు, క్రషర్, క్వారీ యజమానులు ప్రతి నెలా భారీగా ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. కె.కోటపాడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట మరిడమ్మతల్లి ఆలయం దగ్గరే సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయి. ఇటీవల చౌడువాడలో అశ్లీల నృత్యాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా పట్టీపట్టనట్లు వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. వాటిల్లో చిన్నచిన్న లీకేజీలు వచ్చినా.. ప్రమాదాలు, వివాదాలు జరిగినా సంబంధిత పోలీసులకు పెద్దమొత్తంలో సొమ్ము చెల్లించాలి. లేదంటే కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్ల క్రితం అచ్యుతాపురం మండలం వెంకటాపురంలోని ఓ బెట్టింగ్ ముఠా దగ్గర భారీగా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అనకాపల్లి, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసుల్లో న్యాయం చేయాలంటూ వచ్చిన వారి నుంచి దండిగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# పది మీటర్ల దూరం.. పది కిలోమీటర్ల ప్రయాణం

బుచ్చెయ్యపేట : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భీమిలి-నర్సీపట్నం రహదారిపై విజయరామరాజుపేట దగ్గర తాచేరుపై కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. సిమెంటు తూములు, రాళ్లు, మట్టిరోడ్డు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. 2023 డిసెంబరు నెలలో తాచేరుపై వంతెన కూలిపోవడంతో తాత్కాలికంగా ఈ కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. రెండేళ్లు గడిచిపోతున్నా కొత్త వంతెన నిర్మాణం జరగలేదు. ఫలితంగా తాత్కాలిక కాజ్‌వేపైనే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు కొంతమేర దెబ్బతింది. వెంటనే మరమ్మతులు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈసారి పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో మరమ్మతులు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తాచేరుకు అవతల వైపున విజయరామరాజుపేట, ఇవతల వైపున వడ్డాది గ్రామాలు ఉన్నాయి. విజయరామరాజుపేట గ్రామస్థులు వ్యవసాయ, వ్యాపారాలు, ఇతర పనులపై నిత్యం వడ్డాది వచ్చి వెళతారు. పక్కపక్కనే ఉన్నా కాజ్‌వే కొట్టుకుపోయిన దగ్గర నుంచి ఈ రెండు గ్రామాల మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్లయింది. మధ్యలో ఉన్న తాచేరు దాటి పదిమీటర్లు వెళితే వడ్డాది గ్రామానికి చేరుకున్నట్లే. అలాంటిది విజయరామరాజుపేట గ్రామస్థులు ఇపుడు వడ్డాది గ్రామానికి రావడానికి నానా అవస్థలు పడుతున్నారు. కుముందానుపేట, మంగళాపురం, కె.జె.పురం, వంటర్లపాలెం గ్రామాల మీదగా పది కిలోమీటర్లు తిరిగి వస్తున్నారు.వడ్డాది దగ్గర కాజ్‌వే అప్రోచ్ రోడ్డు సైతం స్వల్పంగా దెబ్బతింది. శిథిలవంతెనపై నుంచి ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వీరికి కష్టాలు తప్పడం లేదు. కొత్తవంతెనల నిర్మాణం గురించి పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మృత్యుగుంతలు

నంద్యాల: చెరువులు, కుంటలు, నదులు, బంజరు భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్విన గుంతలు మృత్యుకుపాలుగా మారుతున్నాయి. ఈతకు వెళ్లిన చిన్నారులు, దుస్తులు ఉతకడానికి, చేపల వేటకు వెళ్లిన పెద్దవారినీ బలి తీసుకుంటున్నాయి. వైకాపా ప్రభుత్వంలో చెలరేగిపోయిన మట్టి మాఫీయా విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు చేసింది. వీటితో ఏర్పడిన గుంతల వద్ద కనీస చర్యలు తీసుకోకపోవ దంతో ప్రమాదకరంగా మారాయి.

కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాలతోపాటు నంద్యాల జిల్లాలోని కుందూ పరీవాహకం వెంట నంద్యాల, బండిఆత్మకూరు, కోవెలకుంట్ల, పాణ్యం మండలాలతోపాటు నల్లమల్ల అటవీ ప్రాంతంలోని మహానంది, శిరువెళ్ల, రుద్రవరం, చాగలమర్రి మండలాల్లోని వివిధ చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. కృష్ణా పరీవాహకంలోని నందికొట్కూరు ప్రాంతంలో కూడా జరుగుతున్నాయి. వైకాపా ప్రభుత్వంలో నందికొట్కూరు, కొత్తపల్లి ప్రాంతాల్లో కృష్ణా నది ఒడ్డున పెద్దఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు జరిగాయి. మహానంది మండలం అంకిరెడ్డిపల్లె చెరువు, నంద్యాల సమీపంలోని కుందూ నది ఒడ్డున అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇటుక బట్టీలు, పొలాలకు మట్టి కోసం తవ్వకాలు జరిగాయి.

చెరువులు, కుంటలు, నదులను నీటిపారుదల శాఖ పర్యవేక్షిస్తుంది. మట్టి తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ శాఖ నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. మైనింగ్ శాఖకు రుసుం చెల్లిస్తే అనుమతి ఇస్తారు. ఈ మూడు శాఖల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. అనుమతులు లేకుండానే కొందరు నాయకుల అనుచరులు అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. గుంతల వద్ద హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు.




**స్పిల్‌వేకు మించి తవ్వకాలు**

సాధారణంగా చెరువులు, నదులు, కుంటల్లో ఎంఎఫ్ఎల్(మాగ్జిమం ఫ్లడ్ లెవల్) నుంచి కిందకు 2 మీటర్ల లోతు(స్పిల్ లేవల్) వరకు మాత్రమే అనుమతులు ఇస్తారు. ఇంతకు మించి తవ్వకాలు చేస్తే.. చెరువులు, కుంటలకు నీళ్లు వచ్చినా స్పిల్ లేవల్‌కు అందవు. దీంతో ఆయకట్టు ప్రశ్నార్థకమవుతుంది. నల్లమల అటవీ ప్రాంతమైన నంద్యాల ప్రాంతాల్లోనైతే అడుగు నుంచి అడుగున్నర అడుగుల వరకు మాత్రమే అనుమతులు ఇస్తారు. బనగానపల్లి, డోన్ వంటి కొండ ప్రాంతాల్లో 4 అడుగుల లోతు వరకు తవ్వుకోవచ్చు. చాలాచోట్ల వేసవిలో పొలాలకు మట్టి పేరుతో చెరువులు, కుంటల్లో తీసుకున్న అనుమతుల కంటే ఎక్కువ లోతులో తవ్వకాలు చేస్తున్నారు. మరికొందరు అనుమతులు తీసుకోకుండానే ఇష్టారాజ్యంగా తవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వీటి కారణంగా నీళ్లు స్పిల్‌వేకు అందకుండా పోతున్నాయి. ఈ గుంతలో నీళ్లు నిలిచి ఉండడంతో చిన్నారులు, చేపల కోసం వెళ్లిన పెద్దలు మునిగిపోతున్నారు.

# ఆక్రమణల ముప్పుటేరు

భీమవరం : మూడు జిల్లాల పరిధిలో ప్రవహించే ఉప్పుటేరుపై గత వైకాపా ప్రభుత్వం శీతకన్ను వేయడంతో కబ్జాలు పెరిగి వేల ఎకరాలు మునిగేవి. రైతులు గగ్గోలు పెట్టినా కనీసం తూడు తొలగించిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా డెల్టా ఎగువ, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి బుడమేరుకు నీరు పోటెత్తడంతో ఆ ప్రభావం కొల్లేరుపై పడి అక్కడి నుంచి ఉప్పుటేరును తాకింది. ఆకివీడు, కాళ్ల, భీమవరం మండలాల నుంచి దిగువ ప్రాంతాల వరకు తూడు, ఆక్రమణలు పెరిగిపోవడంతో ఎక్కడికక్కడ ప్రవాహానికి అవరోధం ఏర్పడుతుంది. ప్రస్తుతం ప్రవాహ వేగం తక్కువగా ఉన్నా ఏ సమయంలో ఏం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరు జిల్లాల ఉన్నతాధికారులు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆయా ప్రాంతాలను పరిశీలించి, ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలిచ్చారు.

1400 ఎకరాలకు పైగా.. ఏరుకు ఓ వైపున ఏలూరు, కృష్ణా జిల్లాలు, రెండో వైపున పశ్చిమ గోదావరి జిల్లా ఉన్నాయి. అటు ఇటు మొత్తం 1400 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీని వల్ల వరదల సమయంలో ఎగువన నీరు కిందకు లాగక పొలాలు, ఆక్వా చెరువులు నీట



మునుగుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల వాటిని పరిశీలించిన ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ఉప్పుటేరు ప్రక్షాళన పనులను ప్రతిపాదించారు. అందులో భాగంగా ఎగువన కొల్లేరు నుంచి వచ్చే వరద నీటికి ఎటువంటి అవరోధం లేకుండా కైకలూరు నుంచి ఆక్రమణలను తొలగించే పనులను మురుగునీటి పారుదల, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో చేపట్టారు.

12 వేల క్యూసెక్కులకు తగ్గి.. ఉప్పుటేరు కాలగర్భంలో చెరువులు తవ్వేయడం, రైల్వే ట్రాకు కింద డ్రెడ్జింగ్ చేయకపోవడం, కిక్కిస మేట వేయడం, తూడు, గుర్రపుడెక్క వంటి అవరోధాలతో మురుగునీటి ప్రవాహం సక్రమంగా లేదు. గతంలో మూడు మీటర్లకు పైగా ఉప్పుటేరు లోతు ఉంటే ప్రస్తుతం కొన్నిచోట్ల మీటరు మాత్రమే ఉంది. గతంలో 25 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం కాగా ప్రస్తుతం 12 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం ఉప్పుటేరు బ్రిడ్జి ఎగువన రైల్వే ట్రాకు మధ్యలో ఉన్న ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. నాలుగు పొక్లెయిన్లు, ఒక పంటు సహాయంతో కలిదిండి, కైకలూరు, ఆకివీడు మండలాల్లో పనులు జరుగుతున్నాయి. రైల్వే ట్రాకు వద్ద కనీసం మిషన్ వెళ్లలేని పరిస్థితిలో మూడు రోజులుగా జరుగుతున్న పనులతో 40కి పైగా అక్రమంగా తవ్విన చెరువులను తొలగించారు.

# అమర్చితేనే నియంత్రికలు

చిత్తూరు : నూతన వ్యవసాయ సర్వీసుల కోసం డ్రా చేసి తీసుకెళ్లిన నియంత్రికలను సత్వరమే అమర్చాలి. ఇకపై తీసుకెళ్లిన వాటిని అమర్చిన తర్వాతే మళ్లీ నియంత్రికలు అందజేయనున్నారు. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నియంత్రికలు అమర్చడంలో జాప్యం, తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆదేశాల్లో పేర్కొన్నారు.

వైకాపా పాలనలో వ్యవసాయ సర్వీసుల జారీ పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో వేల సంఖ్యలో వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో పడ్డాయి. కూటమి ప్రభుత్వం వ్యవసాయ సర్వీసుల జారీపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో సుమారు 3,250 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉండగా నాలుగు నెలల కాలంలోనే 1000-1200 సర్వీసులు జారీ చేసి నియంత్రికలు, అనుబంధ పరికరాలు సరఫరా చేశారు. ప్రస్తుతం 2,240 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉండగా వీటిని ప్రాధాన్య క్రమంలో జారీ చేస్తున్నారు.



**పొలాల్లోనే దిష్టిబొమ్మల్లా..**

నియంత్రికలు అమర్చడంలో కొందరు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారు. జిల్లా గోదాము నుంచి డ్రా చేసి తీసుకెళ్లిన నియంత్రికలు సుమారు 500 పొలాల్లోనే దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇలా జిల్లాలోని చౌడేపల్లె, పెద్దపంజాణి, కార్వేటినగరం, గంగవరం, వెదురుకుప్పం, బైరెడ్డిపల్లె మండలాల్లో నియంత్రికలు అమర్చక.. రైతులను ముప్పుతిప్పలకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైరవీలు, మామూళ్లకు ఆశపడి కొందరు అధికారులు, సిబ్బంది ఒక రైతుకు అమర్చాల్సిన నియంత్రికలు, అనుబంధ పరికరాలను మరో రైతుకు ఏర్పాటు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి.. సత్వరమే నియంత్రికలను అమర్చడంతో పాటు వ్యవసాయ సర్వీసుల జారీని మరింత వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

# నూతన పాలకవర్గంపైనే ఆశలు..!

పుంగనూరు : టమాటా మార్కెట్, పశువులు, గొర్రెల సంతతో పేరొందిన పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఈ నెల 22న ప్రమాణ స్వీకారం చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పాలకవర్గం. మార్కెట్ యార్డులో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. బాధ్యతలు చేపట్టనున్న కమిటీ ప్రస్తుతం నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పుంగనూరు మార్కెట్ యార్డుకు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇతర జిల్లా, రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తుంటారు. అయితే మార్కెట్



యార్డులో సమస్యలు నెలకొనడంతో రైతులు.. వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చింతపండు వ్యాపారులకు షెడ్లు నిర్మించాల్సి ఉంది. టమాటా వ్యాపారులకు ప్రస్తుతం 40 షెడ్లు ఉన్నా అదనంగా మరో 30 అవసరం. రాగానిపల్లె రోడ్డులో వాణిజ్య సముదాయాల నిర్మాణం సైతం కార్యరూపం దాల్చడం లేదు.

**నాడు ప్రతిపాదించినా..**

యార్డు ఆవరణలో సీసీ రోడ్లు, కాలువలు, షెడ్ల నిర్మాణానికి వైకాపా ప్రభుత్వంలో రూ.9.3 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయితే అవి కేవలం దస్త్రాలకే పరిమితం కావడంతో సమస్యలు అలాగే ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి భవనాలు, ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జి, శీతల గిడ్డంగి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

**కమిటీ ఇదే..**

గౌరవ ఛైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఛైర్మన్‌గా ఎన్.సమీపతి, వైస్ ఛైర్మన్‌గా పి.వెంకటరమణ, సభ్యులుగా ఎ.శాంతమ్మ, సి.చంద్రమ్మ, ఎన్.జయశ్రీ, బి.సుధాకర్‌రెడ్డి, ఎ.అమరనాథ్ నాయుడు, మసెనన్న, టి.చంద్రమ్మ, అరుణ, సంధ్య, మంజునాథలను నియమించారు. వీరితో పాటు స్థానిక పురపాలక ఛైర్మన్, సింగిల్ విండో ఛైర్మన్, వ్యవసాయశాఖ ఏడీ, జిల్లా మార్కెటింగ్ అధికారులు సభ్యులుగా ఉంటారు.

# ఉల్లి పొలంలోనే కుళ్లి

ఎమ్మిగనూరు : రెండేళ్లుగా ధర లేక కుదేలైన ఉల్లి రైతులను ఈ ఏడాది అధిక వర్షాలు నిండా ముంచాయి. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, ఆస్పరి, కోసిగి, పెద్దకడబూరు తదితర మండలాల్లో 12 వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేసినట్లు అంచనా. ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టారు. అధిక దిగుబడులతోపాటు ధర లభిస్తుందన్న ఆశతో ముందుగా బోర్ల కింద ఉల్లి సాగు చేశారు. 12 వేల ఎకరాలకు రూ.130 కోట్లు పెట్టుబడి పెట్టారు. పంట ప్రస్తుతం చేతికొచ్చింది. నాణ్యమైన గడ్డ మార్కెట్లో క్వింటా గరిష్ఠ ధర రూ.1,200 వరకు అమ్ముడుపోతోంది. గిట్టుబాటు లేకపోవడంతో రైతులు విక్రయించకుండా పొలాల్లోనే ఉంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డ మొత్తం తడిసి కుళ్లిపోతోంది.“ మూడెకరాలు ఉంది.. ఎకరంలో ఉల్లి వేశా. పెట్టుబడి రూ.1.50 లక్షలు అయింది. చేతికొచ్చిన పంట వర్షానికి తడిసి పోవడంతో క్వింటా రూ.500కు కూడా అడగడం లేదు. పంట అమ్మితే కూలీల ఖర్చు సరిపోతుంది. పెట్టుబడి నష్టపోయానని” కడిమెట్లకు చెందిన వీరకేశ ఆవేదన వ్యక్తం చేశారు.“ ఎకరంలో ఉల్లి వేశా. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. పంట కోసే సమయంలో విడవకుండా వర్షం కురిసి గడ్డలు కుళ్లిపోయాయి. హైదరాబాద్, తాడేపల్లిగూడెం వంటి మార్కెట్లకు అమ్మేందుకు తీసుకెళ్తే రవాణా ఖర్చులు రాని పరిస్థితి. స్థానిక వ్యాపారులకు విక్రయించాలంటే క్వింటా రూ.600లకు అడుగుతున్నారు. వర్షం తీరని నష్టం మిగిల్చిందని” వీరేశ్ వాపోయారు.

# నిధులున్నా.. నిరుపయోగం



గూడూరు : పదేళ్లుగా జిల్లాలోని 12 మార్కెట్ కమిటీల్లో రూ.47.15 కోట్లు నిధులు నిరుపయోగంగా ఉన్నాయి. నిధుల వ్యయంపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాకపోవడంతో అవి ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. జిల్లాలో గూడూరు, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాగలాపురం, బీఎన్‌కండ్రిగ, పాకాల, చంద్రగిరి, తిరుచానూరు, పుత్తూరు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. సెస్సు వసూళ్ల నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. గతంలో ఈ నిధులతో పొలాల్లో లింకు రోడ్ల నిర్మాణాలు చేపట్టేవారు. 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఏఎంసీల్లో లింకు రోడ్ల పేరుతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని గుర్తించి.. ఆ నిర్మాణాలు నిలిపివేసింది. అప్పటి నుంచి ఏఎంసీల ఖాతాల్లోనే సెస్సు మొత్తాలు ఉండిపోయాయి. వీటిలో 45 శాతం మేర ప్రభుత్వ ఖాతాకు జమ చేసి, మిగిలిన నిధుల్లో ఉద్యోగుల జీతాలు, కార్యాలయ నిర్వహణ ఖర్చులు మినహాయించి మిగిలిన నిధులను అలాగే ఉంచేశారు. ఫలితంగా గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి.

విషయమై మార్కెట్ కమిటీ జిల్లా ఏడీ సురేంద్రబాబును వివరణ కోరగా పదేళ్లుగా నిధులు ఖాతాల్లోనే ఉన్నాయని, ఖర్చు చేసేందుకు తమకు ఎలాంటి అధికారం లేదని.. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలన్నారు.

**ఏటా రూ.20 కోట్ల సెస్సు వస్తున్నా..**

జిల్లాలోని కమిటీల ద్వారా ఏటా రూ.20 కోట్లు సెస్సు వసూలు చేస్తున్నారు. రాబడి అధికంగా ఉన్నా అభివృద్ధి పనులకు నిధుల వినియోగంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. ఒక్క వాకాడు కమిటీలోనే రూ.11 కోట్లు నిల్వ ఉండటం గమనార్హం.

# ఆశల మాయలో.. అప్పుల ఊబిలో



అనంతపురం : ‘అనంతపురం గ్రామీణంలోని ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. కారణాలను ఆరా తీయగా.. ప్రైవేటు వాహనాల డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న ఇతడు తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనుకుని మట్కా వైపు వెళ్లాడు. తాను సంపాదించినంతా అందులో పెట్టి ఆడాడు. ఏ రోజూ డబ్బులు గెలుపొందలేదు. ప్రైవేటు అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడి అధికమైంది. తీర్చే మార్గం కానరాక ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.’ ఈ ఘటన మచ్చుకు మాత్రమే. ఈ తరహా ఘటనలు జిల్లా వ్యాప్తంగా రోజు ఎక్కడో ఒకచోట మధ్య, పేద తరగతి ఇళ్లల్లో నిత్యకృత్యంగా మారాయి.

జిల్లాలో మట్కా చాపకింద నీరులా విస్తరిస్తోంది. రూ.కోట్లలో లావాదేవీలు సాగుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ.. పేద మధ్యతరగతి వారిని ఆకర్షిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఈ ఊబిలో పడి పేద, మధ్య తరగతి ప్రజలు ఆస్తులను సైతం పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారు.

**300 వందల బీటర్లు... 20కి పైగా కంపెనీలు**

గుత్తి పురపాలికలో 24 వార్డులుండగా ప్రతి వార్డులోనూ బీటర్లు ఉన్నారు. పట్టణంలో 3 వందలకు పైగా బీటర్లు ఉన్నట్లు అంచనా. ఇరవైకి పైగా కంపెనీల నిర్వాహకులు ఉన్నట్లు సమాచారం. అనంతపురంలో వన్‌టౌన్ పరిధిలో పాతూరు, పరిసర కాలనీల్లో మట్కా మహమ్మారి అధికంగా ఉంది. ఆయా కాలనీల్లో బీటర్లు దినసరి కూలీలను లక్ష్యంగా చేసుకుని వారికి రెట్టింపు డబ్బు వస్తుందని ఎర వేసి మట్కా ముగ్గులోకి లాగుతున్నారు. మద్యం, జూదానికి అలవాటు పడినవారు మట్కాతో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

అనంతపురంలోని అంబేడ్కర్ నగర్, అనంతసాగర్ కాలనీ, విద్యుత్‌నగర్, గుత్తిలోని ఎస్సీ కాలనీలోనూ, తాడిపత్రిరోడ్డులోని ఓ థియేటర్ వద్ద జంగాల కాలనీ, గాంధీనగర్ ,చెర్లోపల్లి, గుత్తి ఆర్ఎస్, బీసీ కాలనీ, కోట, తోళ్లషాపు, బండగేరి తదితర ప్రాంతాల్లో జోరుగా మట్కా సాగుతోంది. మట్కా పేదలు నివాసం ఉంటున్న కాలనీల్లోనే ఎక్కువగా జరుగుతోంది.

**పోలీసు, రాజకీయ అండతో యథేచ్ఛగా..**

అనంతపురం, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం పట్టణాల్లో పెద్ద ఎత్తున చేపడుతున్న మట్కా నిర్వాహకులకు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైనప్పుడల్లా డబ్బులు ఖర్చు చేస్తుండటంతో నాయకులు బీటర్లపై ఎలాంటి దాడులు జరగనివ్వరు. గుత్తిలో నాయకులు, పోలీసుల అండదండలతో మట్కా జూదం 3 పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారనే సమాచారం. మట్కా అంటే గుత్తి గుర్తుకు వస్తుంది. ఇక్కడ యాభై ఏళ్లకు పైబడి మట్కా కొనసాగుతోంది. ఒకప్పుడు బికారులుగా ఉన్నవారు మట్కాను నిర్వహిస్తూ రూ.కోట్లు కూడగట్టుకున్నారు. విలాసవంత జీవితాలను గడుపుతున్నారు. నిర్వాహకులకు కొందరు పోలీసులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# రక్షణ లేని మలుపులు.. గాల్లో ప్రాణాలు!



ముదిగుబ్బ: ఘాట్‌రోడ్డులో వాహనాల డ్రైవింగ్‌పై కనీస అవగాహన లేకపోవడం, అతివేగం కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. ముదిగుబ్బ మండలంలోని దొరిగల్లు - కడప జిల్లాలోని లింగాల మండలం సరిహద్దులోని ఘాట్ రోడ్డు 10 కిలోమీటర్లు ఉంది. మొత్తం 38 మలుపులు ఉన్నాయి. అందులో ప్రమాదకర మలుపులు ఐదు ఉన్నాయి. పులివెందుల నుంచి సిమెంటు లోడు లారీలు ముదిగుబ్బ మీదుగా బెంగళూరుకు వెళ్తుంటాయి. అరటి లోడుతో బొలెరో, ఐషర్ వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. కూలీలు వాహనాల టాపుపైన కూర్చొని ప్రయాణం చేస్తుంటారు. కొన్ని మలుపుల్లో రక్షణ దిమ్మెలు లేకపోవడం, ఉన్నవి దెబ్బతినడంతో, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. వేగాన్ని అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

**నిర్వహణ అధ్వానం**

ఘాట్‌రోడ్డులో ప్రమాదకర మలుపులు, రక్షణ గోడల స్థితిగతులపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. రక్షణ చర్యలు అంతంత మాత్రంగానే ఉండటంతో అనేకచోట్ల గోడలు ఛిద్రమయ్యాయి. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ కొన్నిచోట్ల పూర్తిగా తొలగిపోయాయి. ఇటువంటి చోట్ల వాహనాలు అదుపుతప్పితే ప్రాణాలు గాల్లో కలిసినట్టే. దాదాపు ఏడేళ్ల నుంచి ఘాట్‌రోడ్డులో ఎటువంటి నిర్వహణ, అభివృద్ధి పనులు చేయలేదు. రెండేళ్ల కిందట ఒంగోలు నుంచి హుబ్బళ్లికి వెళ్తున్న గ్రానైట్ లోడు లారీ రాత్రివేళల్లో అతివేగంగా వచ్చి మలుపులో అదుపు చేయలేక 30 అడుగుల లోతులో ఉన్న లోయలోకి దూసుకుపోయింది. ఈ ఏడాది జనవరిలో గ్యాస్ లోడుతో పులివెందుల నుంచి వస్తున్న లారీ వేగాన్ని అదుపు చేయలేక రాయిని ఢీకొట్టింది. పులివెందుల నుంచి ముదిగుబ్బకు క్రేన్ తీసుకొస్తుండగా ఘాట్ దిగే క్రమంలో తిరగబడటంతో డ్రైవర్ మృతిచెందాడు. ఇలా అనేక ఘటనలు జరిగాయి.

**రక్షణ చర్యలు చేపడతాం**

- శివరాముడు, ముదిగుబ్బ టౌన్ సీఐ

అతివేగం, అవగాహన లోపంతోనే ఘాట్‌లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. టాపుపై ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణం చేయకుండా తనిఖీలు నిర్వహిస్తాం. సంబంధిత అధికారులతో మాట్లాడి ఘాట్ రోడ్డులో రక్షణ చర్యలు చేపట్టి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.

# సామాజిక స్థలం.. ‘స్వాహా’ యత్నం..!

విశాఖపట్నం: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలం అది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం దాని విలువ రూ.1.20కోట్లకుపైగా ఉంటుంది. ఖాళీగా ఉన్న ఆ స్థలంపై కొందరు కన్నేశారు. గతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారు. గుట్టు చప్పుడు కాకుండా విక్రయించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**హెచ్చరిక బోర్డు తొలగించి..:** రవీంద్రనగర్ చివరి బస్‌స్టాపు వద్ద పదేళ్ల క్రితం చేపట్టిన కల్యాణ మండపం నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయింది. దాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు ఆలోచన చేశారు. గతేడాది సమావేశం ఏర్పాటు చేసుకుని మహిళా మండలికి కేటాయించిన దాంట్లో మిగిలిన 200 గజాల స్థలాన్ని అమ్మాలని నిర్ణయించారు. అతి తక్కువ ధరకు ఓ వ్యక్తికే అప్పగించాలని చూశారు. విషయం తెలిసిన జీవీఎంసీ అధికారులు సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలం ప్రభుత్వానికి చెందుతుందని, క్రయవిక్రయాలు చెల్లవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు అక్రమార్కుల కన్ను దానిపై పడింది. ఇటీవల ఏకంగా హెచ్చరిక బోర్డును తొలగించి విక్రయించాలని సన్నాహాలు చేస్తున్నారు.

**మహిళా మండలికి...**

పదోవార్డు రవీంద్రనగర్ లేఅవుట్‌లో సామాజిక అవసరాల కోసం గతంలో ఐదు స్థలాలను కేటాయించారు. సుమారు 600 గజాల్లో కల్యాణమండపం నిర్మాణం చేపట్టారు. దానికి ఎదురుగా 250 గజాల్లో ‘సేవాస్ఫూర్తి’ పేరిట



భవనాన్ని నిర్మించారు. మూడో స్థలంలో మహిళా మండలి కార్యకలాపాలు సాగుతున్నాయి. నాలుగో స్థలంలో కళావేదికను నిర్మించారు. ఐదో స్థలం 300 గజాలు ఉండగా 2010లో జీవీఎంసీ నిధులతో 100 గజాల స్థలంలో మహిళా మండలి కోసం సామాజిక భవనాన్ని నిర్మించారు. మిగిలిన 200 గజాల స్థలం ఖాళీగా ఉంది.

**ప్రభుత్వ స్థలాన్ని కాపాడతాం:** సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ప్రభుత్వానికి చెందినవి. అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, ఆసుపత్రుల నిర్మాణానికి మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఆ స్థలాలను విక్రయించడం చట్టరీత్యా నేరంగానే భావిస్తాం. రవీంద్రనగర్‌లోని స్థలాన్ని పరిశీలించి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

వెంకటరావు, జీవీఎంసీ ఏఈ

# అక్రమాల పప్పులుడకవ్..!

పుత్తూరు : వి.కోట మేజర్ పంచాయతీలో గతంలో రూ.20 లక్షల వరకు బిల్లు కలెక్టర్లు స్వాహా చేశారు. దీన్ని ప్రభుత్వ ఖజనాకు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. అది రుజువు కావడంతో ఇద్దరినీ సస్పెండ్ చేశారు. పంచాయతీల్లో నిధులు దుర్వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీల్లో అవకతవకలు జరగకుండా చర్యలు చేపడుతోంది. పంచాయతీల్లో ఖర్చు చేసే ప్రతి పైసాకు పక్కాగా లెక్కలు చూపాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారానే కార్యదర్శులు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆస్తి, నీటి పన్ను బిల్లులు 100 శాతం ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో పన్నుల నగదు స్వాహాకు అడ్డుకట్టపడనుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,411 పంచాయతీలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం, ఆస్తి, నీటి పన్ను, లైసెన్స్‌లు, మైనింగ్, రిజిస్ట్రేషన్ సెస్‌ల రూపంలో ఏటా రూ.కోట్లలో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ప్రధానంగా మేజరు పంచాయతీల్లో కొందరు కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు చేతివాటం చూపుతున్నారు. మోటార్లు మరమ్మతులకు గురికాకున్నా.. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య



పనులు చేపట్టకనే చేసినట్లు చూపి రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నారు. తక్కువకు కొనుగోలు చేసి దస్త్రాల్లో మాత్రం ఎక్కువకు కొన్నట్లు బిల్లులు పెట్టి స్వాహా చేస్తున్న ఉదంతాలు ఉన్నాయి. ఆస్తి పన్ను వసూలు చేసి సొంతానికి వాడుకున్న వారూ ఉన్నారు. కొందరు బయట పడి సస్పెండ్ అవుతున్నారు. వైకాపా హయాంలో ఉమ్మడి జిల్లాలో ఇలా ముగ్గురు కార్యదర్శులు సస్పెండ్ అయ్యారు. మరికొందరు నిధులు సొంతానికి వాడుకుని ఆడిట్, తనిఖీల సమయంలో నగదు జమ చేస్తున్నారు. ఇవి మండల పరిషత్తు అధికారులకు తెలిసినా చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**అక్రమాలు తెలుసుకునే వీలు**

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ప్రతి అంశం నమోదు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఏఏ పంచాయతీల్లో ఎంత ఖర్చు చేస్తున్నారో ఇట్టే తెలుసుకునే వెసులుబాటు ఉంది. పంచాయతీల్లో అక్రమాలు జరిగే అవకాశం ఉండదు.సుధాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, చిత్తూరు

# దళారులు చెప్పిందే ధర

గూడూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలు పనిచేయకపోవడంతో దళారులు చెప్పిన ధరకే రైతులు రెండో పంట ధాన్యాన్ని విక్రయించుకోవాల్సి వస్తోంది. ఉమ్మడి గూడూరు డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో ఎడగారు సీజన్‌లో 45 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. రెండో పంట కింద ఎక్కువ మంది ఏ గ్రేడ్ రకానికి చెందిన 1010 రకం నాటారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేదు. ధాన్యం కొనుగోలులో



స్థానిక కొనుగోలు కేంద్రాలు, మార్కెటు కమిటీలు చొరవ చూపకపోవడంతో క్రమంగా ధరలు తగ్గిపోతున్నాయి.

ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 75 కిలోల ధాన్యం ఏ గ్రేడ్ రకం రూ.1740 వరకు కొనుగోలు చేయాలి. గత నెల మొదటి వారంలో రూ.1,400 వరకు ఉంది. ప్రస్తుతం రూ.1320కు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. దీంతో మిల్లర్లు, వ్యాపారులకు మధ్యలో దళారులు వచ్చి.. తక్కువ ధరకు ధాన్యం కొని మిల్లర్లకు ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. బస్తాపై రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం నాయుడుపేట, పెళ్లకూరు, చిట్టమూరు, కోట మండలాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్థిక అవసరాల దృష్ట్యా పొలాల్లోనే రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కరవు నేలపై.. జలసిరి

చిత్తూరు : జిల్లాలోని కరవు నేల పశ్చిమ ప్రాంతంలో జలసిరి సంతరించు కోనుంది. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న అన్నదాతల కల నెరవేరనుంది. గత వైకాపా ప్రభుత్వం హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ లైనింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా చేపట్టింది. ఈ నెలలో హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ నుంచి 110 చెరువులను నింపడానికి చర్యలు చేపడుతున్నామని జల వనరుల శాఖ ఎస్ఈ వెంకటేశ్వరరాజు తెలిపారు. కాలువ నుంచి తూముల ద్వారా నేరుగా కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లోని 48 చెరువులకు మళ్లించి నింపుతామన్నారు. ఆ తర్వాత 48 చెరువుల నుంచి అనుసంధాన కాలువ ద్వారా మరో 62 చెరువులను నింపి జలకళ సంతరింపజేయనున్నామని చెప్పారు. బుధవారం వి.కోట మండలంలో చెరువుల అనుసంధాన కాలువ పనులు పరిశీలించామని, వేగంగా పనులు పూర్తిచేయాలని ఇంజినీర్లను ఆదేశించామని ఎస్ఈ పేర్కొన్నారు.

చురకలు


## ఉపాధిలో మాయాజాలానికి చెక్

చిత్తూరు : ఉపాధి హామీ పథకంలో మస్టర్ల మాయాజాలానికి కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ఉదయం ఫొటో తీసి వెళ్లిపోయి పని చేసినట్లు చూపడం ఇక కుదరదు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న జాబ్ కార్డులున్న శ్రామికులు ఇకపై రెండు పూటలా మస్టర్ నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో పని చేస్తున్న వారి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆయా మస్టర్ల ఆధారంగా వారికి వేతన చెల్లింపు చేయనున్నారు. ఉపాధి హామీ పనుల మస్టర్లలో జరుగుతున్న అవకతవకలను నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు క్షేత్ర సహాయకులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసేవారు. సామాజిక తనిఖీలు జరిగినప్పుడు కొన్ని చోట్ల మస్టర్లలో లోపాలు ఉండటంతో క్షేత్ర సహాయకులకు జరిమానాలు విధించేవారు. కొత్త విధానంలో ఉదయం, సాయంత్రం మస్టర్ ఫొటోలు



అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో తప్పనిసరిగా శ్రామికులు పని ప్రదేశంలో ఉండాల్సి వస్తోంది. ఈ విధానంతో మస్టర్ నమోదు చేసి పని ఎగ్గొట్టే పరిస్థితి ఉండదు.
అలసత్వం వహిస్తే చర్యలు: క్షేత్ర సహాయకులు తీసే చిత్రాలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పష్టం చేసింది. అలసత్వం వహించే కార్యదర్శి, మండల, జిల్లా అధికారులపై చర్యలు తీసుకుంటారు.
జిల్లాలో జాబ్‌కార్డులు: 2,67,000
వేతనదారులు: 4,79,000 మంది
అవసరాన్ని బట్టి హాజరయ్యేవారు: 2-3 లక్షల మంది
రోజూ పని చేస్తున్న శ్రామికులు: 35 వేల మంది

## కడలి.. హడలి

కాకినాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వరుసగా రెండో రోజూ యు.కొత్తపల్లి మండలం తీరప్రాంత గ్రామాలపై పడింది. ఉప్పాడ తీరంలో మత్స్యకారులను హడలెత్తిస్తోంది. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున గ్రామాలపై విరుచుకుపడుతున్నాయి. సూరాడపేట, జగ్గరాజుపేట, ఉప్పాడ, మాయాపట్నం, అమీనాబాదు, కోనపాపపేట గ్రామాలు రాకాసి అలల ధాటికి కోతబారిన పడ్డాయి. రెండు రోజుల వ్యవధిలో 18 గృహాల వరకు సాగర గర్భంలో కలిసిపోయాయి. మరో 40 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. బుధవారం చక్కగా కనిపించిన రోడ్లు, గృహాలు మరుసటి రోజుకి ధ్వంసమైపోయిన పరిస్థితి.

**ఉప్పునీటి నడుమ..**

లోతట్టు గ్రామమైన మాయాపట్నం గ్రామంలోకి రెండోరోజు కూడా సముద్ర జలాలు చొరబడ్డాయి. ఉప్పునీటితో పాటు భారీగా వ్యర్థాలు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు నిరాశ్రయులయ్యారు. వలసలు వెళ్లినవారి ఇళ్లలో తాత్కాలికంగా తలదాచుకుంటున్నారు. కొంతమంది ఎక్కడ ఉండాలో తెలియక ప్రమాదమని తెలిసీ ఆ ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి వారి అవసరాలను తీర్చాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా ఆదేశాలు జారీ చేశారు. అయినా పాలకులు, అధికారులు అటుగా వెళ్లలేదు. మొదటిరోజు స్థానిక అధికారులు వచ్చి సహాయ చర్యలు చేపట్టి వెళ్లిపోయారు. బాధితులకు నీరు, ఆహారం, విద్యుత్తు తదితర సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహాలు కోల్పోయి నిరాశ్రయులైన వారికి పునరావాస కేంద్రాలు కూడా లేవు.

**ఇరుగుపొరుగు ఇళ్లలో..**

మాయాపట్నానికి చెందిన దూడ పుష్ప మాట్లాడుతూ 'మేము ఉండే పూరిగుడిసె కూలిపోయింది. ఇరుగుపొరుగు ఇళ్లలో మా కుటుంబం తలదాచుకుంటున్నాం. ఎవరూ సాయం చేసింది లేదు. పింఛను సొమ్ముతోనే బతుకుతున్నాం. ఇంటికి వెళ్లాలన్నా అంత స్థోమత లేదు' అని వాపోయారు. మరో మహిళ మోసా రాజయ్యమ్మ మాట్లాడుతూ తన తల్లి, కుమార్తెతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నామన్నారు. అలల తాకిడికి ఇల్లంతా పాడైందని, పెంకులు రాలిపోయి, గోడలు నాని కూలే స్థితిలో ఉందన్నారు. భయంతో బయటకు వచ్చి ఇతరుల నివాసంలోని గదిలో తలదాచుకున్నట్లు తెలిపారు. వర్షానికి పొయ్యి కూడా వెలిగించే పరిస్థితి లేదన్నారు.

## ఆపద వేళ.. అత్యవసర సేవలు

దేవరపల్లి : ఈ నెల 20వ తేదీన దేవరపల్లి మండలం గౌరీపట్నం సమీపంలో ఓ కుటుంబం విశాఖపట్నం నుంచి ఏలూరు వైపు వెళ్తుండగా పెట్రోల్ అయిపోవడంతో కారు ఆగిపోయింది. దీంతో అందుబాటులో ఉన్న ఎస్ఓఎస్ బాక్సును ఉపయోగించడంతో హైవే పెట్రోలింగ్ సిబ్బంది పెట్రోల్‌ను తీసుకుని వచ్చి అందజేశారు. నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం గత నెలలో మరమ్మతులకు గురై ఆగిపోయింది. సమీపంలో ఉన్న ఎస్ఓఎస్ బాక్సు బటన్ నొక్కడంతో కంట్రోల్ రూమ్‌కి సమాచారం వెళ్లింది. హైవే సిబ్బంది మెకానిక్‌ని తీసుకుని వెళ్లి మరమ్మతులు చేయించారు. జాతీయ రహదారిలో ప్రయాణిస్తున్నప్పుడు అనేక జాగ్రత్తలు తప్పనిసరి. ఒక్కొక్కసారి సమస్యలు తలెత్తినప్పుడు ఎస్ఓఎస్(సేవ్ అవర్ సోల్స్) బాక్సుల ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారమిచ్చి సహాయం పొందవచ్చు. ప్రస్తుత వర్షాలు పడుతున్న నేపథ్యంలో వీటిపై అవగాహన ఎంతో అవసరం. జాతీయ రహదారిలో ప్రయాణం చేసేటప్పుడు నారింజ రంగులో బాక్సులు కనపడుతుంటాయి. వీటినే ఎస్ఓఎస్ బాక్సులు అంటారు. వీటి ద్వారా రోడ్డు ప్రమాదాలు, ఇతర సమస్యలను కంట్రోల్ రూమ్‌కి తెలియజేయవచ్చు. దీంతోపాటు మన చరవాణి ద్వారా 1033కి ఫోన్ చేస్తే హైవే అత్యవసర విభాగం నుంచి సాయం అందుతుంది.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..**తూర్పుగోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో రాజమహేంద్రవరం రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పరిధిలో 377 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఉన్నాయి. వీటిలో ప్రతి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక ఎస్ఓఎస్ బాక్సును ఏర్పాటు చేశారు. ప్రయాణం చేసేటప్పుడు వాహనం మరమ్మతులకు గురి అయినా, ఇంధనం లేక ఆగిపోయినా, వెళ్లవల్సిన ప్రాంతం తెలియకపోయినా, ప్రమాదంలో చిక్కుకున్నా, అనారోగ్యం, రోడ్డు ప్రమాదం బారిన పడటంలాంటి ఏ సమస్య వచ్చినా బాక్సు వద్దకు వెళ్లి బటన్ నొక్కితే సాయం అందుతుంది. గుండుగొలను-కొవ్వూరు 16వ నంబరు జాతీయ రహదారిలోని 70 కిలోమీటర్లలో 50 ఎస్ఓఎస్ బాక్సులు ఉండగా ఏడాదికి 200 మంది వరకు వీటిని ఉపయోగిస్తున్నారు.

**సేవలు పొందవచ్చు..**ఎస్ఓఎస్ బాక్సుల గురించి అవగాహన సదస్సులు పెట్టి వివరిస్తున్నాం. ప్రతి బాక్సు వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. 1033 నంబరుకి ఫోన్ చేసినా వెంటనే స్పందించి సిబ్బంది సేవలు అందిస్తారు. రోహిత్‌కుమార్, హైవే పీడీ, రాజమహేంద్రవరం

# దివ్యాంగులకు తీపికబురు



నర్సీపట్నం : సదరం సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. దివ్యాంగుల పింఛన్లకు అవసరమైన స్లాట్లు బుక్ చేసుకునేందుకు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. వైకాపా హయంలో వీటిల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అనర్హులు అడ్డదారిలో కొందరు వీటిని పొందినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వీటి పునఃపరిశీలనకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో స్లాట్లను తాత్కాలికంగా నిలిపివేసింది. జిల్లాలో సదరం సేవల పునఃప్రారంభంలో జాప్యం చోటు చేసుకుంది. తాజాగా ఇటీవల వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పింఛన్ల కోసం దివ్యాంగులు మళ్లీ ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, నక్కపల్లి, కోటవురట్లలో సదరం సేవలకు ఏర్పాట్లు చేశారు. వీటిల్లో వైకల్యం శాతం ధ్రువీకరణ నిర్ధారణ పత్రాలు జారీ కోసం ఆర్థో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్థోతోపాటు చూపు, వినికిడి తదితర కేటగిరీల పరీక్షలకు స్లాట్ల ఆధారంగా నిర్ణీత రోజుల్లో దివ్యాంగులు తమకు కేటాయించిన ఆసుపత్రుల్లో సేవలు పొందుతున్నారు.


విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో జిల్లా వ్యాప్తంగా 41,824 మంది పింఛన్లు పొందుతున్నారు. గతంలో జిల్లాలో పింఛన్ల కోసం దరఖాస్తులు చేసిన మూడువేల మంది జాబితా పెండింగ్‌లో ఉండేది. అప్పటికే వీటిలో అవకతవకలు బయటపడుతున్న నేపథ్యంలో స్లాట్లు నిలిపివేశారు. వీటిసంఖ్య ఇప్పుడు వెయ్యికి పరిమితం కావడంతో బుకింగ్‌నకు అవకాశం ఇచ్చారు.

కోటవురట్ల ఆసుపత్రిలో ఆర్థో లేనందున నక్కపల్లి నుంచే డాక్టరు ఇక్కడికి వచ్చి సేవలు అందిస్తున్నారు. గతంలో నర్సీపట్నం ప్రాంతాల్లోనూ అనర్హులు అధికంగా పింఛన్లు పొందారన్న విషయమై శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సైతం తీవ్రంగా స్పందించి వీటిలో పక్కా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు.

**ప్రత్యేక పరిశీలనతో పక్కా ఏర్పాట్లు**

జిల్లాలోని నక్కపల్లి ఆసుపత్రుల్లో నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ పకడ్బందీ ఏర్పాట్లతో పరీక్షలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. వీటిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఆసుపత్రిలోని వైద్యాధికారులు సైతం వీటిని పర్యవేక్షించేలా మార్గదర్శకాలు జారీ చేశాం. ఏవైనా అవకతవకలు బయటపడితే సంబంధిత ఆర్థో నిపుణులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఒత్తిళ్లకు తలొగ్గి అనర్హులను ఎంపిక చేస్తే కఠిన చర్యలు తప్పవు. డాక్టర్ శ్రీనివాస్, వైద్య విధాన పరిషత్తు సమన్వయకర్త, అనకాపల్లి

# నిఘా నేత్రం.. ఆలయాలకు అభయం



కాకినాడ : జిల్లాలో కరప సమీపంలోని సంపర శివాలయంలో దొంగలుపడి స్వామివారి బంగారు ఆభరణాలు దోచేశారు. ఆలయంలో సీసీ కెమెరా ఉన్నా.. నిర్వహణ లేక పనిచేయలేదు. దాంతో చోరీని ఛేదించడం కష్టంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముక్తేశ్వరంలోని క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. సీసీ కెమెరా ఉన్నా.. సక్రమంగా పనిచేయలేదు. ఆభరణాలకూ బీమా చేయలేదు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు భద్రతాపరంగా, ఆలయ రక్షణకు కవచంగా ఉపయోగపడేలా నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయించింది. పోలీసుశాఖ విజ్ఞప్తి, ప్రభుత్వపరంగా అనుమతులు రావడంతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఎన్ని ఆలయాలున్నాయి. వాటికి ఎన్ని సీసీ కెమెరాలున్నాయన్న దానిపై అధికారులు నివేదిక తయారు చేశారు.

**జిల్లాలో ఇలా..**

కాకినాడ జిల్లాలో చిన్న, పెద్ద ఆలయాలు 344 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో పలు ఆలయాల్లో ఇప్పటికే 858 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ సరిలేక చాలా కెమెరాలు పనిచేయడం లేదు. మరికొన్ని చోట్ల పాడైపోవడంతో వాటిని మార్చనున్నారు. ఇంకా 1268 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిఉందని ఆ శాఖ కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించారు.

**చర్యలకు సిద్ధం..**

దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని 6 ఏ, 6 బీ కేటగిరిలోని పెద్ద ఆలయాల్లో ఇప్పటికే కెమెరాలున్నాయి. 6 సీ కేటగిరిలోని చిన్నపాటి ఆలయాల్లో ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా దేవతా విగ్రహాల విధ్వంసాలు జరిగినా.. సరైన ఆధారాలు దొరక్క నిందితులపై చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం ఆలయాలకు రక్షణగా ఉండేలా, ఆభరణాలు, హుండీలు చోరీకి గురికాకుండా చర్యలకు శ్రీకారం చుట్టింది. చర్చిలు, మసీదుల్లోనూ నిఘా కెమెరాలు ఉండాలని సూచించింది. **పర్యవేక్షణ చేయాలి..**

జిల్లాలోని అనేక ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇతర అన్ని ఆలయాల్లో ఏర్పాటుకు కమిషనర్ కార్యాలయానికి నివేదిక పంపించాం. కొన్నిచోట్ల అధికారులు సక్రమంగా పర్యవేక్షించడం లేదు. ఈవోలు వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడల్లా తమ సెల్‌ఫోన్‌లలో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలి. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు. కనపర్తి నాగేశ్వరరావు, జిల్లా దేవాదాయశాఖ అధికారి, కాకినాడ

# పారిశ్రామికవాడలు.. ఉపాధికి అడుగులు



కాకినాడ : ప్రతి నియోజకవర్గంలో ఒక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ) లేదా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయం (ఎఫ్ఎఫ్‌సీ) ఉండాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం. ఎక్కువమందికి ఉపాధి కల్పించేందుకు ఆస్కారమున్న ఈ యూనిట్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనువుగా అభివృద్ధి చేస్తున్నారు. కాకినాడ ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం పరిధిలోని రాజానగరం నియోజకవర్గంలో కలవచర్ల పారిశ్రామికవాడను ఇప్పటికే సిద్ధంచేశారు. పెద్దాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు.. జగ్గంపేట, కాకినాడ గ్రామీణం, పిఠాపురం నియోజకవర్గాల్లో ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణ పనులను కార్యరూపంలోకి తెస్తున్నారు.

**ప్రాధాన్యం వారికే..**

తెదేపా ప్రభుత్వ హయాంలో వేములపల్లి, జేగురుపాడులో పరిశ్రమల అవసరాలకు ఏపీఐఐసీ ద్వారా భూములు సేకరించారు. ముందుకు వచ్చిన 70 మందికి ప్లాట్లు కేటాయించారు. వైకాపా సర్కారు వచ్చాక పేదలకు ఇళ్ల స్థలాలు కోసమంటూ ఆ భూములను తీసుకుని.. ప్రత్యామ్నాయంగా కలవచర్ల వద్ద 110 ఎకరాలు ఏపీఐఐసీకి అప్పగించారు. వాటిలోనే రూ.20 కోట్లతో పారిశ్రామిక వాడ అభివృద్ధి చేసి 390 ప్లాట్లను సిద్ధం చేశారు. గత తెదేపా ప్రభుత్వంలో కేటాయించిన లబ్ధిదారులకు తొలి ప్రాధాన్యం కింద అప్పటి ధరతోనే ఇవ్వాలని భావిస్తున్నారు. మిగతా ప్లాట్ల కోసం ఇప్పటికే 33 మంది దరఖాస్తు చేసుకోగా చ.మీ ధర రూ.3,241 నిర్ణయించారు. జీడి ప్రాసెసింగ్, ఫర్నిచర్, ఫ్యాబ్రికేషన్, ఇంజినీరింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. **కీలకం ఇవే..**

జిల్లాలో తీర ప్రాంతాన్ని అనుకుని భారీ పరిశ్రమలు వస్తున్నాయి. వాటికి అనుబంధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) కంపెనీలతో మరింతమందికి ఉపాధి లభిస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ యూనిట్లు స్థాపించొచ్చు.

పెద్దాపురం నియోజకవర్గంలో 29 ఎకరాల్లో రూ.13 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు పనులు మొదలయ్యాయి. 300 చ.మీ చొప్పున 175 ప్లాట్లను అభివృద్ధి చేస్తారు. 79 ఎల్ఈడీ వీధి దీపాలు, విద్యుత్తు నియంత్రికల ఏర్పాటుకు రూ.88 లక్షలతో టెండర్లు పిలిచారు.

పిఠాపురంలో రెండెకరాలు, వాకలపూడిలో మూడు, గండేపల్లి మండలం రంగంపేట వద్ద అయిదు ఎకరాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలు నిర్మిస్తున్నారు. ఒక్కోదాంట్లో రూ.9.60 కోట్లతో 20 బ్లాక్‌లను ప్లగ్ అండ్ ప్లే విధానంలో అభివృద్ధి చేస్తారు. చ.అ లెక్కన అద్దె నిర్ణయించి యూనిట్లు కేటాయిస్తారు.

**ద్రాక్షారామలో ఇలా..**

కోనసీమ జిల్లాలో తొలివిడతగా ద్రాక్షారామలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇక్కడ భూములు కొంత లోతట్టుగా ఉండడంతో అంచనా విలువ రూ.11 కోట్లకు పెరిగింది. రెండో విడతలో అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తంలో మరో ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణం చేపడతారు. 6.5 ఎకరాల ప్రభుత్వ భూములను ఇప్పటికే గుర్తించారు. మిగతా నియోజకవర్గాల్లోనూ అన్వేషిస్తున్నారు.

**అన్ని ప్రాంతాలు అభివృద్ధి..**ఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ సముదాయాలతో ఎక్కువమంది యువతకు ఉపాధి లభిస్తుంది. అన్ని ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. వచ్చే ఆరు నెలల్లో అందుబాటులోకి తేవాలని చూస్తున్నాం. రమణారెడ్డి, జడ్ఎం, ఏపీఐఐసీ, కాకినాడ

## వరదాయిని.. వదిలేయకని..!

కడియం : ఉభయ గోదావరి జిల్లాల్లో గోదావరి ద్వారా సుమారు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఏటా జులై, ఆగస్టుల్లో వచ్చే వరదలతో లంకలన్నీ ముంపునీట చిక్కుకుంటాయి. లక్షల ఎకరాల సాగుపై ప్రభావం ఉంటుంది. ఈ సారి జులైలో పెద్దగా ప్రభావం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలను బట్టి ప్రభావం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

**ఈ సారైనా దృష్టి సారించాలి..**

ఏటా వరదల సమయంలో కొన్ని లక్షల క్యూసెక్కుల జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. బ్యారేజీ నిల్వ సామర్థ్యం మూడు టీఎంసీలు కాగా పేరుకుపోయిన ఇసుక తిన్నెల కారణంగా అది ప్రస్తుతం రెండు టీఎంసీలకు పడిపోయింది. 175 గేట్లలో 117 తుప్పుపట్టి ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

**అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..**



గోదావరికి 2022 జూన్‌లో తీవ్ర స్థాయిలో వరదలు వచ్చాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 20 అడుగులకు నీటి మట్టం చేరుకోగా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దాదాపు 10 రోజులపాటు ఈ పరిస్థితి కొనసాగింది. సుమారు 30 లక్షల క్యూసెక్కులకుపైగా జలాలను సముద్రంలోకి వదిలారు. దాంతో లంక ప్రాంతాలన్నీ నీట మునిగాయి. ఆ తరువాత 2023, 24లలో జులైలో వరదలొచ్చాయి. ఆయా సమయాల్లో దాదాపు 14, 15 అడుగులకు వరద చేరుకోగా 15 లక్షల నుంచి 20 లక్షల క్యూసెక్కుల జలాలను బ్యారేజీ దిగువకు వదిలేశారు. ఈ ఏడాది తక్కువ వర్షాల కారణంగా కేవలం 10 అడుగుల వరకే ప్రస్తుతం ప్రవాహం ఉంది.

ధవళేశ్వరం బ్యారేజీ సామర్థ్యం సరిలేక ఏటా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలు

**వచ్చే నెల 10 తర్వాత**

ఆగస్టు 10 తర్వాత వరదలు వచ్చే అవకాశం ఉంది. ఎలాంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉన్నారు. ప్రవాహం తగ్గుముఖం పట్టిన తర్వాత మంజూరైన నిధులతో మరమ్మతులు చేయిస్తాం. కె.గోపీనాథ్, గోదావరి హెడ్‌వర్క్స్ ఎస్ఈ, ధవళేశ్వరం

## కమీషన్లపై కన్నేసి.. పనులు ఆ'పేచీ'

కర్నూలు : కర్నూలు నగరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గుత్తేదారుల మధ్య సాగుతున్న కమీషన్ల పంచాయితీ అభివృద్ధికి విఘాతంగా మారింది. కమీషన్లు ఇస్తేనే అధికారులు బిల్లులు చెల్లిస్తున్నారు.. క్వాలిటీ కంట్రోల్‌ను ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలంటూ ఇప్పటికే గుత్తేదారులు పనులు ఆపేశారు. ఆరు శాతం కమీషన్ ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు తాజాగా సమావేశం పెట్టి మరీ హుకుం జారీ చేయడం కలకలం రేపింది. చిన్న చిన్న పనులు చేయడానికీ పేచీ పెడుతున్నారు.. దీంతో టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

**వారు ప్రారంభించరు.. వీరు పట్టించుకోరు**

నగరపాలక పరిధిలో దాదాపు రూ.40 కోట్లలో పనులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. కొందరు గుత్తేదారుల చేతిలో రూ.కోట్ల విలువైన పనులు ఉన్నాయి. వారు నెలలు గడుస్తున్నా ప్రారంభించడం లేదు. అభివృద్ధి పనులు పూర్తవక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నగరంలోని కలెక్టరేట్ వద్ద ఎన్టీఆర్ కూడలిలో రూ.8 లక్షలతో చేపట్టిన



పచ్చదనం పెంపు, ఇతర పనులను ఇంతవరకు పూర్తి చేయలేదు. 31వ వార్డులోని బద్రినాథ్‌నగర్, శరీన్‌నగర్‌లో సీసీ కాలువలు, కల్వర్టులు నిర్మించేందుకు రూ.83.90 లక్షలతో ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశారు. ఇంతవరకు నిర్మాణాలు మొదలే కాలేదు.

ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీనది పరివాహక ప్రాంతంలో రూ.10 లక్షలతో ఉద్యానవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నేటికీ పూర్తి కాలేదు.

**30 శాతం లెస్‌కు టెండర్లు**

అభివృద్ధి పనులు చేయాలనుకునే గుత్తేదారులు 5 శాతం కంటే లెస్‌కు టెండర్లు వేయకూడదు. 5 శాతం కంటే తక్కువకు టెండర్లు దక్కించుకుని చేపట్టిన పనులపై క్వాలిటీ కంట్రోల్ బోర్డు నాణ్యతా తనిఖీలు చేశాకే బిల్లులు మంజూరవుతాయి. కానీ కొందరు గుత్తేదారులు నగరంలో చాలా పనులను 30 శాతం వరకు లెస్‌కు వేసి దక్కించుకున్నారు. అసలే భారీ లెస్‌కు వేసిన వారి నుంచీ కమీషన్లు అడుగుతుండటంతో వారు పనులు ప్రారంభించలేదు. పనులు దక్కించుకుని నిర్మాణాలు ప్రారంభించని గుత్తేదారులపైన, లెస్‌కు టెండర్ వేసి పనులు చేయని గుత్తేదారులపై గత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారు కమీషన్లపైనే దృష్టి సారించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

30 శాతం లెస్‌కు దక్కించుకుంటే ఇక ఆ పనుల్లో ఏం నాణ్యత ఉంటుందని కొందరు గుత్తేదారులు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టినా పట్టించుకునే వారు కరవయ్యారు.

## ఉచిత ప్రయాణానికి సిద్ధమేనా?

అనంతపురం : ఆగస్టు 15 నుంచి మహిళలకు జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు అన్ని డిపోలో సన్నద్ధ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోతాయా.. లేదా? ఇంకా ఎన్ని అవసరం? తదితరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు బస్టాండుల్లో మహిళలకు వసతులు పెంచాల్సిన అవసరం ఉంది. పథకం అమల్లోకి వచ్చాక మహిళా ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అదనపు కుర్చీలు, మూత్రశాలలు, తాగునీరు, ఫ్యాన్లను అందుబాటులోకి తేవాల్సింది.

**చకచకా ఏర్పాట్లు**

ప్రతి బస్టాండు నుంచి ఎంతమేరకు డ్రైవర్లు అవసరం అవుతారో లెక్క తీశారు. 160 మందిని అదనంగా అందుబాటులోకి తీసుకురానున్నారు.పల్లెవెలుగు బస్సుల్లో సీట్లు, అద్దాలు, మరమ్మతులు చేస్తున్నారు. డిపోల వారీగా కొత్తవి ఏర్పాటు చేసేందుకు కడప రీజియన్



కార్యాలయానికి నివేదించారు.జిల్లాలో నిత్యం 1.21లక్షల మంది ప్రయాణిస్తుండగా రూ.85 లక్షల ఆదాయం వస్తోంది. ప్రస్తుతం ఆక్యుపెన్సీ 67 శాతం ఉండగా ఉచిత బస్సులు వస్తే 140 శాతానికి పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.

**కొత్త సర్వీసులు అవసరం**

జిల్లాలోని 456 గ్రామాలకు సర్వీసులు ఉన్నాయి. ఉచిత బస్సు పథకం నేపథ్యంలో పలు మేజర్ పంచాయతీలకు బస్సులు తిప్పాల్సి వస్తుంది. కొత్తగా 55 గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలనే డిమాండ్ ఉంది. ఇందుకు అదనంగా 30 నుంచి 40 బస్సులు అవసరం. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ధర్మవరం వైపు ఆయా డిపోల బస్సులు వెళుతుండటంతో రద్దీకి అనుగుణంగా మార్చుకోవచ్చు. ఉరవకొండ, తాడిపత్రి, బెంగళూరు మార్గాల్లో అదనపు బస్సులు అవసరమవుతాయని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి.

## దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

లేపాక్షి : మండలంలోని బిసలమానేపల్లి నుంచి వెంకటాపురం, ఓబుళాపురం గ్రామాలకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు కంకర తేలిన రహదారిపై రాకపోకలు సాగించేవారు. వర్షం వస్తే బురదమయమై వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. ఎవరికైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే 108 వాహనం సైతం గ్రామాలకు వెళ్లలేని దుస్థితి. దీనిపై ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. 2014లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రహదారి ఏర్పాటుకు రూ.2.50 కోట్లకు పైగా నిధులు విడుదల చేయించారు. అప్పట్లో



పనులు దక్కించుకున్న గుత్తేదారు ప్రారంభించి 20శాతం మేర చేసేలోపే 2019లో ఎన్నికలు రావడం, వైకాపా అధికారం చేపట్టడం జరిగింది. అయితే రహదారి ఏర్పాటుకు వైకాపా ఐదేళ్లు పట్టించుకోలేదు. పనులు నిలిచిపోయాయి. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రహదారి ఏర్పాటుకు రూ.3కోట్ల నిధులు విడుదల చేయించారు. ప్రస్తుతం రెండు గ్రామాలకు సుందరమైన బీటీ రహదారి రూపుదిద్దుకుంది. దీంతో దశాబ్దాల కల నెరవేరినట్లైందని ఆయా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## తీరని వేదన.. మారని యాతన

సీలేరు : రోడ్డు సక్రమంగా లేక గర్భిణిని కాలినడకన కిలోమీటరు దూరం తీసుకువెళ్లిన ఘటన గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ రాంపూర్‌లో చోటుచేసుకుంది. జి.నేరేడుపల్లి నుంచి రాంపూర్ వరకు రహదారి బురదమయంగా మారింది. మధ్యలో కాలువ, కాలిబాట ఉండటంతో ద్విచక్రవాహనాలు సైతం గ్రామానికి వచ్చే వీలులేదు. ఈ పరిస్థితుల్లో గురువారం రాంపూర్ గ్రామానికి చెందిన గర్భిణి లక్ష్మికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఈమెను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు స్థానిక ఆశా కార్యకర్త జమున సీలేరు వైద్యులకు సమాచారం అందించడంతో అంబులెన్స్ పంపారు. అయితే రోడ్డు బాగోలేక అంబులెన్స్ కొంతవరకే వచ్చింది. కిలోమీటరు దూరంలో ఉన్న అంబులెన్స్ వరకు గర్భిణిని ఆశా కార్యకర్త నడిపించుకుని తీసుకువెళ్లింది. అక్కడినుంచి అంబులెన్స్‌లో సీలేరు ఆసుపత్రికి తరలించడంతో సుఖప్రసవం జరిగింది. తమ గ్రామానికి రోడ్డు సరిగ్గా లేక ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

**గర్భిణికి నెలలు నిండి ప్రసవ వేదన పడుతుండగా..** బంధువులు డోలీలో నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లిన ఘటన అనంతగిరి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. కొత్తూరు పంచాయతీ టెంకాబుడ్డి గ్రామానికి చెందిన గన్నెల సీతమ్మ గర్భిణి. నెలలు నిండటంతో గురువారం ఉదయం పురిటి నొప్పులువచ్చాయి. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో బంధువులు ఆమెను డోలీలో మోసుకుని సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లారు. అక్కడినుంచి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఉరకలేస్తున్న తుంగభద్ర.. కృష్ణమ్మ



అనంతపురం : తుంగభద్రమ్మ, కృష్ణమ్మ ఉరకలేస్తూ 'అనంత'ను ముద్దాడాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈదఫా ముందస్తుగా జిల్లాలోకి ప్రవేశించి అన్నదాతల్లో ఆనందాన్ని నింపాయి. అటు కృష్ణా జలాలు జీడిపల్లికి, ఇటు తుంగభద్ర నీరు ఎమ్పీఆర్ ప్రాజెక్టుకు చేరడం విశేషం. ఈనెల 17న నంద్యాల జిల్లా మల్యాల పంప్‌హౌస్ వద్ద కృష్ణా జలాలను హంద్రీనీవా ప్రధాన కాలువకు ఎత్తిపోసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అదే రోజున హెచ్చెల్సీ వాటా నీటిని టీబీ డ్యాం వద్ద విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వరప్రదాయినిలుగా భావించే హంద్రీనీవా, హెచ్చెల్సీ ప్రధాన కాలువల్లో ప్రవాహాలు జోరుగా సాగుతున్నాయి. జీడిపల్లికి నీరు చేరడంతో జిల్లా జలవనరుల సీఈ నాగరాజు, హంద్రీనీవా ఎస్ఈ స్వరూప్‌కుమార్, తదితరులు గంగపూజ చేసి.. జలహారతి ఇచ్చారు.

**29న పీఏబీఆర్‌కు విడుదల**

ఈనెల 17న మల్యాల నుంచి హంద్రీనీవాకు నీరు విడుదల అయ్యాయి. అక్కడి నుంచి ఆరు రోజులకే అనంత జిల్లా సరిహద్దుకు చేరాయి. అదే రోజే రాగులపాడు పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోశారు. రెండు రోజుల్లో జీడిపల్లికి చేరడం ప్రస్తావనార్హం. గతంలో 10 నుంచి 12 రోజులు పట్టేది. ఈదఫా ఎనిమిది రోజులకే ప్రవేశించడం విశేషం. హంద్రీనీవా చరిత్రలోనే ఒకేసారి 1500క్యూసెక్కులు రావడం రికార్డుగా భావిస్తున్నారు. రాగులపాడు వద్ద ఐదు పంపులతో ఎత్తిపోస్తున్నారు. ఈనెల 28 దాకా జీడిపల్లిని నింపిన తర్వాత.. 29న పీఏబీఆర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తారురెండు జిల్లాల తాగునీటి అవసరాలు తీర్చే పీఏబీఆర్‌లో గరిష్ఠంగా 5.5 టీఎంసీలు నిల్వ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

**నేరుగా ఎమ్పీఆర్‌కే..**

టీబీ డ్యాం వద్ద ఇదే నెల 17న హెచ్చెల్సీ వాటా విడుదలకు శ్రీకారం చుట్టారు. అప్పటికే ఏపీ-కర్ణాటక సరిహద్దులో నిల్వ ఉన్న నీటిని 105 కి.మీ. వద్ద గేట్లను ఎత్తి హెచ్చెల్సీకి విడుదల చేశారు. ప్రస్తుతం సరిహద్దులో 926 క్యూసెక్కుల మేర ప్రవాహం సాగుతోంది. అక్కడి నుంచి నేరుగా కణేకల్లు చెరువుకు చేరుతున్నాయి. చెరువు నుంచి దిగువన ప్రధాన కాలువ ద్వారా నేరుగా ఎమ్పీఆర్ జలాశయానికి ప్రవేశించాయి. ఇక్కడికి వచ్చేసరికి 300 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 1,500 క్యూసెక్కుల మేర సరిహద్దులో తీసుకునేలా టీబీ డ్యాం అధికారులకు ఇండెంట్ పంపారు.

## వాటా స్వాహా



గుమ్మఘట్ట : కూటమి ప్రభుత్వం రాగానే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గొర్రెలు, పశువుల షెడ్ల (గోకులం షెడ్లు) నిర్మాణం చేపట్టింది. ఎక్కడా లేని విధంగా గుమ్మఘట్ట మండలంలో ఉపాధి హామీ ఉద్యోగులు అక్రమాలకు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో షెడ్డుకు లబ్ధిదారుల నుంచి వసూలు చేశారు. ఒక్కో షెడ్డు మొత్తం యూనిట్ విలువ రూ2.30 లక్షలు. అందులో రైతు వాటా పది శాతం అంటే రూ23 వేలు. ప్రభుత్వం 90 శాతం అందిస్తుంది. 10 శాతం వాటా రైతులు కట్టాల్సిన అవసరం లేదు. దాన్ని మినహాయించి సర్కారు అందిస్తుంది. ఉపాధి హామీ ఏపీఓ, ఈసీలు క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి. ముందుగా రూ.23 వేలు చెల్లిస్తేనే షెడ్డు మంజూరు చేస్తామని హుకుం జారీ చేశారు. 49 మందికి పైగా లబ్ధిదారులతో రూ.11 లక్షలకు పైగా ముక్కుపిండి రాబట్టారు. ఒప్పుకోని రైతులకు బిల్లులు పెట్టేదిలేదని బెదిరించి వసూలుకు పాల్పడ్డారు.

**బిల్లు కావాలన్నా సమర్పించాల్సిందే..**

షెడ్లు మంజూరు నాటి నుంచి నిర్మాణాలు ప్రారంభం వరకు.. బిల్లు పెట్టేందుకు ఒక్కో రైతు నుంచి రూ5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసి స్వాహా చేశారు. లబ్ధిదారుల నుంచి భారీగానే వసూలు చేశారు. అసలే పంటలు పండక అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రైతులను ఉపాధి హామీ ఉద్యోగులు జలగల్లా పీక్కుతింటున్నారు. అమాయక రైతులకు మాయమాటలు చెప్పి వసూళ్లకు తెగబడుతున్నారు.

**నిర్మాణం ప్రారంభానికి ముందే ఇచ్చా..**

నాకు షెడ్డు మంజూరైంది. ముందుగానే రూ.23 వేలు కట్టాలని ఉపాధి సిబ్బంది చెప్పారు. ప్రారంభానికి ముందే వసూలు చేశారు. ఇదేమిటని అడిగితే డబ్బు ఇవ్వాల్సిందే.. లేకపోతే బిల్లులు పెట్టమన్నారు. అందుకే ముందేగా ఇచ్చాను.

గోవిందప్ప రైతు, రంగచేడు, గుమ్మఘట్ట మండలం

**కఠినచర్యలు తప్పవు**

క్షేత్ర స్థాయిలో వసూళ్లకు పాల్పడిన వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు ఇబ్బంది పడకూడదనే బిల్లులు సైతం సమయానికి రైతులకు అందిస్తోంది. ఇలాంటి పనులను ఉపేక్షించేది లేదు.సలీంబాషా, డ్వామా పీడీ

## దూరవిద్యా కేంద్రం.. మహిళలకు వరం



తిరుపతి : గతంతో పోల్చితే ప్రస్తుతం దూరవిద్య కోర్సులకు మరింత ప్రాధాన్యం పెరుగుతోంది. ఆర్థిక ఇబ్బందులతో రెగ్యులర్ కోర్సులు అభ్యసించలేని విద్యార్థినులకు, చదువుపై ఆసక్తి ఉన్న గృహిణులు, ఉద్యోగాలు చేస్తూ చదువు కొనసాగించాలనుకునే మహిళలకు శ్రీపద్మావతి మహిళా వర్సిటీ దూరవిద్యా కేంద్రం అందించే వివిధ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. విద్యార్హతలు పెంచుకోవడానికి, ఉద్యోగోన్నతులు పొందడానికి ఈ కోర్సులెంతో అనుకూలంగా ఉన్నాయి. 59 రెగ్యులర్ కోర్సులనందిస్తున్న వర్సిటీ దూరవిద్య ద్వారా పలు కోర్సులను అందిస్తూ మహిళల ఉన్నత విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. కోర్సు, ఫీజుల వివరాలను కేంద్రం సంచాలకులు ఆచార్య అరుణ వివరించారు.

పీజీ, డిప్లొమా కోర్సులు : 2025-26లో వివిధ డిప్లొమా, పీజీ డిప్లొమా, పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. పీజీలో ఎంఏ తెలుగు, ఎంకాం, డిప్లొమాలో మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పీజీ కోర్సుల్లో ప్రవేశానికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిప్లొమా కోర్సులకు ఏదైనా సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.

ఎంఏ తెలుగు, సీట్లు : 30, ఫీజు: రూ.4వేలు (ఏడాదికి)

కోర్సు: ఎంకాం, సీట్లు 65, ఫీజు: రూ.5వేలు (ఏడాదికి)

కోర్సు: డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం), సీట్లు: పరిమితిలేదు, కోర్సు ఫీజు: రూ.3వేలు, కాలపరిమితి: 6 నెలలు.

అనుకూలతలు: ఇంటి దగ్గరే కోర్సులు అభ్యసించవచ్చు. రెగ్యులర్ కోర్సులతో పోల్చితే రుసుములు తక్కువే. రెగ్యులర్ సర్టిఫికెట్లకు ఎలాంటి గుర్తింపు ఉంటుందో దూరవిద్య కోర్సులకు అలాంటి గుర్తింపే ఉంటుంది. ఉద్యోగం/వ్యాపారం చేసుకుంటూ చదువుకోవచ్చు. ఉద్యోగోన్నతులకు దూరవిద్య కోర్సులు ఎంతగానో తోడ్పడుతున్నాయి. దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసినవారు సివిల్స్, గ్రూప్స్, జేఎల్, డీఎల్ వంటి అన్ని పోటీ పరీక్షలు రాయొచ్చు.

**అధ్యయన కేంద్రాలు :** రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 18 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. వర్సిటీతోపాటు శెట్టిపల్లి, నంద్యాల, శ్రీకాకుళం, రాయచోటి, గుంటూరు, కృష్ణాజిల్లా, ఒంగోలు, ఏర్పేడు, ప్రకాశం, విశాఖపట్నం, కడప, పుత్తూరు, తూర్పు గోదావరి ప్రాంతాల్లో.

**దరఖాస్తు తేదీ :** ఆగస్టు 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ.350 చెల్లించి నేరుగాకానీ వర్సిటీ వెబ్‌సైట్ ద్వారాకానీ దరఖాస్తు పొందవచ్చు. పూర్తిచేసిన దరఖాస్తులను దూరవిద్యా కేంద్రానికి నిర్దేశించిన గడువులోపు చేర్చాల్సి ఉంటుంది.

**బోధన ఇలా :** కోర్సులో చేరిన వారికి తరగతులు మహిళా వర్సిటీలోనే ఉంటాయి. ఇక్కడి ఆచార్యులే పాఠాలను బోధిస్తారు. సెప్టెంబరులో మ్యూజిక్ కోర్సు అభ్యర్థులకు ఐదురోజులు, ఎంఏ తెలుగు, ఎంకాం అభ్యర్థులకు పదిరోజులపాటు తరగతులు జరుగుతాయి. డిసెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు.

## చదువుకున్న బడి రుణం తీర్చుకున్నారు

గోరంట్ల : ఎంత ఎత్తుకెదిగినా జన్మభూమి, చదువుకున్న పాఠశాలను గుర్తుపెట్టుకుని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చే వారు అరుదుగా ఉంటారు. అలాంటి కోవకు చెందిన వారే గోరంట్ల రంగారావు, కొండాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్. అయిదు దశాబ్దాల క్రితం ఒకరు, నాలుగు దశాబ్దాల క్రితం మరొకరు పాఠశాలలో చదువుకున్నారు. నేడు ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరుకుని హైదరాబాద్, బెంగళూరులో స్థిరపడ్డారు. చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని తద్వారా తమప్రాంత విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తలచి ఆదిశగా అడుగులు వేశారు. అప్పట్లో ఒకటిగా ఉన్న ఉన్నత పాఠశాల నేడు బాలికలు, బాలుర పాఠశాలలుగా విడిపోవడంతో ఒక్కోదాన్ని ఒకరు ఎంచుకుని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చారు.

**సమస్యలను పరిష్కరించిన సోమశేఖర్**

ఆ పాఠశాలలో యాభై ఏళ్ల క్రితం పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు స్వర్ణోత్సవ వేడుకల పేరుతో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అందులో ఒకరుగా హాజరైన సోమశేఖర్ దృష్టికి పాఠశాల (ప్రస్తుతం బాలికలు)లో కొనసాగుతున్న పలు సమస్యలను ఉపాధ్యాయులు వివరించారు. పారిశ్రామికంగా బెంగళూరులో ఉంటున్న ఆయన స్పందించి తనవంతుగా ఒక్కరే సుమారు రూ.2.50లక్షలు వెచ్చించి వంటగదికి మరమ్మతులు, పైభాగంలో రేకులషెడ్డు, ప్రభుత్వం సరఫరా




చేసిన నీటిశుద్ధిప్లాంటు ఆరుబయట ఏర్పాటు చేయడంతో పాడైపోతోందని గ్రహించి వర్షానికి తడవకుండా రేకులషెడ్డు వేయించారు. మధ్యాహ్న భోజన పథకం కొనసాగడానికి అవసరమైన వంట సామగ్రిని ఇచ్చారు. దీనికి తోడు మండలంలో ఉన్న నిషాగార్మెంట్స్ పరిశ్రమ యాజమాన్యం పాఠశాలకు రూ.75వేలు సాయం చేయడంతో మరిన్ని మరమ్మతులు చేయించారు.

**బాలికల ఉన్నత పాఠశాలలో వంటగది**

**రూ.8 లక్షలతో భోజనశాల రంగారావు**

గోరంట్లకు చెందిన రంగారావు, సినీ పారిశ్రామిక రంగాల్లో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. పదో తరగతి వరకు గోరంట్లలో చదివిన ఆయన ఆర్థికంగా మంచిస్థాయికి చేరుకున్నారు. తను చదువుకున్న ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆవరణలోనే నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం తినడానికి చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించి రూ.8 లక్షలతో భోజనశాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఆయన సోదరుడు సినీ నిర్మాత జీఎం సురేష్ పర్యవేక్షణలో పనులు పూర్తిచేయించి రంగారావు స్వయంగా ప్రారంభ కార్యక్రమానికి వచ్చారు. జన్మభూమి రుణం తీర్చుకునే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందని చెప్పారు రంగారావు.

## అక్రమార్కులకు ఆక్సిజన్

కర్నూలు : వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో ఆక్సిజన్ కొనుగోళ్ల పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారు. కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ అవినీతి పర్వంపై అధికారులు గుట్టుగా విచారణ చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా ఆ రహస్య విచారణలో ఏం తేలిందన్న విషయాన్ని ఉన్నతాధికారులు బయటపెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిగ్గు తేల్చాల్సిన అధికారులు అంతులేని తాత్సారం చేస్తుండటంతో ఏటా రూ.2 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది.

**రద్దు చేసే అవకాశం లేదంటూ..**

ఆయా సరఫరా సంస్థలతో పదేళ్ల పాటు అమలులో ఉండేలా ఒప్పందాలు చేసుకోవడంతో వాటిని రద్దు చేసే అవకాశం లేదంటూ అధికారులు సరఫరా సంస్థకు వత్తాసు పలుకుతున్నారు. ఆయా ధరలకు కొనుగోళ్లు జరగడానికి మామూళ్ల మత్తే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**భారీగా దోపిడీ**

ఆక్సిజన్ సరఫరా చేస్తున్న సంస్థ జీజీహెచ్ వరకు ఆక్సిజన్ రవాణా చేయడానికి అవుతున్న వ్యయాన్ని కూడా బిల్లులో చూపుతోంది. దీంతో ప్రాణవాయువు వ్యయం భారీగా పెరిగిపోతోంది. ఇలా కర్నూలులోని ఏ సంస్థ కూడా బిల్లులు వసూలు చేయడం లేదు. ఆక్సిజన్‌ను ఆసుపత్రి వరకు సంస్థ వాహనాల్లోనే ఉచితంగా తీసుకొచ్చి మరీ అందిస్తున్నారు. జీజీహెచ్‌లో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.డెలివరీ రుసుముల పేరుతో భారీగా బిల్లులను దండుకుంటున్నారు. ఆయా వ్యయాలు కూడా ఊహించలేనంత భారీగా ఉంటున్నాయి. రూ.16.99 లక్షల విలువైన ఆక్సిజన్‌ను సరఫరా చేయడానికి రూ.13.32 లక్షలు వ్యయమైనట్లు చూపుతున్నారంటే దుబారా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వివరణ కోసం 'ఈనాడు' ప్రతినిధి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఏడాదికి రూ.4.75 కోట్ల వ్యయం

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి 1,050 పడకల సామర్థ్యం కలిగుంది. అత్యవసర, గుండె వైద్యం, చిన్నపిల్లల విభాగం తదితర విభాగాల్లోని ఐసీయూల్లో 200 వరకు పడకలు ఉన్నాయి. ఇతర విభాగాల్లో అవసరమైతే ఆక్సిజన్ అందించేందుకు వీలుగా పైపులైను వ్యవస్థలు ఏర్పాటు చేశారు. దీంతో 500కు పైగా పడకలకు ఆక్సిజన్ సదుపాయం ఉంది. నిత్యం సుమారు 100- 150



మంది రోగులకు ఆక్సిజన్ పెట్టి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆక్సిజన్ కొనుగోలు కోసం నెలకు రూ.33.95 లక్షలు (2022 బిల్లుల ప్రకారం) వెచ్చిస్తున్నారు. ఈ లెక్కన సంవత్సరానికి రూ.4.75 కోట్ల వరకు వ్యయమవుతోంది.

**50 శాతం ఎక్కువ చెల్లింపులు**

2018లో వైద్యవిద్య సంచాలకుల ఆదేశాల మేరకు ఆక్సిజన్ సరఫరాకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. శ్రీభరత్ ఫార్మా, మెడికల్ ఆక్సిజన్ డిస్ట్రిబ్యూటర్స్, లిండే ఇండియా లిమిటెడ్ సంస్థలతో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పంద సమయంలో క్యూబిక్ మీటర్ ఆక్సిజన్ ధర రూ.31.36 (జీఎస్టీతో కలిపి) అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 2 శాతం ధర పెంచాలన్న నిబంధన పెట్టుకున్నారు. దీంతో పాటు మరికొన్ని కొనుగోలు ఆప్షన్లు కూడా ఇచ్చారు. ఆ ఒప్పందం ప్రకారం చెల్లిస్తున్న ధర చాలా ఎక్కువగా ఉందని.. బయట మార్కెట్లో అంత ధరల్లేవని ఆరోపణలు వెల్లువెత్తినా డీఎంఈ నుంచి వచ్చిన ఆదేశాలను సాకుగా చూపి భారీ ఎత్తున కొనుగోళ్లు చేస్తున్నారు.జీజీహెచ్ కొనుగోలు చేస్తున్న ధరతో పోలిస్తే కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రులు కొనుగోలు చేస్తున్న ఆక్సిజన్ ధర ఏకంగా 50 శాతం తక్కువగా ఉండటం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రులకు సరఫరా చేస్తున్న ధరకంటే ఇంకా తక్కువ ధరకే జీజీహెచ్‌కు ఆక్సిజన్ లభ్యమయ్యే అవకాశం ఉన్నా ఆ కాంట్రాక్ట్ రద్దుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా రూ.కోట్లలో అదనపు భారం పడుతోంది.

# మ్యారీడ్ హీరోయిన్ రెబలిజం

తనదైన అందం, నట ప్రతిభతో దాదాపు రెండు దశాబ్దాల పాటు పరిశ్రమను ఏలింది కత్రిన కైఫ్. 2003లో బూమ్ అనే చిత్రంతో బాలీవుడ్ కి పరిచయమైంది. ఆ తర్వాత వెంకీ సరసన మల్లీశ్వరి చిత్రంతో టాలీవుడ్ కి పరిచయమైంది. బాలీవుడ్, టాలీవుడ్ లో టాప్ హీరోల సరసన నటించిన కత్రిన ఇటీవల పూర్తిగా ప్రయివేట్ లైఫ్ కి ప్రాధాన్యతనిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో విక్కీ కౌశల్ ని పెళ్లాడిన కత్రిన ఆ తర్వాత సినిమాల పరంగా వేగం తగ్గించింది. సల్మాన్ తో టైగర్ ఫ్రాంఛైజీలో నటిస్తోంది. 2023లో టైగర్ 3, 2024 లో మెర్రి క్రిస్మస్ చిత్రాల్లో నటించిన కత్రిన, 2025లో ఇంకా ప్రాజెక్ట్ ని ప్రకటించలేదు. కొన్ని నెలలుగా కత్రిన ప్రెగ్నెన్సీ గురించి పుకార్లు వినిపిస్తున్నా దానిని అధికారికంగా కన్ఫామ్ చేయలేదు. మరోవైపు కత్రిన ఫోటోషూట్ల పరంగానూ ఇతరులతో పోలిస్తే వెనకబడి ఉంది. సోషల్ మీడియాల్లో రేర్ గా మాత్రమే స్పెషల్ ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. నిన్ననే బర్త్ డే జరుపుకున్న ఈ బ్యూటీకి ప్రియాంక చోప్రా,



కరీనా సహా ఇండస్ట్రీ సహచరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు కత్రిన తదుపరి సినిమా ప్రకటన గురించి ఆసక్తిగా వేచి చూస్తున్నా దానికి సంబంధించి ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడం ఆశ్చర్యపరిచింది. తాజాగా కత్రిన త్రోబ్యాక్ ఫోటోషూట్ ని షేర్ చేసిన %-%ఎల్లే ఇండియా%-% మ్యాగజైన్ దీనికి ఆసక్తికర క్యాప్షన్ ఇచ్చింది. ఎల్లే వివరాల ప్రకారం.. ఇది 2019లో తీసిన ఫోటోషూట్. ఆ సమయంలో ఎప్పుడూ ఆకర్షణీయంగా ఉండే కత్రిన మా కవర్‌ను అందమైన శైలిలో అలంకరించింది. కత్రిన రెడ్ కార్పెట్ నడకలు, వెండితెర వెలుగులు ప్రతిదీ గేమ్ ఛేంజరే. క్లీన్ లైన్స్, బోల్డ్ సిల్హౌట్‌లు ఎక్కువ ప్రయత్నించకుండానే అందరి దృష్టిని ఆకర్షించే నిశ్శబ్ద విశ్వాసం కత్రిన. బాలీవుడ్ పవర్ హౌస్ గా ఏల్తున్న కత్రిన నిజమైన క్వీన్ అని ఎల్లే ప్రశంసించింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కత్రిన రకరకాల డిజైనర్ దుస్తుల్లో అందంగా ఫోజులిచ్చింది. ఇందులో బికినీ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. మ్యారీడ్ హీరోయిన్ రెబలిజం అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. అయితే విక్కీని కత్రిన 2021లో పెళ్లాడింది. అంతకంటే ముందే ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ అయింది.

# నేషనల్ క్రష్ జోరు తగ్గించిందా?

నేషనల్ క్రష్ కొత్త సినిమా కమిట్ మెంట్ల జోరు తగ్గించిందా? అతివేగం ప్రమాదకరమని వేగాన్ని తగ్గిం చిందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. గత ఏడాది పుష్ప 2 రిలీజ్ అనంతరం అమ్మడు వరుసగా రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. బాలీవుడ్ లో ఛావాతో బ్లాక్ బస్టర్ అందుకోగా, సికిందర్ ఫ్లాప్ లో ఆ హిట్ ని బ్యాలెన్స్ చేసేసింది. ఇటీవల రిలీజ్ అయిన కుబేర తో మరో గ్రాండ్ విక్టరీని అందుకుంది. మొత్తంగా రెండేళ్ల రష్మిక గ్రాఫ్ పరిశీలిస్తే ఎంతో మెరుగ్గా ఉంది.

**సౌండింగ్ గట్టిగానే:** వరుస విజయాలు అమ్మడిని అగ్ర పథాన కూర్చోబెట్టాయి. ప్రస్తుతం తెలుగులో ది గర్ల్ ఫ్రెండ్ అనే లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకు మంచి బజ్ ని తీసుకొచ్చాయి. రష్మిక కు సరైన టైమ్ లో పడిన ఉమెన్ సెంట్రిక్ చిత్రంగా మార్కెట్ లో సౌండింగ్



గట్టిగానే వినిపిస్తోంది. దీంతో పాటు బాలీవుడ్లో థామాలో నటిస్తోంది. ఇందులోనూ అమ్మడు శక్తివంతమైన పాత్రలో అలరించనుంది. అయితే ఈ రెండు చిత్రాలు రష్మిక కమిట్ అయి చాలా కాలమవుతోంది.

**ఛాన్సులొచ్చినా నో అంటోందా:** ఇవి రెండు రెండేళ్ల క్రితమే కమిట్ అయిన చిత్రాలు. మరి చేతిలో కొత్త కమిట్ మెంట్లు ఏవైనా ఉన్నాయా? అంటే ఒక్కటి కూడా లేదు. అవకాశాలు రాక కమిట్ అవ్వలేదా? అంటే రష్మికకు అవకాశాలు రాకపోవడం ఏంటి? అమ్మడు ఊ అనాలి గానీ దర్శక, నిర్మాతలు క్యూలో నిలబడతారు. మరే కారణంగా కమిట్ అవ్వ లేదంటే? అతివేగం ప్రమాదకరం అనే కారణం తెరపైకి వస్తోంది. అవకాశాలు వచ్చాయని కమిట్ అయి చేస్తే? అవి సరైన పాత్రలు కాకపోతే మొదటికే మోసం వస్తుందని రష్మిక కొత్త సినిమాలేవి కమిట్ అవ్వడం లేదన్న విషయం తెలిసింది.

**వచ్చే ఏడాది వరకూ ఆగాల్సిందే:** కెరీర్ పీక్స్ లో ఉందని ఏదో ఒకటి చేసేయడం కంటే? నిక్కమైన నీలంమొక్కటి చాలు అన్న తరహాలో కథాబలం సినిమా ఒక్కటి చేసినా చాలని భావిస్తోందిట. ఇటీవల వచ్చిన కొన్ని తెలుగు, హిందీ అవకా శాలను ఆ కారణంఆనే రిజెక్ట్ చేసిందిట. ప్రస్తుతానికి ఏ సినిమాలకు కమిట్ అవ్వకూడదని కొత్త సినిమాలు ఏవైనా వచ్చే ఏడాదే సైన్ చేసేలా? ఓ ప్రణాళిక సిద్ధం చేసుకుందని సమాచారం. ఆ ప్రకారమే ముందు కెళ్తుందిట. మొత్తానికి రష్మిక పాన్ ఇండియా ఇమేజ్ ఎక్కడా దెబ్బ తినకుండానే ఓ ప్లానింగ్ ప్రకారమే ముందుకెళ్తుందని తేటతెల్లమవుతోంది.




# చాయ్ వాలా: ఎమోషన్ తో కనెక్ట్ అయ్యే సినిమా



టాలీవుడ్‌లో సెన్సిబుల్ సినిమాల కోసం ఎదురుచూసే ప్రేక్షకుల కోసం వస్తోన్న కొత్త చిత్రం చాయ్ వాలా. యంగ్ హీరో శివ కందుకూరి హీరోగా హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు నిర్మించిన ఈ సినిమాకు ప్రమోద్ హర్ష దర్శకత్వం వహించారు. తాజాగా విడుదలైన టీజర్‌తో సినిమా మీద ఆసక్తి మరింత పెరిగింది. “నా చాయ్ విలువ రూ. 15.. అంతకంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా నా విలువ పడిపోతుంది” అంటూ రాజీవ్ కనకాల చెప్పిన డైలాగ్‌తో టీజర్ ఆరంభం కావడం అందరినీ ఆకట్టుకుంది. శివ కందుకూరి చెప్పిన లైన్, “ప్రతీ పేజీలో కల్కి స్టోరీ రాస్తే పాస్ అయిపోయేవాళ్లం కదరా” అని చెప్పడం యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉంది. ఫాదర్ అండ్ సన్ ఎమోషన్స్, లవ్ ట్రాక్, యూత్ కనెక్ట్ కలగలిపి చూపించిన ఈ టీజర్ ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఉంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ కందుకూరి మాట్లాడుతూ “థియేటర్‌లో వదిలేయకుండా ఇంటికి తీసుకెళ్లే చిత్రాలే హిట్ అవుతాయి. చాయ్ వాలా చూసిన తరువాత ఎమోషన్‌తో బయటకు వస్తారు. శివ, రాజీవ్ కనకాల, తేజు అశ్వినీ లాంటి నటీనటులు అద్భుతంగా చేశారు” అన్నారు. ఆయనతో పాటు టీమ్‌కి సంబంధించిన ఇతరులు కూడా సినిమా పట్ల నమ్మకం వ్యక్తం చేశారు. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ “చాయ్ వాలా టీమ్‌తో నాకు మంచి బంధం ఏర్పడింది. ఈ సినిమా చూసిన తర్వాత తండ్రితో తప్పక మాట్లాడాలని అనిపిస్తుంది. రాజీవ్ కనకాల గారితో పనిచేయడం నాకు లైఫ్‌లో గుర్తుండిపోతుంది. తేజు అశ్వినీ చాలా టాలెంటెడ్ ఆర్టిస్ట్. మా సినిమా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను” అన్నారు. దర్శకుడు ప్రమోద్ హర్ష మాట్లాడుతూ “ప్రతీ మనిషి జీవితంలో జరిగే సంఘటనలే మా సినిమాలో ఉంటాయి. శివ ఈ కథకు సరైన ఫేస్ అని అనిపించింది. అందుకే ఆయనకే కథ చెప్పాను” అన్నారు. నిర్మాత వెంకట్ పాపుడిప్పు మాట్లాడుతూ “ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసుకొని చూడు అని అంటారు. కానీ సినిమా చేస్తేనే అసలు విషయం తెలుస్తుంది.

కొన్ని సీన్లు చూడగానే నా కంట నీళ్లు వచ్చాయి” అని ఎమోషనల్ అయ్యారు. రాజీవ్ కనకాల, తేజు అశ్వినీ, రాజ్ కుమార్ కసిరెడ్డి వంటి నటీనటులు కూడా చాయ్ వాలా కథ, దర్శకత్వం, టెక్నికల్ టీమ్‌ను ప్రశంసించారు. ప్రత్యేకంగా రాజీవ్ కనకాల “శివ ఆకలితో ఉన్న ఆర్టిస్ట్, ఎంతో ఎత్తుకు వెళ్లాలి” అని చెప్పడం హైలైట్ అయ్యింది. డీఓపీ క్రాంతి అందించిన విజువల్స్, రైటర్ ఇమ్రాన్ రాసిన డైలాగులు సినిమాకు బలమైన పాయింట్స్ అని టీమ్ పేర్కొంది. త్వరలోనే థియేటర్లలో ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించనుంది.

# కబీర్ సింగ్ ను గుర్తుచేస్తున్న సైయారా



బాలీవుడ్ రొమాంటిక్ డ్రామా ‘సైయారా’ బాక్సాఫీస్ వద్ద భారీ విజయం వైపునకు దూసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. జూలై 18న రిలీజైన ఈ సినిమా, ఓపెనింగ్ రోజు పెద్దగా వసూళు సాధించలేదు. అయితే మౌత్ టాక్ వల్ల వీకెండ్ అయిన శనివారం పుంజుకుంది. రెండో రోజు ఆక్యుపెన్సీ పెరిగింది. దీంతో మల్టీప్లెక్స్ లు ఫుల్ అవుకున్నాయి. తొలి రోజుతో పోలిస్తే, రెండో రోజు కలెక్షన్లు 15- 20 శాతం పెరిగిటన్లు తెలుస్తోంది. దీంతో శనివారం రోజే రూ.24 కోట్ల నెట్ వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఓపెనింగ్ డే కు రెండో రోజుకు స్పందన పెరిగిందన డానికి ఇదే ఉదాహరణ. దీంతో ఓవరాల్ గా సినిమాకు స్పందన పెరగడంతో థియేటర్ల సంఖ్య కూడా పెంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. బాలీవుడ్ తోపాటు నార్త్ లో యూపీ, బీహార్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో అయిత ఓపెనింగ్ రోజు కూడా డీసెంట్ కలెక్షన్లు వచ్చాయి. మరీ ముఖ్యంగా ఢిల్లీ, యూపీ సర్క్యూట్ లలో సైయారా కు విశేష ఆదరణ దక్కుతోంది. అక్కడ ఇది బ్లాక్ బస్టర్ సినిమాలు ఛావా, సికిందర్, హౌస్ ఫుల్ 3 చిత్రాలను దాటేసింది. దీంతో నార్త్ లో ఈ సినిమా నిలకడగా వసూళ్లు సాధిస్తుందని ట్రేడ్ వర్గాల అంచనా. అయితే ఇదంతా చూస్తుంటే గతంలో బాలీవుడ్ బ్లాక్ బస్టర్ కబీర్ సింగ్ ట్రెండ్ ను సైయారా ఫాలో అవుతున్నట్లు అనిపిస్తోంది. కబీర్ సింగ్ ఏ సర్టిఫికేట్ సినిమా కావడంతో కొన్ని పరిమితులతోనే రిలీజ్ అయ్యింది. ఆ తర్వాత హిట్ టాక్ తో మెల్లిగా పికప్ అయ్యింది. అలా కబీర్ సింగ్ భారీ విజయం దక్కించుకుంది. ఇప్పుడు సైయారా విషయంలోనూ ఇదే జరిగేలా కనిపిస్తుంది. ఓపెనింగ్ డే అంతంత మాత్రం ఉన్న కలెక్షన్లు, రెండో రోజు పెరిగాయి. ఇక మూడోరోజు ఆదివారం కావడంతో వసూళ్లు ఇంకా పెరిగే ఛాన్స్ ఉంది. పైగా కబీర్ సింగ్ ఏ సర్టిఫికెట్, కానీ సైయారా ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ ను కూడా ఆకర్షిస్తుంది. ఒకవేళ బాక్సాఫీస్ వద్ద ఇదే జోరు కొనసాగితే సైయారా 2025లో బాలీవుడ్ లో సూపర్ హిట్ సినిమాల్లో ఒకటిగా నిలుస్తుందని ట్రేడ్ పండింతులు చెబుతున్న మాట!

# మల్లెపూల అందంతో కీర్తి కిర్రాక్ గ్లామర్ టచ్

రెగ్యులర్ గా సాంప్రదాయత్మక పాత్రల్లో కనిపించే కీర్తి సురేష్, ఇటీవల తన స్టైల్ ట్రెండ్ ను ఒక్కసారిగా మార్చేసింది. ఆమె యాక్టింగ్, పాత్ర ఎంపికలు విశేషంగా ఉంటే.. ఇప్పుడు ఫ్యాషన్ స్టేట్మెంట్ కూడా ఓ లెవల్‌కి వెళ్లిపోయింది. ఇటీవల ఓటీటీలో విడుదలైన ‘ఉప్పు కప్పురంబా’ సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న కీర్తి లుక్ చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. సంప్రదాయ దుస్తులతో ట్రెండీ లుక్‌ని మిక్స్ చేస్తూ ఇచ్చిన షాక్ హైలైట్ అయ్యింది. సాధారణంగా చీరకట్టులో కనిపించే కీర్తి ఈసారి సరికొత్త లుక్‌తో ఫ్యాషన్ లవర్స్‌కి టాక్ పాయింట్ అందించింది. డెనిమ్ కార్సెట్ టాప్‌తో కలిపిన కాటన్ బ్లూ చీర, తలనిండా మల్లె పూలతో జడ, గోల్డ్ బ్యాంగిల్స్, నెక్లెస్ వంటి ఆభరణాలు ఆమె లుక్‌ను మరింత హైలైట్ చేశాయి. ఈ మిక్స్ ట్రెడిషనల్ లుక్‌తో



సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. సింపుల్‌గా ఉండే కీర్తి ఇంతగానూ గ్లామరస్‌గా మారిపోవడం ఓ మెజిక్‌లా ఉందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. తాజాగా విడుదలైన ‘ఉప్పు కప్పురంబా’ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్లలో పాల్గొన్న కీర్తి, ఈ స్పెషల్ లుక్‌తో అభిమానులను అలరించింది. చీరకట్టులో మోడర్న్ టచ్ ఇచ్చినప్పటికీ, మల్లె పూల జడతో సంప్రదాయ శైలికి న్యాయం చేసింది. ఈ లుక్‌లో ఆమె స్పష్టంగా చెప్పకుండానే ఓ సందేశాన్ని ఇచ్చిందన్నట్టుగా ఉంది. స్టైల్‌లో కూడా తన మార్క్ ఉంటుంది అని. కీర్తికి ఇది ఒక ఫ్యాషన్ టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. చీరలో గ్లామర్ టచ్ ఎలా ఇస్తారో చూపించడమే కాకుండా, ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ కూడా పెంచింది. కీర్తి సురేష్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. రివాల్వర్ రీటా వంటి తమిళ చిత్రాలతో పాటు బాలీవుడ్‌లో కూడా దూసుకుపోతోంది. తెలుగులో ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులపై చర్చలు జరుపుతోందన్న టాక్ ఉంది.

# నెగిటివిటీ వస్తుందని తెలిసి కూడా ఆ సినిమా చేశా

సెలబ్రిటీలు ఏం చేసినా సెన్సేషనే. హీరోయిన్ల విషయంలో ఇది ఇంకాస్త ఎక్కువగా ఉంటుంది. వాళ్లు చేసేది ఎక్కడైనా సరే సిట్యుయేషన్స్ తో పన్లేకుండా వారి గురించి ఈజీగా మాట్లాడేస్తుంటారు. వారి కష్టాన్ని చూడకుండా ఎంతో మంది హీరోయిన్ల విషయంలో నెగిటివ్ కామెంట్స్, ట్రోల్స్ చేస్తూ ఉంటారు. అయితే కొందరు ఆ కామెంట్స్ ను పట్టించుకుని ఫీలైతే, మరికొందరు మాత్రం వాటిని లైట్ తీసుకుంటూ ఉంటారు. తాజాగా కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్ ఈ విషయంపై మాట్లాడారు. అనుపమ ప్రధాన పాత్రలో నటించిన పరదా సినిమా ఆగస్ట్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న అనుపమ సోషల్ మీడియాలో వస్తున్న కామెంట్స్ ను పట్టించుకోవడం మానేసినట్టు వెల్లడించారు.

**మొదట్లో చాలా బాధపడ్డా...** కెరీర్ స్టార్టింగ్ లో ప్రతీ పోస్ట్‌కీ వచ్చిన



కామెంట్లన్నీ చదివేదాన్నని, అప్పట్లో నెగిటివ్ కామెంట్స్ విని చాలా బాధపడ్డానని, కానీ ఎక్స్‌పీరియెన్స్ వచ్చాక అవన్నీ చాలా చిన్న విషయాల్లా అనిపిస్తున్నాయని, అందుకే అసలు కామెంట్స్ గురించి పట్టించుకోవడం లేదని, కేవలం తాను ఏం చెప్పాలనుకుంటున్నానో ఆ విషయాన్ని చెప్పి వదిలేస్తున్నట్టు తెలిపారు.

**కావాలని హీరోయిన్లను ఇబ్బంది పెడతారు...** టిల్లూ స్క్వేర్ సినిమా రిలీజ్ కు ముందు కూడా తనపై, తన పాత్రపై నెగిటివ్ కామెంట్స్ చాలా వచ్చాయని, కానీ సినిమా రిలీజయ్యాక తన క్యారెక్టర్ కు, నటనకు మంచి కాంప్లిమెంట్స్ వచ్చాయని, సినిమా రిలీజ్ టైమ్ లో నెగిటివిటీ వస్తుందని తెలిసి కూడా తాను లిల్లీ పాత్రను చేశానని, అలాంటి ఛాలెంజింగ్ రోల్స్ చేసినప్పుడే నటిగా మరో మెట్టు ఎక్కగలమని, ముందు అనుకున్నట్టే టిల్లూ స్క్వేర్ ప్రమోషన్స్ లో చాలా మంది ఇబ్బందికర ప్రశ్నలు అడిగారని, ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ హీరోయిన్లనే అడుగుతారని, దానికి కారణం హీరోయిన్స్ ను అలాంటి ప్రశ్నలు అడిగితేనే వాళ్లకు ఎక్కువ వ్యూస్ వస్తాయి కాబట్టి అని, ఆ టైమ్ లో అడిగిన ప్రశ్నలకు ఆన్సర్లు ఇవ్వడం చాలా కష్టంగా మారిందని అనుపమ చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536